ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కరీంనగర్
: fb.com/vaartha Digital
Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
16-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 105 పేజీలు: 8+16 వెల: 6.50




## జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

నాంపల్లి స్టేషన్‌లో అగ్ని ప్రమాదం

ప్రయాణికులు సురక్షితం

7లో




## భగ్గుమన్న పెట్రోలు, డీజిల్

### లీటరుకు రూ. 3, సిఎన్‌జి రూ. 2 పెంపు

**న్యూఢిల్లీ:** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభం, ప్రపంచ ముడిచమురు ధరలలో భారీ పెరుగుదల నేపథ్యంలో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఒఎంసిలు) పెరుగుతున్న నష్టాలతో సతమతమవుతున్నందున, శుక్రవారం దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.3కుపైగా పెంచాయి. ఇరాన్, అమెరి కాల మధ్య ఉద్రిక్తతల కారణంగా సరఫరాకు దీర్ఘకాలం అంతరాయం కలుగుతుందనే భయాలతో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 >>2

| | పెట్రోలు | డీజిల్ |
|---|---|---|
| హైదరాబాద్ | రూ.110.89 | రూ.100.71 |
| విజయవాడ | రూ.113.03 | రూ.98.96 |
| ఢిల్లీ | రూ.97.77 | రూ.90.67 |
| కోల్‌కతా | రూ.108.74 | రూ.95.13 |
| ముంబై | రూ.106.68 | రూ.93.14 |
| చెన్నై | రూ.103.67 | రూ.95.25 |



శుక్రవారం అబుదాబిలో ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మొహమద్ బిన్ జాయెద్ తో చర్చలు జరుపుతున్న ప్రధాని మోడీ

# 500 కోట్ల డాలర్ల యుఎఇ పెట్టుబడులు

### భారత్ అభివృద్ధికి అరబ్ ఎమిరేట్స్ చేయూత

### ప్రధాని మోడీ సమక్షంలో ఒప్పందాలు

### సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై ద్వైపాక్షిక చర్చలు

**అబుదాబి, మే 15:** భారత్ అభివృద్ధి పథంలో ఎమిరేట్స్ దీర్ఘకాలిక వాణిజ్య బంధంతో కొనసాగుతోందని ప్రధానిమోడీ అన్నారు. విభిన్న రంగాల్లో ప్రధానిమోడీ సమక్షంలోనే ఎమిరేట్స్ 500 కోట్ల డాలర్ల పెట్టుబడులకు ముందుకువచ్చింది. ఎమిరేట్స్ ఎన్బీడీ మూడు బిలియన్ డాలర్లు ఆర్‌బిఎల్ బ్యాంకులో పెట్టుబడులు పెడు తోంది. అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ >>2

# 2034 దాకా నేనే సిఎం

### కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే నా లక్ష్యం

### తర్వాత కేంద్ర రాజకీయాల్లోకి

### డ్రగ్స్ కేసులో ఇన్వాల్వ్ అయితే కీళ్లు విరగ్గొడతా

### వచ్చే ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి రాహుల్ : సిఎం రేవంత్



శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మే15:** గాంధీ కుటుంబానికి దేశంపై విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సిఎం మాట్లాడారు. టిడిపిలో పదేళ్లు పనిచేశానని.. సిఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని సిఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని.. కాని ప్రధాని కావాలన్న లక్ష్యంలేదని స్పష్టం చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని కూడా ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీ పేరును ఒప్పిస్తా మని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెం >>2




# జూన్ 21న నీట్ రీ ఎగ్జామ్

### వచ్చే యేడాది నుంచి ఆన్‌లైన్

### ప్రశ్నపత్రం లీక్ నిందితులను వదలం: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 15:** ఈ నెల 3న జరిగిన నీట్ పరీక్షను రద్దుచేసిన నేపథ్యంలో తిరిగి పరీక్షను జూన్ 21న నిర్వహించనున్నట్టు కేంద్రం ప్రకటించింది. అలాగే ఇకపై నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కాకుండా ఉండటం కోసం వచ్చే యేడాది నుంచి పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్టు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. నీట్ పరీక్ష రద్దు అనంతరం పరిణామాల నేపథ్యంలో కేంద్ర మంత్రి గురువారం ఉన్నతస్థాయి సమావేశాన్ని తన నివాసంలో నిర్వహించారు. సమావేశంలో తిరిగి పరీక్షను నిర్వహించడంపై సుదీర్ఘంగా చర్చించి జూన్ 21న తిరిగి నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విషయాలను కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం మీడియాకు తెలిపారు. వచ్చేయేడాది 2027-28 నుంచి ఆన్‌లైన్ >>2

## కొడుకుని తీసుకొచ్చి స్టేషన్‌లో బండి సంజయ్ అప్పగించాలి

### తప్పెవరిదో విచారణలో తేలుతుంది: సిఎం రేవంత్

2లో

# 'సర్'పై తొందరపడొద్దు

### ఏకకాలంలో జనగణన, సర్ ప్రక్రియతో ఉద్యోగులపై పెరిగిన పనిభారం

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డికి పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ వినతిపత్రం

**హైదరాబాద్,మే 15,ప్రభాతవార్త:** జనగణనతో పాటు ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ (సర్) ఏకకాలంలో చేపట్టడంతో సిబ్బందిపై పనిభారం పెరిగే అవకాశం ఉందనీ దశలవారిగా చేపడితే ఓటర్లజాబితా,జనగణనలో ఖచ్చితత్వంతో కూడిన సమాచారం ఉంటుందని పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బిఆర్‌కె భవన్‌లో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ నేతృత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, లోక్‌సభసభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బలమురి వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ,నవీన్ యాదవ్,గణేష్ కార్పొరేషన్ ఛైర్మన్‌లు ఇతర ముఖ్య నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికలఅధికారి సి. సుదర్శన్ రెడ్డితో సమావేశమై అనేక అనుమా నాలను, అభ్యంతరాలకు వివరణ కోరడంతోపాటు పారదర్శకంగా జరుపాలని కోరారు.




శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజనకు పూర్వం 25ఏళ్ల క్రితం తెలంగాణలో 2002 సంవత్సరంలో దాదాపు 3 నెలల పాటు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా నిర్వహించారని అప్పుడు ఓటర్ల సంఖ్య సుమారు 1.2 కోట్లు పెరిగిందనీ గుర్తుచేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అనంతరం జరిగిన 2004 జమిలి ఎన్నికలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్లు 5,11,46,498 ఓటర్లు ఉండగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 2025లో మొత్తం ఓటర్లు 3,35,27,925 ఉన్నారని ఇంకా కొత్త ఓటర్ల సంఖ్యపెరిగే >>2

## భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే15:** పోస్కో కేసు నిందితుడు బండి భగీరథ్ ఇంటరిమ్ ప్రొటెక్షన్ పిటీషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచా రణ జరిగింది. రెండు వైపుల నుంచి అడ్వకేట్లు వాదనలు వినిపించారు. తనను పోలీసులు అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని లేదా ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టులో దాఖలు చేసిన బండి భగీరథ్ పిటీషన్‌పై రాత్రి 9 గంటలకు విచారణ ప్రారంభమైంది. రెండున్నర గంటలకు పైగా విచారణ జరిగింది. అయితే బెయిల్ పిటీషన్‌పై తీర్పును హైకోర్టు న్యాయ మూర్తి రిజర్వ్ చేశారు. వచ్చే గురువారం తీర్పును వెల్లడిస్తామని ప్రకటించారు. కాగా, మొదట బండి భగీరథ్ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి గంటకు పైగా వాదించారు. బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు లేదా ముందస్తు బెయిల్ ఇస్తే >>2



## నల్లని మబ్బులు బారులు.. బారులు

### 26నే కేరళకు నైరుతి పవనాలు

### ముందేవస్తున్నా ఈసారి సాధారణ వర్షపాతమే!

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు భారత వాతావరణశాఖ (ఐఎండి) చల్లని కబురు చెప్పింది. ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నప్ప టికీ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీనికి నాలుగు రోజుల అటు ఇటుగా అంటే మే 22 నుంచి మే 30 మధ్య రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉందని వివరించింది. సాధారణంగా కేరళలో రుతు పవనాలు జూన్ 1నాటికి ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఉత్తరం వైపు నకు విస్తరిస్తూ దేశంలోని మిగిలిన ప్రాంతాలకు చేరతాయి. కేరళలో రుతుపవనాల ప్రవేశం ద్వారా దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే వర్షాకాలం ప్రారంభమవుతుంది. >>2

# ఇందిరమ్మ ఇళ్లు రెండో విడత

### • జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభం • జాయింట్ సర్వేతో భూ సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే15:** పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.ముఖ్యమంత్రి రేవంతరెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు.రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహి స్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు దాసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు.

# జూన్ 2 నుంచి ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ అమలు

### • పిఆర్‌సి నివేదికపై మరోసారి సమావేశం • పాత పెన్షన్‌పై సిఎం, డి.సిఎంతో చర్చించి నిర్ణయం • మీడియాతో తెలంగాణ ఉద్యోగ జెఎసి నేతలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 15:** శుక్రవారం సచివాలయంలో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (జెఎస్‌సి) సమావేశంలో పలు సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చారని తెలంగాణ ఉద్యోగ జెఎసి నేతలు తెలిపారు. సుమారు 15 సంవత్సరాల తరువాత, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారిగా శుక్రవారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. సమావేశంలో పాల్గొన్న టిజిఇజెఎసి నేతలు తాము ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్టు తెలిపారు. జెఎస్‌సి సమావేశం అనంతరం జెఎసి ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరిశ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. జూన్ 2 నుంచి ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్‌ను అమలు చేయనున్నారని, ఉద్యోగుల మూలవేతనంలో 1.5 శాతం చొప్పున వసూలు చేసి, ప్రభుత్వం కూడా సమానమైన మ్యాచింగ్ గ్రాంట్ అందిస్తూ ప్రత్యేక నిధి ఏర్పాటుతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇహెచ్‌ఎస్‌న అమలు చేయనున్నట్లు తెలిపారు. పిఆర్‌సి నివేదికపై త్వరలో మరోసారి సమావేశం నిర్వహించి త్వరగా నిర్ణయం తీసు కుంటామని తెలిపారు. పెండింగ్ బిల్లులను 100 రోజులలోపు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకుం టామని పేర్కొన్నారని, 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుపై >>2



శుక్రవారం పుట్టపర్తిలో ఆధునిక యుద్ధవిమానాల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్, ఏపి సిఎం చంద్రబాబు

## పుట్టపర్తిలో యుద్ధ విమానాల ప్రాజెక్టు

### రక్షణ రంగం మరింత బలోపేతం: రాజ్‌నాథ్

పొదుపు మంత్రం



## సుప్రీం 2 రోజులు ఆన్‌లైన్

### 50% రిజిస్ట్రీ సిబ్బంది వర్క్ ఫ్రం హోం, జడ్జిల కార్‌పూలింగ్ చర్యలు

**న్యూఢిల్లీ, మే 15:** ఇంధనాన్ని ఆదా చేయడం, అనవసర ప్రయాణాలను తగ్గించడంపై కేంద్రం ఇటీవల చేసిన సిఫార్సులకు అనుగుణంగా, న్యాయమూర్తుల కోసం వర్క్ ఫ్రమ్ హోమ్ ఏర్పాట్లు, వర్చువల్ విచారణలు, కార్ పూలింగ్ వంటి పలు చర్యలను సుప్రీంకోర్టు ప్రకటించింది. కొత్త ఆదేశాలప్రకారం, సోమవారాలు, శుక్రవారాలు, ప్రత్యేకంగా ప్రకటించిన ఇతర రోజుల్లో >>2



ఢిల్లీలో సైకిల్‌పై వెళుతున్న మంత్రి తోకన్ సాహు



అమరావతిలో సైకిల్‌పై వెళుతున్న మంత్రి కొల్లు రవీంద్ర



శుక్రవారం పుట్టపర్తిలో సత్యసాయి సమాధివద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఏపి సిఎం చంద్రబాబు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చిత్రంలో ఉన్నారు.

# జూన్ 21న నీట్ రీ ఎగ్జామ్

>> (సిబిటి విధానం)లో నీట్ పరీక్ష నిర్వహిస్తామని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూడటమే తమ ధ్యేయమని చెప్పారు. జూన్ 21 నుంచి నీట్ పరీక్షను తిరిగి నిర్వహిస్తామన్నారు.. జూన్ 14 నుంచి అడ్మిట్‌కార్డులు విడుదల చేస్తామని తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వార్తలు రాగానే వెంటనే విచారణకు ఆదేశాలు జారీచేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులు ఎవరూ నష్టపోకూడదనే పరీక్ష రద్దుచేసి మళ్లీ నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే తమ ప్రధాన కర్తవ్యమని, విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలనేది తమ మొదటి ప్రాధాన్యమన్నారు. పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఉపేక్షి ంచబోమని, పేపర్ ఎలా లీక్ అయింది? ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందనేది పూర్తి వివరాలు బహిర్గతమవుతాయన్నారు. సిబిఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందని, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు చూసి భయపడొద్దని, అడ్మిట్‌కు సంబంధించి ఇంకా మెరుగుపరుస్తామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పరీక్ష ఫీజు లేకుండా విద్యార్థులకు ప్రయోజనం కల్పిస్తున్నామని, ప్రశ్నపత్రం లీక్ చేసిన వారిని వదిలిపెట్టేది లేదని, సిబిఐ అదే పనిలో ఉందన్నారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. వ్యవస్థ బలోపేతానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ-2026 పరీక్షను జూన్ 21న(ఆదివారం) నిర్వహించనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్టు తెలిపింది. దేశంలోని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న నిర్వహించిన నీట్ యూజీ పరీక్షను దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. నీట్ ప్రశ్న పత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రీఎగ్జామినేషన్‌కు అభ్యర్థులు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరంగానీ లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. నీట్ పేపర్ లీక్‌పై సిబిఐ దర్యాప్తు కొనసాగుతోంది, ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడిన విషయం తెలిసిందే. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్రం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు, అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది.

# భగ్గుమన్న పెట్రోలు, డీజిల్

>> డాలర్ల మారకు పై కొనసాగుతున్న తరుణంలో, ఇటీవలి నెలల్లో రిటైల్ ఇంధన ధరలలో ఇది అత్యంత భారీ పెరుగుదలలో ఒకటిగా నిలిచింది. ఇంధన మార్కెట్ ఒత్తిడి నేపథ్యంలో సిఎన్‌జి ధరలు కూడా పెరిగాయి. పెట్రోల్, డీజిల్‌తో పాటు, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి) ధరలు కూడా పెరిగాయి. సిఎన్‌జి ధరలను కిలో గ్రాముకు రూ.2 మేర పెంచాయి. పెరిగిన ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ సవరణ తర్వాత, ఢిల్లీలో సిఎన్‌జి ధర ఇప్పుడు కిలోగ్రాముకు రూ.79.09గా ఉంది. సిఎన్‌జి ధర పెరుగుదల వల్ల, తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయ ఇంధనంగా గ్యాస్ ఆధారిత వాహనాలపై ఆధారపడే ప్రజా రవాణా నిర్వాహకులు, వాణిజ్య వాహన యజమానులు, రోజువారీ ప్రయాణికులపై ప్రభావం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు ముడి చమురును గణనీయంగా అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నప్పటికీ, ఆ భారాన్ని పూర్తిగా వినియోగదారులపై మోపలేకపోతున్నాయని, ఫలితంగా ఆర్థిక నష్టాలు పెరిగిపోతున్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ వివరించారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం గతంలో ఎక్సైజ్ సుంకాలను తగ్గించడం వల్ల, నెలకు దాదాపు రూ.14 వేల కోట్ల ఆదాయ నష్టం వాటిల్లినట్లు శర్మ పేర్కొన్నారు.

**నిత్యావసరాల ధరలకు రెక్కలు?**

పెట్రోల్, డీజిల్‌ధరలు పెరిగిన నేపథ్యంలో ఆ ప్రభావం రవాణా రంగంపై పెనుప్రభావం పడనుంది. తద్వారా నిత్యావసర ధరలు అమాంతం పెరిగే అవకాశముందని పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే టోకు ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయిలో నమోదవుతుండటం, ఐదే శాతంలో చమురు ధరలు పెంపుతో దేశీయంగా సామాన్యుల జేబులకు చిల్లుపడే అవకాశం ఎక్కువగా ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# సుప్రీం 2 రోజులు ఆన్‌లైన్

>> కొత్తగా విచారణకు వచ్చే కేసుల విచారణలు పూర్తిగా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారానే జరుగుతాయి. సుప్రీంకోర్టు వేసవి విరామ సమయంలో వెకేషన్ బెంచ్‌ల ముందు జరిగే అన్ని విచారణలు కూడా వర్చువల్‌గా జరుగుతాయని సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ భరత్ పరాశర్ పేర్కొన్నారు. "న్యాయవ్యవస్థకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, వీడియో కాన్ఫరెన్సింగ్ కోసం లింక్‌లను సకాలంలో పంపడం, స్థిరమైన వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యాలను నిర్వహించడం, సకాలంలో సాంకేతిక సహాయం అందించడం వంటివి రిజిస్ట్రీ నిర్ధారించుకోవాలి" అని ఆ మెమోలో ఉంది. "ఇంధనాన్ని గరిష్టంగా వినియోగించుకునేలా చూసేందుకు" తమ న్యాయమూర్తులు తమలో తాము కార్‌పూలింగ్ ఏర్పాట్లను ప్రోత్సహించాలని "ఏకగ్రీవంగా తీర్మానించారని" సుప్రీంకోర్టు తెలిపింది. మరో ముఖ్యమైన చర్యగా, రిజిస్ట్రీలోని ప్రతి శాఖ లేదా విభాగంలో 50 శాతం వరకు సిబ్బందిని వారానికి రెండు రోజుల వరకు ఇంటి నుండి పని చేయడానికి సుప్రీంకోర్టు అనుమతించింది.

కోర్టు పరిపాలన నిరంతరాయంగా సాగేలా చూసేందుకు మిగిలిన సిబ్బంది కార్యాలయంలోనే భౌతికంగా హాజరు కావాల్సి ఉంటుందని సర్క్యులర్ స్పష్టం చేసింది. "సంబంధిత రిజిస్ట్రార్ వారం ప్రారంభానికి ముందే వారపు రోస్టర్‌ను సిద్ధం చేయాలి" అని సర్క్యులర్ పేర్కొంది. ఇంటి నుండి పని చేయడానికి అనుమతించబడిన అధికారులు టెలిఫోన్‌లో అందుబాటులో ఉండాలని, అవసరమైనప్పుడు కార్యాలయానికి హాజరయ్యేందుకు సిద్ధంగా ఉండాలని కూడా అది ఆదేశించింది. పని స్వభావం కారణంగా భౌతిక హాజరు అవసరమైనా శాఖలలో లేదా రిమోట్ పనితీరు ప్రభావవంతంగా లేదని తేలిన చోట, ఇంటి నుండి పని చేసే (డబ్ల్యుఎఫ్‌హెచ్) ఏర్పాటును పరిమితం చేయడానికి లేదా సవరించడానికి సంబంధిత రిజిస్ట్రార్లకు ఈ సర్క్యులర్ అధికారం కల్పించింది. పశ్చిమ ఆసియాలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా తలెత్తిన ఆర్థిక ఒత్తిళ్ల దృష్ట్యా, ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవాలని, అనవసర ఖర్చులను నివారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పౌరులకు, సంస్థలకు విజ్ఞప్తి చేసిన కొద్ది రోజులకే ఈ చర్యలు వెలువడ్డాయి. ఇప్పటికే ఢిల్లీ ప్రభుత్వంతో సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు, వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యుఎఫ్‌హెచ్) ఏర్పాట్లు, ప్రజా రవాణాను ప్రోత్సహించడం, అధికారిక ప్రయాణాలపై ఆంక్షలు వంటి ఇంధన పొదుపు చర్యలను ప్రకటించాయి.

## విదేశాలకు పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ పయనం

**హైదరాబాద్,మే15,ప్రభాతవార్త:** వ్యక్తిగత పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల పాటు విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈ ఐదు రోజులు అందుబాటులో ఉండనని కార్యకర్తలకు తెలిపారు.



శుక్రవారం అబుదాబిలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న యుఎఇ అధ్యక్షుడు షేక్ మొహమద్ బిన్ జాయెద్

# 500 కోట్ల డాలర్ల యుఎఇ పెట్టుబడులు

>> అథారిటీ బిలియన్ డాలర్లు భారత్‌లోని నీఫ్‌లో పెట్టుబడులకు ముందుకువచ్చింది. కీలక మౌలిక వనరుల ప్రాజెక్టులపై ఈ నిధులు వ్యయంచేస్తారు. అలాగే ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ మరో బిలియన్ డాలర్లు సమ్మాన్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాలోపెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించింది. అలాగే భారత్ ఎమిరేట్స్ మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం కూడా పెంపొందిందని ఇరువురునేతలు అంగీకరించారు. ఈ విభాగంలో భారత్ యుఎఇలు రక్షణరంగ పారిశ్రామిక సహకారం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. డిఫెన్స్ టెక్నాలజీ, శిక్షణ, సంయుక్త కసరత్తుల్లో పరస్పర సహకారంతోపాటు సైబర్ డిఫెన్స్, మారిటైమ్ సెక్యూరిటీ విభాగాల్లో పరస్పర సహకారం ఉంటుందని ప్రకటించారు. వీటితోపాటే ఇంధనరంగం, రక్షణరంగం, టెక్నాలజీ,ఈ షిప్ బిల్డింగ్ విభాగాలతోపాటు వాణిజ్యంలోకూడా మరింత ముందుకువెళ్లేదిశగా సమగ్ర చర్చలుజరిగినట్లు ప్రధానిమోడీ ప్రకటించారు. రెండు దేశాలమధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం జరిగింది. దీనితో రెండుదేశాల ద్వైపాక్షిక వాణిజ్యం సరికొత్త శిఖరాలకు చేరిందని వెల్లడించారు. ఈసందర్భంగా ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహ్మద్‌బిన్ జాయెద్ అల్‌నహ్యాన్‌ను భారత్‌లో పర్యటించాలని ప్రధాని ఆహ్వానించారు. ఐదుదేశాల పర్యటనలో భాగంగా తొలిదేశం అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించి వివిధ వాణిజ్య,రక్షణరంగ ఒప్పందాలకు చర్చలుజరిపారు. నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ దేశాల్లో పర్యటించి ఈనెల 20వ తేదీ తిరిగి భారత్‌కు రానున్న ప్రధానిమోడీ ఎమిరేట్స్ అధ్యక్షుడు అల్‌నహ్యాన్‌తో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై విస్తృత చర్చలుజరిపారు. ఈసందర్భంగా ఎమిరేట్స్ పై పశ్చిమాసియా యుద్ధం కారణంగా దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అబూదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ఆడ్‌నాక్‌తో వ్యూహాత్మక ఒప్పందం ఇరువురునేతల సమక్షంలోనే జరిగింది. భారత్‌కు పెట్రోలియం రిజర్వులు 30 మిలియన్ బ్యారెళ్లవరకూ సరఫరాచేసేందుకు ముందుకువచ్చింది. అలాగేభారత్‌లో గ్యాస్ నిక్షేపాలపైనా పరస్పర సహకారానికి అంగీకారంకుదిరింది. ఇందుకోసం ఐఒసి, ఆడ్‌నాక్ సంస్థలు దీర్ఘకాలిక ఎల్పీజీ సరఫరాకు ఒప్పందం చేసుకున్నాయి. ముడిచమురు, ఎల్ఎన్‌జి, ఎల్పీజి సరఫరాల్లో ఎమిరేట్స్ భారత్‌కు తోడ్పాటు అందిస్తుందని ప్రకటించారు.

# కొడుకుని తీసుకొచ్చి స్టేషన్‌లో బండి సంజయ్ అప్పగించాలి

## తప్పెవరిదో విచారణలో తేలుతుంది: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మే15:** మహిళలపైన నేరాలను తమ ప్రభుత్వం నియంత్రించిందని సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో 8వ తేదీ రాత్రి బాలిక తల్లి పేట్ బషీరాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. 9వ తేదీన విచారణ ప్రారంభించి కేసు పెట్టామని చెప్పుకొచ్చారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సిఎం మాట్లాడారు. తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ భద్రత కోసం 10 వేల మంది పోలీసులు పనిచేశారని చెప్పారు. 11వ తేదీన సెక్షన్లు సవరించి వెంటనే నోటీసులు జారీ చేశామని తెలిపారు. బండి భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారనిప్రస్తావించారు. ఫిర్యాదులను బేరీజువేసుకుని అమ్మాయి స్టేట్‌మెంట్‌ను తీసుకొని నోటీసులు ఇచ్చారని తెలిపారు. తొందరపడితే 1000 మంది పోలీసులను తీసుకుని ఇంటి మీద పడ్డారని అంతా విమర్శలు చేసేవారని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సినిమా వాళ్లు, రాజకీయ నాయకులు ఎవరైనా తనకు మినహాయింపులు లేవని స్పష్టం చేశారు. బాలిక కేసులో ఎలాపడితే అలా చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. బండి సంజయ్‌కి తాను సహాయం చేస్తే పోక్సో కేసు పెట్టం కదా..? అని ప్రశ్నించారు. పోక్సో కేసు పెట్టామంటేనే తన కమిట్‌మెంట్ ఏమిటో తెలుస్తుంది కదా..? అని పేర్కొన్నారు. హోంమంత్రిగానే కాకుండా ముఖ్యమంత్రిగా చర్యలు తీసుకోవడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కేసులో ఐదు టీంలు పనిచేస్తున్నాయని వివరించారు. బండి సంజయ్ ఇంటికి పోలీసులు నోటీసులు ఇవ్వడానికి వెళ్లారని తెలిపారు. బండి సంజయ్‌కి, బీఆర్ఎస్‌లకి మధ్య ఎక్కడ చెడిందో తనకు తెలియదని విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇప్పుడు పోలీసు ఆఫీసర్ కాదని చెప్పారు. కెటిఆర్, బండి సంజయ్‌కి మధ్య ఏముందో తనకు తెలియదని అన్నారు. చట్టప్రకారం నిందితులను శిక్షి స్తామని హెచ్చరించారు. ఈకేసు పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని తెలిపారు. ఏ చిన్న తప్పుచేసినా పిల్లల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. అమ్మాయికి రెండు బర్త్ సర్టిఫికెట్స్ ఉన్నాయని.. వాటన్నింటిని పోలీసులు విచారించాలి కదా..? అని ప్రశ్నించారు.తనను జైల్లో పెట్టిన మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం పట్ల తాను కఠినంగా వ్యవహరించానా..? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ విలీనాన్ని బండి సంజయ్ వ్యతిరేకించారని కోపమా..? అని అడిగారు. తాను సత్రం నడపటం లేదని.. ప్రభుత్వాన్ని నడుపుతున్నానని చెప్పుకొచ్చారు. వందశాతం బాధితులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని.. తప్పు చేసిన వారిని శిక్షి స్తామని స్పష్టం చేశారు. డిసెంబర్‌కు ముందే జరిగిన ఘటనపైనే బాధితురాలి ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. నాలుగు నెలలు వెనక్కు వెళ్లి అప్పటి ఘటనలను విచారించాలంటే సమయం పడుతుందని చెప్పారు. బండి సంజయ్ బాధ్యత తీసుకుని తన కొడుకును తీసుకువచ్చి పోలీసు స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. నోటీసు సమయంలో స్పందించకపోతే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. కుమారుడు విషయంలో బండి సంజయ్ తీరు నైతికంగా తప్పు అని తెలిపారు. కీలకమైన హోదాలో ఉండి హుందాగా వ్యవహరించాల్సిన బాధ్యత సంజయ్‌పై ఉందని, కొడుకు కారణంగా ఆయనకు తలవంపులు వచ్చాయని చెప్పారు. కొడుకు మీద కేసు నమోదు అయితే బండి సంజయ్‌ను అరెస్ట్ చేయాలా అని సిఎం రేవంత్ ప్రశ్నించారు.

# ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ అమలు

>> ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో చర్చించి, వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని సిఎస్ హామీ ఇచ్చినట్టు జెఎసి నేతలు తెలిపారు. జిల్లా స్థాయిలో కూడా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారని, ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని విద్యాశాఖ సెక్రటరీకి సూచించినట్లు వెల్లడించారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుపై సాధ్యా సాధ్యాలను పరిశీలించాలని విద్యాశాఖ సెక్రటరీకి సూచించారని, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కూడా స్పౌస్ కేటగిరిలో పరిగణించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. వారంలో ఐదు రోజుల పనివిధానాన్నికూడా పరిశీలనలోకి తీసుకుంటామని సిఎస్ పేర్కొన్నారనితెలిపారు. తెలంగాణ అభి వృద్ధిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరింత నిబద్ధతతో పని చేయాలని సిఎస్ కోరారని జెఎసి నేతలు తెలిపారు.

# నల్లని మబ్బులు బారులు.. బారులు

>> రుతుపవనాల రాకపై స్పష్టత రావడంతో దేశవ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. గతేడాది రుతుపవనాలు మే 24న కేరళలోకి ప్రవేశించినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. రానున్న 24 గంటల్లో దక్షి ణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కూడా తెలిపింది. రుతుపవనాలు ఉత్తరం వైపుగా విస్తరిస్తున్న కొద్దీ ఆయా ప్రాంతాల్లో వేసవిలో ఉండే తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొంది. ఈ యేడాది రుతుపవనాలు ముందుగానే పలకరించినా.. దేశంలో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఎల్ నినో పరిస్థితులు ఏర్పడటమే ఇందుకు కారణం కావొచ్చని అభిప్రాయపడింది. ఈ యేడాది జూన్ సెప్టెంబర్‌లో నైరుతి రుతుపవనాల వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని తెలిపింది. దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం 92 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. ఫలితంగా దేశంలోని వ్యవసాయం, నీటి వనరులు, పర్యావరణంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పింది. రుతుపవన కాలంలో దేశంలో సాధారణంగా సుమారు 80 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. కాగా, ఈ రుతుపవన కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు (1971-2020 మధ్య కాలం) 87 సెం.మీగా ఉంది.

# 2034 దాకా నేనే సిఎం

>> టును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జిడిపిని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.గ్రామంలో పేద రైతులు, ప్రభుత్వ పాఠశాలల్లో చదవే విద్యార్థులు ఎలా ఉంటారో నాకు తెలుసు..రాష్ట్రంలో ప్రజలు, పార్టీలు శాశ్వతం.. ప్రభుత్వాలు మారుతుంటాయి.. ప్రభుత్వాలు ఏర్పాటు చేశాక తాత్కాలిక సంక్షేమం, అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తుంటాయి.. దీర్ఘకాలిక విజన్ లేకుండా పోతుంది.. సంక్షేమం నిరంతర ప్రక్రియ. అభివృద్ధి దీర్ఘకాలిక దృష్టితో చేయాలి అని చెప్పారు.

గతంలో కాంగ్రెస్ అధికారం ఉన్నప్పుడు ఐటిఐఆర్ కారిడార్ హైదరాబాద్‌కు ఇస్తే.. తర్వాత ప్రభుత్వం రద్దు చేసింది.. ఇలాంటివి చాలా ఉదాహరణలున్నాయని చెప్పారు.. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ స్కూల్స్‌లో జీరో డ్రాపౌట్స్ ఉన్నాయి. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఇవ్వడం వల్ల విద్యార్థినులకు ఖర్చు లేకుండా చేశాం..28 నెలల్లో 10 వేల కోట్ల రూపాయలను ఆర్టీసీకి చెల్లించాం.. సగటున మహిళకు 10 వేల రూపాయల ఆదా అయ్యేలా చేశాం..ఆర్టీసీలో దివాళ తీసి ప్రైవేటు పరం చేస్తారనే అభిప్రాయం గత ప్రభుత్వంలో ఉండేది ఈ రోజు ఆర్టీసీని లాభాల బాట పట్టించాం.. ప్రతి నెల ఆర్టీసీకి 350 కోట్ల రూపాయలు ప్రభుత్వం నుంచి చెల్లిస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పుడు 98 శాతం ఆకిపెన్సీ ఉంది.. ఆదా అవుతున్న డబ్బులను మహిళలు అనేక రకాలుగా లబ్దిపొందుతున్నారు..హైదరాబాద్ పరిధిలో ఉన్న డీజీల్ బస్సుల స్థానంలో ఈవీ బస్సులను ప్రవేశపెడుతున్నాం, 3000 ఈవీ బస్సులను ప్రవేశపెట్టడంతో ద్వారా డీజీల్ రూపంలో ఆర్టీసీ ఖర్చు చేస్తున్న 2000 కోట్లు ఆదా చేస్తాం అని చెప్పారు.

ముఖ్యమంత్రి అయ్యేంత వరకు 17 ఏళ్ల పాటు ప్రతిపక్షంలోనే ఉన్నాను.. ప్రజా సమస్యలపైన అవగహన ఉంది..ప్రపంచ స్థాయి మేధావులు, కార్పొరేట్ దిగ్గజాలను తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వాములను చేశాం.. పాలసీ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రజాభిప్రాయాన్ని కూడా తీసుకున్నాం.. ప్రపంచంలోని అన్ని పెద్ద సంస్థలను ఆహ్వానించి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించామన్నారు. క్యూర్ పరిధిలో 2053 చదరపు కిలోమీటర్ల పరిధిలో కోటీ ముప్పై నాలుగు లక్షల మంది నివసిస్తున్నారు.క్యూర్ ప్రాంతంలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను తరలిస్తున్నాం.. చెరువులు, కుంటలు, నాలాలు, పబ్లిక్ పార్కులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారు..చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమించుకుంటే ప్రకృతి క్షమించదు..నగరాలను కలుషితం చేస్తే మరిచిపోతారు కాని నీటి వనరులను కలుషితం చేస్తే ఎప్పటికి మరిచిపోరని జపాన్‌లో ఒక సామెత ఉంది.. యుద్ధం జరిగినప్పుడు కొందరు అమాయకులు కూడా చనిపోతారు.. యుద్ధ నీతే అది.. ఆక్రమణలదారులకు ముందే నోటీసులు ఇస్తున్నాం.. తుమ్మిడికుంటను ఆక్రమించుకుని ఫంక్షన్ హాల్ కట్టుకుంటే నీళ్ల ఎక్కడికి పోతాయి? అని ప్రశ్నించారు. 'ఏదీ నేను నా కోసం, నా ఇంటికి కోసం చేయడం లేదు.. ప్రజల కోసం చేస్తున్న.. కొన్ని తిట్లు భరిస్తా... బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్నది ఏ పార్టీ నాయకుడు..? ఆ కుంటను ఆక్రమించుకున్న నాయకుడు హెలికాప్టర్ పెట్టి పార్టీ నాయకులపైన పూలు చల్లించాడు అని పేర్కొన్నారు.

చెరువులు ఆక్రమించుకున్న వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తున్నాం.. మూసీలో అక్రమంగా ఉంటున్న వారిని ప్రభుత్వం ఉదారంగా ఆదుకుంటుంది.. డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తాం..విద్య, వైద్యం అందిస్తామని హామీ ఇచ్చాం.. వారిని పరోక్షంగా కొందరు ప్రోత్సహిస్తున్నారు.ఎవరూ మూసీ మురికిలో ఉండాలని కోరుకోరు..మూసీ నది పేరు ను ఎవరూ తమ బిడ్డలకు పెట్టుకోలేదు.. మూసీ అంటే మురికికూపం గుర్తుకు రావడం వల్లనే అలా జరిగింది. నేరాన్ని చూసి చూడనట్లు వదిలేయను. 10 వేల కిలోమీటర్ల ఫ్యూర్ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం.. ఐటీ సంస్థలు, జీసీసీలు, పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు చేస్తాం, రేర్‌లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం.. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం.. ఇప్పటి వరకు కాలనీలు, జోన్లు మాత్రమే ఏర్పాటు చేశారు..కాని మేం మొదటి సారి ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం..మౌలిక సదుపాయాలు కల్పిస్తే సిటీ నిర్మాణం సాధ్యమేనన్నారు. డ్రగ్స్‌ను కంట్రోల్ చేయడానికి ఈగల్ ఫోర్స్‌ను తీసుకువచ్చాం.. ఫామ్ హౌస్‌లో పార్టీలు చేసుకుని దొరికిపోయి నన్ను విమర్శిస్తున్నారు..దీపావళి రోజున చిచ్చుబుడ్లు కాల్చాలి కాని మందుబుడ్లు పెడతానంటే ఎలా..? గంజాయిని నియంత్రిస్తుంటే కూడా విమర్శిస్తున్నారు.. విలన్ గా చూస్తున్నారు..నా కోసం ఏదీ చేయను.. నా జీవితంలో నేను చాలా సౌకర్యంగా ఉన్నా.. 100 శాతం సంతృప్తితో ఉన్న భవిష్యత్తు తరాల కోసం ఏదైనా చేయాలన్నదే ఆలోచన అని చెప్పారు.

## కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే15:** సిఎం రేవంత్ రెడ్డి తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నారు. శుక్రవారం నాలుగు వాహనాలతోనే ట్రాఫిక్ మధ్యలో సీఎం కాన్వాయ్ వెళ్లింది.

## వారం - వర్జ్యం

16-05-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
అమావాస్య రా. 1.29
భరణి సా. 5.28
వర్జ్యం : తె.4.00-తె.5.24
దు.తె.5.36-ఉ.7.16
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** వ్యాపారాలు లాభాలు దిశగా సాగుతాయి. ఉద్యోగులకు బదిలీల సూచన. స్పెక్యులేషన్ లాభిస్తుంది. వస్త్రలాభం.

**వృషభం:** సినీ, కళా సాహిత్యరంగంలోని వారు తాత్కాలిక వ్యాపారాలు చేసే వారు జాగ్రత్తగా మెలగవలసి వస్తుంది.

**మిథునం:** మీ ఆలోచనలకు ఆకృతి కల్పించటానికి నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. చాకచక్యంగా వ్యవహరించి వ్యవహారాలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

**సింహం:** ఆహ్లాద భరితమైన వాతావరణంలో కాలాన్ని గడుపుతారు. ఆదాయ, వ్యయాలు సరి సమానంగా ఉంటాయి. వాహన సౌఖ్యం.

**కన్య :** మీపై వచ్చిన కొన్ని అపనిందలను రూపుమాపుకో గలుగుతారు. ఆలోచనలలో స్థిరత్వం ఏర్పడుతుంది. వస్త్రలాభం.

**తుల :** స్పెక్యులేషన్ వైపుకు మొగ్గు చూపేకన్నా స్థిరాస్తుల కొనుగోళ్ళుపైన పెట్టుబడిని మదుపుచేయుట మంచిది.

**వృశ్చికం:** ఉద్యోగంపరంగా బాధ్యతలు పెరుగుతాయి. బ్యాంకింగ్ రంగంలోని వారికి ఫైనాన్స్ వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంది.

**ధనుస్సు:** మీ పరపతి పెంపొందుతుంది. నరదృష్టి అధికంగా ఉంటుంది. మిత్ర బృందాలలోనికి కొత్త వారిని చేరుస్తారు.

**మకరం :** వెన్ను నొప్పి బాధిస్తుంది. ఈ రోజు సానుకూల ఫలితాలు ఎక్కువగా అందుకోగలరు. ఋణాలు తీరుతాయి.

**కుంభం:** గతంలో ఆగిపోయిన వ్యవహారా లను తిరిగి ప్రారంభించడానికి చేసే యత్నాలు ఫలితాలు. వస్త్రాలను కొనుగోలు చేస్తారు.

**మీనం:** అలంకరణకు ప్రాముఖ్యత నిస్తారు. దూరప్రాంత ప్రయాణాలు సానుకూల పడతాయి. రాజకీయ పరిచయాలు ఉపకరిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తొందరపడొద్దు

>> అవకాశం ఉందనీ సవరణ అత్యంత జాగ్రత్తగా చేయాడానికి ఒకటిన్నర, రెండు సంవత్సరాల వనకు కొనసాగిస్తూ దశవారిగా ఈ ప్రక్రియ చేపడితే ఓటర్లలోకూడా భయాందోళనలు ఉండవని సూచించారు. రాజకీయ పార్టీలకు 2002, 2025 నాటి ఓటర్ల జాబితాలను సాఫ్ట్ కాపీలో అందించాలి, ప్రాధాన్యంగా ఒసిఆర్ లేదా మెషిన్‌రీడబుల్ కాపీతో పాటు హార్డ్ కాపీ ని కూడా అందించాలనీ ఆయన రాష్ట్రఎన్నికల అధికారి సుదర్శన్‌ను కోరారు.హాస్టల్‌లో నివాసం ఉండే విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకొంటున్నారనీ సొంతవూళ్లో కూడా ఓటుహక్కు కలిగి ఉండే అవకాశం ఉంటుందని అటువంటి నమోదును జాగ్రత్తగా పరిశీలించి ఒకే చోట ఓటుహక్కు ఉండేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ అనంతరం తుది జాబితా ప్రకటించే ముందు అభ్యంతరాలు తెలిపేందుకు మరోనెల అదనంగా గడువు పొడగించాలని చెప్పారు. రాజకీయపార్టీల బూత్‌లెవల్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వడంతోపాటు సవరణలో వారి భాగస్వామ్యం తీసుకోవాలని ఓటర్ల తొలగింపు విషంలో వ్యక్తిగతంగా వారి సంబందీకులకు కూడా నోటిసులు ఇవ్వాలని సలహా ఇచ్చారు. కర్ణాటకలో చిలుమే కుంభకోణం,నకిలీ బిఎల్ఓ మోసపూరిత రిజిస్ట్రేషన్‌లు కట్టడి చేయడానికి తెలంగాణలో నిఘాపెంచాలని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా పౌరసత్వం రుజువు చేసుకోవాలని ఇసి డిమాండ్ చేయకూడదని కోరారు.

**'లౌకికవాద ఓటర్లను జాబితా నుంచి తొలగించే కుట్రలు అడ్డుకొందాం'**

లౌకిక ఓటర్లను జాబితానుంచి తొలగించే కుట్రలు అడ్డుకొంటామని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ తెలిపారు. బిఆర్‌కెభవన్ ముందు ఎన్నికల అధికారిని కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ బండి సంజయ్, కిషన్ రెడ్డిలు దొంగ ఓట్లతో గెలవడంతో వాళ్లకు వణుకు పుడుతుందనీ ఎద్దేవాచేశారు. 14 రాష్ట్రాల్లో 'సర్'తో ఓట్ల చోరీ జరిగిందనీ ఆయన ఆవేదన చెందారు. బెంగాల్ ఎన్నికలు నిదర్శనం దేశంలో 8.2 కోట్ల ఓట్లుజోడిస్తే ఆఒక్క రాష్ట్రంలోనే 90లక్షల ఓట్లు దుర్మార్గంగా తొలగించారనీ ఆయన ఆవేదన చెందారు. బెంగాల్‌లో రాజకీయ సమీకరణాలు మారి అధికారంలోకి రావాల్సినపార్టీలో ఓడిపోయిందని ఆరోపించారు.

# బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

>> విచారణలో పోలీసులకు పూర్తిగా సహకరిస్తారని చెప్పారు. బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్ ఇవ్వాలని కోరారు. తన కుమార్తెను డిసెంబర్ 31న రెండురోజులపాటు ఫామ్‌హౌస్‌లో ఉంచారని బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. బలవంతంగా ఆల్కహాల్ తాగించారన్నారు. ఫామ్ హౌస్‌లో బాధితురాలు, నిందితుడితో పాటు మరో ఐదుగురు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం బాధితురాలి తల్లికి తెలిసిన వెంటనే ఎందుకు ఫిర్యాదు చేయలేదని న్యాయవాది నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. తర్వాత బాధితురాలు తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు వాదించారు. బాధితురాలు 2008 ఆగస్టు 12న జన్మించారని, బాధితురాలు మైనర్ అని ఈ కేసులో నిందితుడు బండి భగీరథ్‌కు బెయిల్ ఇవ్వొద్దని వాదించారు.



# 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్

**న్యూఢిల్లీ, మే 15:** అఖిల భారత డ్రగ్గిస్టు కెమిస్ట్స్ అసోసియేషన్ ఇచ్చిన దేశవ్యాప్త బంద్ పిలుపుమేరకు దేశంలో ఈనెల 20వ తేదీ 12.4 లక్షలకుపైగా మెడికల్ షాపులు బంద్ పాటిస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీల అండదండలతో నడుస్తున్న ఆన్‌లైన్ ఫార్మసీలు భారీ డిస్కౌంట్లు ఇస్తూ సంప్రదాయ మెడికల్ షాపులకు నష్టం కలిగిస్తున్నాయంటూ కెమిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఫార్మసీ కంపెనీలు ఈ పోటీని తట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు చెబుతున్నారు. అనియంత్రిత ఆన్‌లైన్ అమ్మకాలు, ఈఫార్మసీ డిస్కౌంట్‌కు వ్యతిరేకంగా ఏఐఓసీడీ బంద్ కు పిలుపునిచ్చింది. ఈ బంద్ కారణంగా సాధారణ మందుల కొనుగోలు ఒకరోజు పాటు తీవ్రంగా ప్రభావితం కానుంది. ఆసుపత్రులకు అనుగుణంగా ఉన్న ఎమర్జెన్సీ ఫార్మసీలు మాత్రం తెరిచి ఉండే అవకాశం ఉంది. 20న బంద్ నేపథ్యంలో అత్యవసర మందులను ముందుగానే కొనుగోలు చేయాలని సంఘం సూచించింది. ఈ బంద్‌లో కెమిస్టులు, ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొంటారు. ఆన్‌లైన్ పార్మసీని నియంత్రించాలని డిమాండ్ చేస్తోంది. ఆన్‌లైన్ కంపెనీలు తక్కువ ధరలకు మందులు విక్రయించడం వల్ల స్థానిక వ్యాపారులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌లు దుర్వినియోగం అవడమే కాకుండా, ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని పేర్కొంది. కార్పొరేట్ సెక్టార్లు ఇస్తున్న డిస్కౌంట్లను నియంత్రించాలని, ధరల నియంత్రణ విషయంలో నిబంధనలు పాటించకుండా నేషనల్ ప్రైస్ అథారిటీ ప్రకారం విక్రయాలు జరగాలని డిమాండ్ చేసింది. కొవిడ్ సమయంలో పేషెంట్లకు మందులు డోర్ డెలివరి చేశారని, ఈ సౌకర్యాన్ని నిలిపివేయాలని కోరింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు వెళ్ళినప్పటికీ, సరైన చర్యలు తీసుకోలేదని ఏఐఓసీడీ పేర్కొంది.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ తల్లి శకుంతలకు గుండెపోటు



**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి బండి సంజయ్ తల్లి శకుం తలకు గుండెపోటు వచ్చింది. కుటుంబ స భ్యులు ఆమెను హుటా హుటిన హైదరాబాద్ తరలించారు. గచ్చిబౌలి లోని మెడికవర్ ఆసు పత్రిలో చికిత్స అంది స్తున్నారు. శకుంతలకు గుండెకు స్టెంట్ వేసి వైద్యులు అత్య వసర చికిత్స అంది స్తున్నారు. హుటాహుటిన కేంద్రమంత్రి ఆసుపత్రికి చేరుకుని తల్లి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు.

# హైస్పీడ్ రైలు కనెక్టివిటీపై ఫోకస్

### రైల్వే శాఖతో కలిసి డిపిఆర్‌లు సిద్ధం చేయాలని సిఎస్ దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 15:** హైస్పీడ్ రైలు కారిడార్లపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు శుక్రవారం సచివా లయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముంబై, చెన్నై, బెంగళూరుకు హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర రైల్వేశాఖతో కలిసి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047కు హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులు కీలకమని చెప్పుకొచ్చారు. పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాలకు ఈ ప్రాజెక్ట్‌తో ప్రయోజనకరమని తెలిపారు.

హైదరాబాద్ – పుణె – ముంబై కారిడార్‌లకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేయాలని మార్గ నిర్దేశం చేశారు. 671 కిలోమీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో 93 కిలోమీటర్లమేర భూసేకరణ అవసరమని తెలిపారు. హైదరాబాద్–బెంగళూరు, చెన్నై కారిడార్లకు 123 కిలోమీటర్ల భూ సేకరణ కావాలని చెప్పారు. హెచ్ఎండిఏ, జిఎంఆర్ రైల్వేశాఖల సమన్వయంతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతులపై చర్యలకు సీఎస్ రామకృష్ణరావు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన ఇ-సెట్ పరీక్ష

### 95.94 శాతం హాజరు

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఈ సెట్–2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 95.94 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు ఈ సెట్–2026 కన్వీనర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ కళాశాలలలో 2026–27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఫార్మసీ విభాగాలలో అందించే రెగ్యులర్ బీఈ, బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల్లో లాటరల్ ఎంట్రీ ప్రవేశం కోసం డిప్లొమా, బీఎస్సీ(గణితం) డిగ్రీ అభ్యర్థుల కొరకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి తరపున ఈ సెట్–2026 ప్రవేశ పరీక్షను నిర్వ హించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇసెట్ పరీక్షను నిర్వహించింది. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. కంప్యూ టర్ ఆధారిత ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహించారు. శుక్రవారం జరిగిన పరీక్షను ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, ఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి చంద్ర శేఖర్ పర్యవేక్షించారు. హైదరాబాద్ రీజియన్‌లో 36 పరీక్షా కేంద్రాల్లో 12,038 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 11,467 మంది(95.25శాతం) మంది హాజరు కాగా, తెలంగాణ జిల్లాల్లో 40పరీక్షా కేంద్రాల్లో 6,588 మందికిగానూ 6403 మంది(97.19శాతం) హాజ రయ్యారు. రాష్ట్రంలో 76 పరీక్షా కేంద్రాల్లో 18,626 మందికిగానూ వారిలో 17870 మంది హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో పరీక్షకు 95.94 శాతం మంది హాజరయ్యారు.

# కర్ణాటకలో బ్రిడ్జిపై వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

### ఆరుగురు మృతి, పది మందికి తీవ్రగాయాలు

**మునీరాబాద్ (కర్ణాటక), మే 15:** కర్ణాటకలో మునీరాబాద్ సమీపంలో ఒక బ్రిడ్జిపై వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో, ట్రాక్టర్ బ్రిడ్జి మీద నుంచి కింద పడి ఆరుగురు మృతిచెందారు. మరో పది మంది గాయపడ్డారు. ఈ ఘటన కర్ణాటక, కొప్పాల్ జిల్లా, మునీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో, తుంగభద్ర బ్రిడ్జిపై జరిగినట్లు పోలీసులు తెలిపారు. 15 మంది ప్రయాణికులతో కూడిన ట్రాక్టర్ హులిగే దేవాలయానికి వెళ్తుండగా తుంగభద్ర బ్రిడ్జిపై వెనుక నుంచి ఒక లారీ వచ్చి ఢీకొంది. లారీ డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేకపోవడం వల్ల ఈ ఘటన జరిగింది. లారీ ఢీకొనడంతో బ్రిడ్జిపై ఉన్న ట్రాక్టర్ ఆ బ్రిడ్జి మీద నుంచి కిందికి పడిపోయింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న 15 మంది ప్రయాణికుల్లో ఆరుగురు ఘటనా స్థలంలోనే మరణించారు. మిగతా తొమ్మిది మంది గాయపడ్డారు. ఘటన సమాచారం అందుకున్న కొప్పాల్ పోలీసులు, అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రుల్ని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై విచారణ జరుపుతున్నట్లు కొప్పాల్ ఎస్పీ రామ్ ఎల్ అరాసిద్ధి తెలిపారు. గాయపడినవారిలో మరికొందరిపరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు

# మోడీ తప్పులకు ప్రజలు మూల్యం చెల్లింపు

♦పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై రాహుల్ మండిపాటు ♦వసూళ్లు ప్రారంభించారంటూ కాంగ్రెస్ ఫైర్ ♦ ముందే ఊహించినదే: తృణమూల్ కాంగ్రెస్ ♦ఇక సైకిల్ ప్రయాణమే: అఖిలేష్ సెటైర్లు ♦పెంపును సమర్థించుకున్న కేంద్ర మంత్రులు

**న్యూఢిల్లీ, మే 15:** పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం లీటరుకు రూ.3 చొప్పున పెంచిన నేపథ్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతోపాటు ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. పశ్చిమ ఆసియా సంఘ ర్షణల నేపథ్యంలో ఇంధన ధరల పెంపునకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీయే కారణమని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన 'తప్పుల' వల్ల ప్రజలు నష్టపోయారని, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును 'వసూలీ' (దోపిడీ)గా అభివర్ణిస్తూ, ఈ పెంపును విడతల వారీగా చేస్తామని పేర్కొన్నారు. 'మోడీ ప్రభుత్వ తప్పుకు ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు. రూ.3 షాక్ ఇప్పటికే తగిలింది. మిగిలిన వసూలు విడతల వారీగా జరుగుతుంది' అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో రాహుల్‌గాంధీ రాసుకొచ్చారు.

'ద్రవ్యోల్బణ వ్యక్తి మోడీ. ఈ రోజు మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే తన వసూళ్లు ప్రారంభించారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు ఎక్స్‌లో కాంగ్రెస్ పోస్టు చేసింది.

ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయన్నది ఊహించనదే అంటూ తృణమూల్ కాంగ్రెస్ దుయ్య బట్టింది. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గిస్తుందా? అంటూ సువేందు అధికారి ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

ఇంధన ధరలు పెంచడంపై కేంద్రం తీరును సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సెటైర్లు వేశారు. 'మీరు ముందుకు సాగాలంటే.. సైకిల్ ఒక్కటే ఆప్షన్' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి సైకిల్ తొక్కుతూ ఉన్న క్యారికేచర్‌ను జోడించారు. సైకిల్‌పైనే ప్రయాణం కొనసాగిస్తామని ఇది వరకే చెప్పాం అని పేర్కొన్నారు.

అంతకుముందు, కేంద్ర మంత్రులు పియూష్ గోయెల్. కిరణ్ రిజిజు, ఇంధన ధరల పెంపును సమర్థించారు. భారతదేశంలో పెట్రోల్ ధరలు 3.2శాతం, 3.4శాతం పెరగడాన్ని ఇతర దేశాలతో పోలుస్తూ, పశ్చిమ ఆసియా సంఘర్షణ కారణంగా ఆ దేశాలలో ధరలు 20శాతం నుండి దాదాపు 100శాతం వరకు పెరిగాయని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఆర్థిక స్థిరత్వాన్ని, ప్రజా సంక్షేమాన్ని సమతుల్యం చేస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, ప్రభుత్వం బాధ్యతా యుతంగా పరిపాలిస్తోందని, నిర్ణయాలు తీసుకునే టప్పుడు ప్రజలకే మొదటి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన కొనియాడారు. 'పశ్చిమ ఆసియా సంఘర్షణ తర్వాత ప్రపంచం పెరుగుతున్న ఇంధన ధరలతో పోరాడుతున్న తరుణంలో, భారతదేశం ప్రత్యేకంగా నిలిచింది. అనేక దేశాలు పెట్రోల్, డీజిల్ ధరలను 20 శాతం నుండి దాదాపు 100శాతం వరకు పెంచగా, భారతదేశం ఈ పెరుగుదలను పెట్రోల్‌పై కేవలం 3.2శాతం, డీజిల్‌పై 3.4శాతానికి మాత్రమే పరిమితం చేసింది' అని రిజిజు 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.

పెరుగుతున్న ప్రపంచ ధరల నుండి రైతులు, వినియోగదారులను రక్షించేందుకు, ఇంధనంపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం ద్వారా ఎరువులపై భారీ రాయితీలను కొనసాగించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం తనపై తాను గణనీయమైన ఆర్థిక భారాన్ని మోసుకుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి ఉన్నప్పటికీ, పౌరులకు ఉపశమనం కల్పించేందుకు కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించిందని గోయల్ చెప్పారు. రైతులు ఎరువుల కోసం అధిక ధరలు చెల్లించకుండా ఉండేలా చూసేందుకు ప్రభుత్వం భారీ రాయితీ వ్యయాలను కూడా భరిస్తోందని ఆయన జోడించారు. 'కేంద్ర ప్రభుత్వం తనపై తాను మరింత భారాన్ని మోసుకుంది.

ఎక్సైజ్ సుంకం రూ. 10 తగ్గించబడింది. అదేవిధంగా, ఎరువుల విషయంలో రూ. 3,000 కోట్ల అదనపు వ్యయం ఉన్నప్పటికీ, మన రైతులు పాత ధరనే చెల్లించేలా చూస్తున్నాం; ధరలో ఎటువంటి పెరుగుదల చేయలేదు. దీని కారణంగా, లక్షల కోట్ల రూపాయల మేర 90 శాతం రాయితీని కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి వస్తోంది' అని గోయల్ పేర్కొన్నారు.

# ఉద్యోగుల హెల్త్‌కార్డులు జూన్ 2న లాంఛనంగా ప్రారంభం

### వీలైనంత త్వరలో పిఆర్‌సి నివేదిక

### జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సిఎస్ రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 15:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. 15 యేళ్ల తర్వాత జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరిడం విశేషం. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబం ధించిన వివిధ సమస్యలను వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు సమా వేశంలో ప్రస్తావించారు. ఉద్యోగులకు సంబంధించి పి.ఆర్.సి నివేదిక, హెల్త్ కార్డులు, పెండింగ్ బిల్లుల చెల్లింపులు, సర్వీస్ అంశాలు, ఉద్యో గుల బదిలీలు, 317 జి ఒ బదిలీలు, ఇతర అంశాలను సమావేశంలో చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా డిజిటల్ హెల్త్ కార్డులను లాంఛనంగా ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా సమావేశంలో ప్రస్తావించిన ఆర్థికేతర అంశాలను వీలైనంత మేరకు పరిష్కరించాలని ఉన్నతాధికా రులను ఆదేశించారు. పి.ఆర్.సికి సంబంధించి



వీలైనంత త్వరలో తెప్పించుకు నేందుకు ప్రయత్ని స్తున్నామని, ఆ దిశలో కమిషన్ కూడా తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల లో, డైరెక్టరేట్ స్థాయిల్లో కూడా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్‌లను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకో వాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఆధునీక టెక్నాలజీని వినియోగించుకొని ప్రజల సమస్యలను పరిష్క రించేందుకు కృషి చేయాలని వివిధ సం ఘాల నాయకులకు సూచించారు. ఈ సమా వేశంలో స్పెషల్ సిఎస్ మహేశ్‌దత్ ఎక్కా, సవ్య సాచి ఘోష్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా, విద్యాశాఖ ముఖ్య కార్య దర్శి డాక్టర్ యోగితారాణా, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తు, టిఎన్ జిఒ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టిజిఒ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ లచ్చిరెడ్డి, జనరల్ సెక్రెటరీ రామకృష్ణ, తహశీల్దార్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, జనరల్ సెక్రెటరీ పాక రమేష్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పోక్సో కేసు : కానిస్టేబుల్‌కు

# 31 యేళ్ల జైలు

### రూ. 12 వేలు జరిమానా విధించిన కోర్టు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), మే 15, ప్రభాతవార్త:** బోయిన్‌పల్లి పిఎస్ పరిధిలో 2020 లో నమోదైన పోక్సో కేసులో కానిస్టేబుల్‌కు 31 ఏళ్ల జైలు శిక్షతో పాటు 12 వేల జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. బాధిత బాలికకు నష్టపరిహారంగా లక్ష రూపాయలు చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2020 సంవత్సరంలో మధ్య మండల డీసీపీ వద్ద కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వరదరాజ్ సుదేశ్ బోయిన్ పల్లి తాడు బండ్ వద్ద నివాసముండే ఓ బాలిక పై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో బాధితురాలు ఫిర్యాదు మేరకు బోయిన్‌పల్లి పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితురాలిని లైంగిక వేధింపులకు గురి చేయడంతో పాటు అత్యాచారం చేసి ఆమెను బెదిరించిన ఘటనలో అతనిపై కేసు నమోదు కాగా అప్పటి నుండి కోర్టులో వాదనలు జరిగాయి. పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ఆరు సంవత్సరాల తర్వాత ఫోక్సో ప్రత్యేక కోర్టు ఈ కేసుకు సంబంధించి తుది తీర్పును వెలువరించింది. నిందితుడికి 31 ఏళ్ళు కారాగార శిక్ష విధింపు, రూ.12 వేల జరిమానా విధించిన కోర్టు బాధిత బాలికకు రూ.1 లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

## మియాపూర్‌లో సిఎ విద్యార్థి అనుమానాస్పద మృతి

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), మే 15, ప్రభాతవార్త:** మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో సిఎవిద్యార్థి కుమ్మరి జనార్తన్ అను మానా స్పదస్థితిలో మృతిచెందాడు. తన గదిలో ఉరివేసుకుని తాడుకు వేలాడుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారని గదిలో రక్తపు మరకులు ఉండటంతో జనార్థన్ మృతిపై తల్లి దండ్రులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ సంఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




సదస్సులో ప్రసంగిస్తున్న అమర్‌జీత్ కౌర్

# మోడీ తీసుకువచ్చిన 4 లేబర్‌కోడ్‌లు కార్మికుల మెడలకు ఉరితాళ్లు

### ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త :** శ్రమశక్తిపై ఆధాపడి జీవించే కార్మికులకు తీరని అన్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లు కార్మికులకు ఉరితాడులాంటివని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్ ఆరోపించారు. గతంలో ఉద్యోగులకు కనీస వేతనం 26 వేలు ఉండాలని ఆనేక పోరాటాలు చేయడం జరిగిందని, కాని ఇప్పుడు అవి సరిపోవడం లేదని ప్రస్తుతం పెరిగిన ఖర్చుల భారంతో ఒక కుటుంబ కనీస అవసరాలు తీరడానికి 31 వేలు ఉండాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో 'కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌రద్దు, 44 కార్మిక చట్టాల అమలు'పై జరిగిన సదస్సులో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు ఎఐటియుసి రాష్ట్ర ఇంచార్జి వి.ఎస్.బోస్ అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఎఐటియుసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ 150 సంవత్సరాలు పాటు కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కార్పోరేట్ శక్తులకు, వ్యాపారస్తులకు అనుకూలంఆ నూతన లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందని విమర్శించారు. ఈ లేబర్‌కోడ్‌లను అమలు చేయరాదని ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఒకవేళ అమలు చేయాలని చూస్తే కార్మిక వర్గం తిరగబడాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన విధంగా నడుచుకుంటున్నారని ఆరోపించారు.

## యాదాద్రి థర్మల్ యూనిట్ 3 కార్యకలాపాలు

### 811.99 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) యూనిట్ 3 వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. 800 మెగావాట్ల రేటెడ్ సామర్థ్యానికి గాను 72 గంటల పాటు నిరంతరాయంగా పనిచేసి, సగటున 811.99 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని విజయవంతంగా పూర్తి చేసింది. తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నల్గొండ జిల్లా, దామరచర్ల మండలం, వీర్లపాలెం గ్రామంలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థం గల 5 యూనిట్లతో, మొత్తం 4000 మెగావాట్ల స్థాపిత సామర్థంతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టులో మొదటి దశలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లు, రెండవ దశలో ఒక్కొక్కటి 800 మెగావాట్ల చొప్పున మూడు యూనిట్లు ఉన్నాయి. యూనిట్1, యూనిట్2 మరియు యూనిట్4 ఇప్పటికే ప్రారంభించబడి, వాణిజ్య కార్యకలాపాలలోకి ప్రవేశపెట్టబడ్డాయి.

# తెలంగాణ చేనేత కళకు అరుదైన ఘనత

### కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శనకు పోచంపల్లి ఇక్కత్ కళ

### ప్రదర్శించనున్న ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్, మిస్ ఆసియా ఇంటర్నేషనల్ రష్మీఠాకూర్

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** అంతర్జాతీయ వేదికపై తెలంగాణ సంస్కృతికి, 200 ఏళ్ల చరిత్ర ఉన్న చేనేత వారసత్వానికి అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్ పై భారత్ తరఫున తెలంగాణ పోచంపల్లి ఇక్కత్ చేనేత కళ ప్రదర్శితమవనుంది. ఈ నెల 17 నుండి 21 వరకు జరగనున్న 79వ కేన్స్ చలన చిత్రోత్సంలో కేంద్ర ప్రభుత్వ జౌళి మంత్రిత్వశాఖ పరిధిలోని ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్, మిస్ ఆసియా ఇంటర్నేషనల్ రష్మీ ఠాకూర్ పాల్గొననున్నారు. తెలంగాణ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా పోచంపల్లి ఇక్కత్ చేనేత వస్త్రాలు కేన్స్ రెడ్ కార్పెట్ పై మెరవబోతున్నాయని ఆమె వెల్లడించారు. 200 ఏళ్ల తెలంగాణ చేనేత వారసత్వాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే అవకాశం తనకు లభించడాన్ని ఎంతో గర్వంగా, గౌరవంగా భావి స్తున్నానని పేర్కొన్నారు. ఇది కేవలం తన విజయం మాత్రమే కాదని, పోచంపల్లిలో మగ్గం ముందు కూర్చుని వందల గంటలపాటు రాత్రింబవళ్లు శ్రమించిన ప్రతీ నేతన్న, నేతక్కల శ్రమకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. తెలంగాణ నేతన్నల చేతుల్లో రూపుదిద్దుకున్న పోచంపల్లి ఇక్కత్ ఇప్పుడు ప్రపంచ అంతర్జాతీయ వేదికపై మెరవాబోతోందని భావోద్వేగానికి గురయ్యారు. తనను ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్‌గా నియమించి, ఈ చారిత్రాత్మక అవకాశాన్ని అందించినందుకు భారత ప్రభుత్వానికి, జౌళి మంత్రిత్వశాఖకు, చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయానికి, వీవర్స్ సర్వీస్ సెంటర్‌కు రష్మీ ఠాకూర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మైలురాయిని చేరుకోవడంలో భాగస్వాములైన పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, పోచంపల్లి టై అండ్ డై సంస్థలతోపాటు పోచంపల్లి నేత కార్మికులకు ఆమె ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ చేనేత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు లభించిన ఈ అద్భుత అవకాశాన్ని ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు.

## బిసి గురుకుల ఇంటర్ కోర్సుల్లో ప్రవేశ దరఖాస్తు గడువు పెంపు

### 20 వరకు అవకాశం

### గురుకుల కార్యదర్శి బడుగు సైదులు

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీ గురుకుల ఇంటర్ కోర్సుల్లో ప్రవేశ దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్టు బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించి నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును విద్యార్థుల సౌకర్యార్థం పొడిగించడం జరిగిందన్నారు. గతంలో దరఖాస్తు గడువును ఈ నెల 15 వరకు ఉండగా.. దానిని కాస్త ఈ నెల 20 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఔత్సాహికులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని గురుకుల సొసైటీ అధికారిక వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సొసైటీ సెక్రటరీ సైదులు సూచించారు.

# బిజెపి నిజస్వరూపం బట్టబయలు

### పెట్రోలు, డీజిల్ ధరల పెంపుపై మంత్రి శ్రీధర్‌బాబు ధ్వజం

**సంగారెడ్డి బ్యూరో, మే 15, ప్రభాతవార్త :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల అనంతరం పెట్రోలు, డీజిల్ ధరలు పెంచి బిజెపి అసలు నిజ స్వరూ పాన్ని బయటపెట్టిందని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన సంగారెడ్డిలో నిర్మలా జగ్గారెడ్డి నివాసంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాక మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సమావేశంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపి సురేష్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3 పెంచడం ప్రజ లపై భారంగా మారిందని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అంత ర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గిన సమ యంలో కేంద్రం ప్రజలకు ఎప్పుడైనా ఉపశమనం కల్పించిందా అని బీజేపీని ప్రశ్నించారు. ఇప్పుడు రూ.3 పెంచి, ఇంకా ధరలు పెరిగే సంకేతాలు ఇస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలపై అదనపు భారం మోపి పేదల, సామాన్య ప్రజల నడ్డి విరచడమే బిజెపి అసలు స్వరూపమని



సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

వ్యాఖ్యానించారు. రాజకీయ అంశాలపై స్పం దిస్తూ, ప్రజలను విభజించడం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడం బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు స్నేహపూర్వకంగా జీవించాలని రాహుల్‌గాంధీ కోరుతున్నారని తెలి పారు. తెలంగాణ ప్రజలు విజ్ఞాన వంతులని, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలను అంగీకరించరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమానికే కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు అంశంపై మాట్లా డుతూ, దేశ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి భారీగా ధాన్యం మార్కెట్‌కు వచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి రెండు రోజులకు ఒకసారి ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహిస్తున్నారని, చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు హామీ ఇచ్చారు. నీట్ పరీక్ష లీకేజీ ఘటనపై కూడా మంత్రి స్పందించారు. దాదాపు 23 లక్షల విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రంలోని ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వం ఆడుకుందని ఆరోపించారు.

వార్త

మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.

న- అరిస్టాటిల్

# మరుగుతున్న చమురు!


లేదు లేదంటూనే, కాదు కాదంటూనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ ఇంధన వినియోగదారులపై కేంద్రం భారం మోపింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదంటూ వినియోగదారున్ని మభ్యపెట్టిన కేంద్రం మధ్యలో కొంతకాలం పెట్రోల్ బంక్‌ల దగ్గర హడావుడి సృష్టించింది. ఇప్పటికే ఇంధన వినియోగంలోనూపొదుపు నియంత్రణ అవసరమంటూ ప్రధాని నరేంద్రమోడీ వినియోగదారులకు దిశానిర్దేశం చేశారు. ఇంధన విషయంలో ఇప్పటికే ఇంధన తయారీ సంస్థలు అటు వినియోగదారులను ఇటు పెట్రో బంకుల యాజమానులను గందరగోళ పరచి రోడ్డెకించిన విషయం విదితమే. ప్రధానంగా ఈ నూతన పరిణామాల కారణంగా డీజిల్ ఆధారంగా పని చేసే యంత్రాలతో సాగుచేసే వ్యవసాయదారులపై సాగు ఖర్చులు పెరిగాయి. దానికితోడు ఉత్పత్తుల పెట్రోలు, రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమౌతోంది. సరకు రవాణా చేసే ట్రక్కులు పెట్రోల్, డీజిల్‌ల కోసం ఎన్నో రోజులుగా రోడ్ పక్కన నిచిలి ఉన్న ట్రక్కు డ్రైవర్లు తాము గమ్యస్థానాలకు ఎప్పుడు చేరతామోనని కంగారు పడుతున్నారు. సామాన్య వాహన వినియోగదారులకు పెట్రోలు, డీజిల్ సరఫరాపై ధరలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ ముడి చమురుపై ధరలు బాగా పెంచేసినా వీటి వినియోగంపై రోజూ వెయ్యి కోట్లు నష్టం వాటిల్లుతోందని ప్రధాని ఇప్పటికే ప్రకటించారు. ప్రభుత్వరంగ సంస్థలతో పోలిస్తే దేశంలోని ప్రయివేట్ గ్యాస్ స్టేషన్ ఆపరేటర్లు నయారా ఎనర్జీ లిమిటెడ్, షెల్ పిఎల్‌సి వంటి కొన్ని సంస్థలు కొన్ని రోజుల క్రితమే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ సరఫరా పరిమితులను విధించింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు నేటి ఇంధన ధరల పెంపుతో కాస్తంత ఊరట లభించినట్లయింది. అవి కొంతకాలంగా పారిశ్రామిక అవసరాలపై డీజిల్ ధరలను లీటరుకు అర్థరూపాయి వరకు పెంచింది. జెట్ ఫ్యూయల్ ధరలుపెరిగిన కారణంగా పలు అంతర్జాతీయ రూట్లలో తమ విమాన సర్వీసులను ఎయిర్ ఇండియా రద్దు చేసింది. తాజాగా లీటరు పెట్రోలు, డీజిల్‌పై 3.04పైసలు పెంచగా, సిఎన్‌జి లీటర్‌పై రూ.2 మేరకు కేంద్రం పెంచింది. ఇదంతా సాధారణ వినియోగదారులు తట్టుకోలేని భారమే. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్న తరుణంలో రిటైల్ పెట్రోలు, డీజిల్ ధరలను పెంచక తప్పదని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ముందుగానే హెచ్చరించారు. ప్రస్తుతం దేశంలో 76రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నాయి. మరో ప్రత్యామ్నాయ ఇంధన అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

ప్రభుత్వరంగ చమురు సంస్థల నష్టాలు తగ్గించడం కోసమైనా ఇంధన ధరల పెంపు అనివార్యం. గత కొద్దికాలంగా పెట్రోసంస్థల విన్యాసాలతో పెట్రోల్ బంకులు మూతపడ్డాయి కూడా. ఇక పెట్రోలు, డీజిల్‌లను చూస్తామోలేమోనన్న భయంతో వాహనదారులు పెట్రోలు బంకుల వద్ద బారులు తీరడం,ఆనక కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్‌కు కొరతేమీ లేదని ప్రకటించడం జరిగిపోయాయి. ఏదో 'మాట వరసకలా' అన్నట్లు కేంద్రం విశ్లేషించుకుంది తప్ప పెట్రోల్ బంక్‌ల వ్యవహారాన్ని చక్క పరచలేకపోయింది. అడపాదడపా కొన్ని ప్రాంతాల్లో ఇదే సీను. రిటైల్ అవుట్‌లెట్లలో నిరంతరాయంగా పెట్రోలు, డీజిల్ సరఫరా ఉండాలని సంకల్పించి మరికొన్ని విధాన నిర్ణయాలు తీసుకొంది. గతంలో గ్యాస్ సరఫరా విషయంలోనూ గృహ వినియోగదారులకు నిత్యం గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంచాలనే తలంపుతో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల పంపిణీపై ఆంక్షలు విధించి లేనిపోని తలనొప్పులు తెచ్చుకుంది. ఆనాటి నిర్ణయంతో నిషేధాలు సాధారణ మానవుల నెత్తిన భారం పడింది. ఇకవాటి భారం నుంచి తప్పించగల వారెవరూ లేరు. రోజువారీ కూలిలు, అసంఘటిత కార్మికులు, బయట తినుబండారాలు ఆహారం మీద బతుకు వెళ్లదీస్తే సామాన్య ప్రజానీకం మీద కోలుకోలేని బండపడింది. కొరత నిజంగా ఉందో లేదోతెలియని 'కమర్షియల్ గ్యాస్'బండలపై ఆంక్షలపేరిట సామాన్యుని నోటికాడ ముద్దకు ధరలు పెరిగిపోయాయి. తర్వాత అదేం లేదని చెప్పి నాలుక్కరచుకున్నారు. అయినా ఇక తగ్గవుకాక తగ్గవు. ఇంధన సంక్షోభం ఓ కొలిక్కి వచ్చినా ఆహార తినుబండారాలపై పెరిగిన చార్జీలకుజనం అలవాటుపడిపోతారు. వ్యాపారస్థులకు వీధి వ్యాపారులకు వాటి ధరలుతగ్గించే పరిస్థితిలేదు. తాజాగా పెట్రోలు, డీజిల్ బల్క్ అమ్మకాలపై ఆంక్షలు విధించి 'గ్యాస్' విషయంలో చేసిన తప్పేచేస్తోంది. కేంద్రం పెట్రో సంస్థల యాజమాన్యం పెట్రోల్ బంక్‌లకు రుణ ఆధారిత సరఫరా వ్యవస్థలను ఉపసంహరించుకుని ముందస్తుచెల్లింపు నిబంధనలను ప్రవేశపెట్టడం వలన ఇంధన సర ఫరాలో గందరగోళం ఏర్పడింది. పెట్రోలు,డీజిల్ పంపిణీని స్థిరీకరించే ప్రయత్నంలో భాగంగా వినియోగదారులకు 200 లీటర్ల డీజిల్ పరిమితం చేసింది. ఒక్కో వాహనదారునికి రూ.5వేల రూపాయల సరఫరా పరిమితి వలన కూడా సమస్యలు ఏర్పడే అవకాశంఉంది. సరిగ్గా ఇదే సమయంలో పెట్రోలు,డీజిల్ ధరను కేంద్రం పెంచడం వినియోగదారు మరో కొత్తరకం సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. భారత్ తనచమురు అవసరాల్లో 80శాతం కన్నాఎక్కువ దిగుమతులపై ఆధారపడుతోంది. కనుక పశ్చిమాసియా సెగను తట్టుకోవల్సిందే. ఇలాంటి సమస్యలను క్రోడీకరించుకుని సామాన్యులకు ఇబ్బంది లేకుండా చూసే యంత్రాంగాన్ని కేంద్రం తక్షణమే ఏర్పాటు చేసుకోవాలి.



క్రమశిక్షణ నుంచే జీవితం తన విలువను పొందుతుంది. కాబట్టి జీవితపు క్రమశిక్షణ అన్నది జీవితం కంటే చాలా అమూల్యమైనది.

తిరుక్కురళ్



అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.

వి.జాన్సన్

# ‘నీట్’గా పరీక్షలు జరపలేమా?

**ప్రశ్నపత్రాల లీకేజీ బయటపడి విద్యార్థుల నుంచి నిరసనలు ఎదురైనప్పుడు సంబంధిత మంత్రులు రాజీనామా చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. గతంలో ఒకసారి ఇంటర్మీడియేట్ ప్రశ్నపత్రాలకు సంబంధించి అప్పటి విద్యాశాఖ మంత్రి గాలి ముద్దుకృష్ణమ్మనాయుడు రాజీనామా చేయగా పదోతరగతి ప్రశ్నపత్రాలకు సంబంధించి అప్పటి మంత్రి రాంచంద్రరావును పదవి నుంచి తప్పించారు. కానీ ఈ పరీక్షల నిర్వహణలో కీలకపాత్ర వహిస్తున్న అధికారులకు మాత్రం ఎలాంటి ఇబ్బందులు కలగడం లేదు. ప్రస్తుతం లీక్‌కు కారణమైన అధికార, అనధికార అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెట్టి ప్రాసిక్యూట్ చేయాలి. వారి ఫొటోలను పత్రికల్లోనూ, టివీల్లోనూ వాల్‌పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలియచేయాలి. పాలకులు ఇంత కఠినంగా వ్యవహరించకపోతే డబ్బులతో ర్యాంకులు కొనుక్కోవాలనే ఆశపడేవారికి ప్రశ్నపత్రాలతో వ్యాపారం చేసేవారికి భయభక్తులు ఉండవు.**

దామెర్ల సాయిబాబ

ఆశయం జీవితానికి విలువ నేర్పుతుంది. ఆశ జీవితాన్ని ఆటపట్టిస్తుంది. కానీ ఆ ఆశే అత్యాశగా మారి దురాశగా రూపాంతరం చెందితే అరాచకానికి, అక్రమాలకు అంతే ఉండదు. నీతి, నియమాలకు, నైతిక విలువలకు తావే ఉండదు. ఇతర రంగాల సంగతి ఏమోకానీ విద్యారంగంపై ఈ ప్రభావం తీవ్రంగా చూపుతున్నది. కష్టపడకుండా తెల్లవారేసరికి లక్ష్మీపుత్రులై కోట్లకు పడగెత్తాలనే కొందరి దురాశ విద్యారంగంలో పెచ్చురిల్లుతుండడంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. పాలకులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెబుతున్నా మరెంతగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ప్రశ్నపత్రాలు ఏ పరిస్థితుల్లో లీక్‌కాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదో ఒక రూపంలో ఏదో రకంగా లీక్‌లు కొనసాగుతూనే ఉన్నాయి. గతంలో ఆయా రాష్ట్రాల పరిధిలో జరుగుతున్న ఇంటర్మీడియేట్ తర్వాత ప్రవేశ పరీక్షల్లో జరిగిన అవకతవకలు అన్నీఇన్నీ కావు. పేపర్లు లీక్‌కావడం, మరొకచోట వాల్యూయేషన్‌లో కొందరు అధ్యాపకులే చేతివాటం ప్రదర్శించడంతో ఎన్నోసార్లు ఏకంగా పరీక్షలే రద్దు చేసి మళ్లీ పెట్టిన సంఘటనలు కోకొల్లలు. ముఖ్యంగా మెడికల్ విద్యకు జరిగే ప్రవేశపరీక్ష ప్రశ్నపత్రాల విషయంలో ప్రభుత్వ చర్యలేవీ లీక్‌లను ఆపలేకపోయాయి. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో వైద్యవిద్య కోర్సుల ప్రవేశాలకు జాతీయ స్థాయిలో పరీక్షలు నిర్వహించేందుకు'నేషనల్ ఎల్జిబులిటీ అండ్ ఎంట్రన్స్ టెస్ట్' (నీట్)ను ప్రవేశపెట్టారు. 2013 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షల్లో మొదట్లో కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సిబిఎస్ఇ) నిర్వహించేది. 2017 నుంచి కేంద్ర విద్యాశాఖ పరిధిలోని జాతీయ పరీక్షా సంస్థ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-ఎన్‌టిఏ) నిర్వహిస్తుంది. పకడ్బందీగా లీక్ ప్రూఫ్‌గా ఈ పరీక్షలు నిర్వహించాలనితద్వారా ప్రజల్లో,ముఖ్యంగా విద్యార్థుల్లో అనుమానాలకు తావులేకుండా నమ్మకం, విశ్వాసం కలిగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా ఎన్‌టిఏ వ్యవహరించలేక చతికిలపడుతున్నది. తాజాగా ఈ నెల మూడవ తేదీన నిర్వహించిన నీట్ పరీక్షలు లీక్ కారణంగా పరీక్షలు రద్దు చేశారు. ఈ పరీక్షల ప్రశ్నపత్రాలు రాజస్థాన్‌లో లీక్ అయినట్లు వార్తలు రాగానే ఎలాంటి లీక్‌లు లేవని ఎంతో పకడ్బందీగా నిర్వహించినట్లు ప్రకటించిన ఇరవై నాలుగు గంటలు గడవక ముందే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ పరీక్షలు రాసిన దాదాపు 23లక్షల మంది విద్యార్థులే కాదు వారి తల్లితండ్రులు హతాశులయ్యారు. పరీక్షలకు మూడు, నాలుగు రోజుల ముందే గెస్ పేపర్ రూపంలో అందులోని ప్రశ్నలు వాట్సాప్‌లో ప్రత్యక్షం కావడం. కేంద్ర దర్యాప్తుసంస్థ ఆగమేఘాలపై జరిపిన ప్రాథమిక దర్యాప్తులో లీక్ జరిగినట్లు తేలడంతో రద్దు చేయక తప్పలేదు. నీట్ పరీక్షలు రద్దుకావడం ఇది మొదటిసారి కాదు. 2024లో కూడా ఇలాంటి ఆరోపణలే వెలుగెత్తాయి. ప్రజలనుండి నిరసనలు వెలువెత్తడంతో దర్యాప్తులో వెలుగు చూసిన నిజాలు విస్తుగొల్పాయి. 30 మందినిపైగా అరెస్టు చేశారు. మరోపక్క పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా నిర్వహించేందుకు 2024 ఫిబ్రవరిలోనే పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. కానీ మళ్లీ లీక్ పునరావృతం అయింది.

## ఒక్క మాట

ఈ లీక్‌లు అనేది కొత్తగా వచ్చిందికాదు. చివరిది కూడా కాకపోవచ్చు. ఎంసెట్ ఆరంభం నుంచి ప్రశ్నపత్రాల్లో తప్పులు, లీక్‌లు మామూలుగా మారిపోయాయి. బయటపడినప్పుడు తప్పని పరిస్థితుల్లో పరీక్షలు రద్దు చేయడం, తిరిగి పరీక్షలు పెట్టడం నిందితులపై కేసులు పెట్టడం, ఆ తర్వాత మరచిపోవడం, కేసులను అటకెక్కించడం సర్వసాధారణమైపోయింది. ఇంజినీరింగ్‌కు కొంత డిమాండ్ తగ్గినా మెడికల్ సీట్లకు రానురాను డిమాండ్ పెరుగుతూనే ఉంది. వైద్య విద్య అనేది పేదలకే కాదు, మధ్యతరగతి వారికి అందని ద్రాక్షపండులా తయారు అయింది. మెడికల్ సీటు మేనేజ్‌మెంట్ కోటాలో అరవై లక్షల నుంచి కోటి రూపాయల వరకు అమ్ముకుంటున్నారు. ఎనిమిదో తరగతి నుండే శిక్షణ ఇప్పించే తల్లిదండ్రులు ఉన్నారు. అప్పటి నుండి పిల్లలు కూడా పండుగలు, పబ్బాలు, శుభకార్యాలే కాదు కుటుంబ సభ్యులు మరణించినా రాలేని, చివరి చూపులకు కూడా నోచుకోకుండా సర్వం మెడికల్ విద్యపైనే దృష్టి పెట్టి చదువుతున్న విద్యార్థులు లక్షల సంఖ్యలో ఉన్నారు. మరొకపక్క మెడికల్‌పై ఉన్న మోజు సొమ్ము చేసుకునేందుకు కొన్ని ముఠాలు ఏనాటి నుంచో ఒక వ్యూహం ప్రకారం ప్రశ్నపత్రాలు సంపాదించడం, సొమ్ము చేసుకోవడం జరుగుతూనే ఉంది. ఈ లీక్ వీరులకు పోలీసులన్నా, చట్టాలన్నా భయభక్తులు లేకుండా పోతున్నాయి. ఏదిఏమైనా ప్రస్తుతం రద్దు చేసిన పరీక్షలు వచ్చేనెల 21వ తేదీ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈసారి ఏ పరిస్థితుల్లోను లీక్, అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద ప్రధాన్ పాతపాటే పాడారు. పరీక్షలు రద్దు చేసి మళ్లీ పెడితే ఆ విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఎంతటి మానసిక వేదనకు, ఒత్తిడికి గురవుతారో మనసుపెట్టి ఆలోచించాలి. మళ్లీ కోచింగ్ సెంటర్లలలో ఎన్ని కోట్ల వ్యాపారం జరుగుతుందో చెప్పక్కరలేదు. ఇక ప్రశ్నపత్రాలు లీక్ బయటపడకుండా ఉంటే అవి కొన్నవారు, చేజిక్కించుకున్నవారు అందలమెక్కిపోతున్నారు. ప్రశ్నపత్రాలు లీక్ అయినట్లు స్పష్టంగా బయటపడిన సందర్భాల్లో కూడా పాలకులు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. అధికారంలో ఎవరు ఉన్నా, ఈ పరీక్షల నిర్వహణలో మాత్రం అవకతవకలను నిరోధించలేకపోతున్నారు. గతంలో కూడా బయటపడిన సందర్భాల్లో విధిలేని పరిస్థితుల్లో రద్దు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారే తప్ప కారకులైనవారిపై పటిష్టమైన చర్యలు తీసుకొని మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా చేయలేకపోతున్నారు. ఏదిఏమైనా ఈ పరీక్షల నిర్వహణ ఎంత పతనావస్థకు దిగజారుతున్నదో మళ్లీ మళ్లీ లీక్ అవుతున్న నీట్ పరీక్షలను ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇందుకు కోచింగ్ సెంటర్ల యజమాన్యాలనో, దళారులనో నిందించి ప్రయోజనం లేదు. విద్యను వ్యాపార వస్తువుగా మార్చి, స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం కల్పించిన పాలకులనే నిందించాలి, తప్పు పట్టాలి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా తమ చర్యలద్వారా మెప్పించగల నైపుణ్యం,సామర్థ్యం కొందరి అధికారుల్లో ఉంది. దీని వెనుక కొందరు విద్యా వ్యాపారవేత్తల అండదండలు కూడా ఉన్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీ బయటపడి విద్యార్థుల నుంచి నిరసనలు ఎదురైనప్పుడు సంబంధిత మంత్రులు రాజీనామా చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. గతంలో ఒకసారి ఇంటర్మీడియేట్ ప్రశ్నపత్రాలకు సంబంధించి అప్పటి విద్యాశాఖ మంత్రి గాలి ముద్దుకృష్ణమ్మనాయుడు రాజీనామా చేయగా పదోతరగతి ప్రశ్నపత్రాలకు సంబంధించి అప్పటి మంత్రి రాంచంద్రరావును పదవి నుంచి తప్పించారు. కానీ ఈ పరీక్షల నిర్వహణలో కీలకపాత్ర వహిస్తున్న అధికారులపై మాత్రం ఎలాంటి చర్యలు ఉండడం లేదు. ప్రస్తుతం లీక్‌కు కారణమైన అధికార, అనధికార అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెట్టి ప్రాసిక్యూట్ చేయాలి. వారి ఫొటోలను పత్రికల్లోనూ, టివీల్లోనూ వాల్‌పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలియచేయాలి. పాలకులు ఇంత కఠినంగా వ్యవహరించ కపోతే డబ్బులతో ర్యాంకులు కొనుక్కోవాలనే ఆశపడేవారికి ప్రశ్నపత్రాలతో వ్యాపారం చేసేవారికి భయభక్తులు ఉండవు. ఈ వ్యాపారం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటూ నిరాటంకంగా జరిగిపోతూనే ఉంటుంది. మరొకపక్క ప్రశ్నపత్రాల వ్యాపారంలో కోట్లాది రూపాయలు ఈ దళారులు దోచుకుంటూనే ఉంటారు.

# మద్యం అమ్మకాలను నియంత్రించలేరా?


బుగ్గన మధుసూదనరెడ్డి

మత్తుకు బానిస అయినవారు మందుమత్తులో తెల్లార్లు జోగాడటం,మందు వ్యసనపరుల నైజంగా మార్చుకోవడం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత దురదృష్టకరం. అందుకే వీరి బలహీనతే మందు దుకాణాల (చీప్ లిక్కర్ యజమానుల వారికి) కాసుల వర్షం కురిపిస్తున్నది. ఆ మధ్యకాలంలో లాక్‌డౌన్‌లో వుంటూ కళ్ళకు గంతలు కట్టుకొని మరీ,కహోర పక్షుల్లాగ మందు కోసం వేచిచూసారు ముందుకు బానిస అయిన మందు బాబులు. ఈమధ్యే కరోనా పూర్తిగా తగ్గుముఖం పట్టి లాక్‌డౌన్ సడలించడంతో, వారికి కాస్త సందు, అవకాశం దొరికి చీప్ లిక్కర్ కోసం మళ్ళీబారులు తీరుతున్నారు. అర్రులు చాస్తున్నారు, ఉన్న ఫలంగా రెక్కలు కట్టుకొని చీప్ లిక్కర్ షాప్‌లా ముందు స్వేచ్ఛ లభించిన జీవులలాగా వాలిపోతున్నారు. అయితే ఒకానొక దశలో కరోనా ఊడలమర్రిలా విస్తరించడంతో చీప్ లిక్కర్ దొరికే దారి లేక తమ ఆరోగ్యాన్ని కొంత కాలం కాపాడుకున్నారు. ఇక గత కొంతకాలంగా ఆ లాక్‌డౌన్ సడలింపులు,నిబంధనలు ముగిసిపోవడంతో వారి ఆరోగ్యం గుల్ల చేసుకునే చెడు కాలం రానే వచ్చింది. ఇక వారిని ఆపేవారెవరు,ఇక వారికి ఎదురే లేదు,తాగిన మత్తులో చిందులు వేస్తూ ఇటు ఈ సమాజాన్ని అటువారి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేయడమే,భ్రష్టుపట్టించడమే పనిగా పెట్టుకున్నారు ఈ చీప్‌లిక్కర్ వ్యసనపరులు. తద్వారా ఈ చెడువ్యసనం బారినపడి ఇటు ప్రభుత్వాలకు,అటు మందు దుకాణాల వారికి కోట్లాది రూపాయలు ఆర్జించి పెడుతున్నారు. ఇక వారు మాత్రం ఈ మందు మత్తులో చిక్కుకుపోయి బికారులు అవుతూ, జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. ఏమిచేస్తాం అంతా వారి కర్మ అని మనమంతా మిన్నకుండి పోవాల్సిందే.ఎందుకంటే మందు జోలికి వెళ్ళవద్దు, మీ జీవితాలు సర్వనాశనం అవుతాయి అని వారి మంచికోరి చెవిటోడి ముందు శంఖం ఉదినట్లు ఎన్నిమార్లు వారికి విన్నవించిన ఆ మందు మత్తులో నుంచి వారు బయటపడలేని దయనీయ స్థితిలో వారు కొట్టుమిట్టాడుతున్నారు అనే మాట అక్షర సత్యం. ఏదిఏమైనా మత్తు మందుకు,చీప్ లిక్కర్ సేవనానికి బానిసఅయిన వారి జీవితాలు నిరంతరం అల్లకల్లోల మయమే. అయితే మత్తు మందుకు ఆమడదూరంలో ఉండేవారు,దాని ఛాయలకు కూడా వెళ్ళనివారు,కనీసం దాని వాసన కూడా పడని వారు ఈ కాలానికి సంబంధించి అత్యంత అదృష్టవంతులు. ఏమైనా మనదేశంలో జరిగే దాదాపు 60 నేరాలు, ఘోరాలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దోపిడీలు అన్నింటికీ మూలం ఈ చీప్ లిక్కర్ మత్తు మందే. పరిస్థితి ఇంతకదు దయనీయంగా, రాక్షసత్వంగా వుంటే ఇక మన జాతిపిత మహాత్మాగాంధీజీ కలలు గన్న సంపూర్ణ మద్యపాన నిషేధానికి తావెక్కడిది? అలాగే ఈ పాపాన్ని సైతంఎవరికీ అప్పనంగా అంటగంటలేని దుస్థితి. కాబట్టి తలాపాపం తిలా పిడికెడు అంటారే ఆ విధంగా ఈ పాపకార్యంలో పాలకులు, ప్రభుత్వాలు, ప్రజలు ఇలా అందరూ దోషులే. చీప్ లిక్కర్ వ్యసనానికి చెక్ పెడదాం,మన ఆరోగ్యాన్ని మరో పది కాలాల పాటు కాపాడుకుందాం.

# ప్రభుత్వ సంస్థల బలోపేతంతోనే అభివృద్ధి సాధ్యం

తరిగోపుల నారాయణస్వామి

దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రతిసారి 'పొదుపు' అనే మాట ప్రజల ముందుకు వస్తుంది. విద్యుత్‌ను ఆదా చేయండి, ఇంధన వినియోగాన్ని తగ్గించండి, అవసరం లేని ఖర్చులను వాయిదా వేయండి, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించండి, బంగారు కొనుగోళ్లు తగ్గించండి, వర్క్ ఫ్రం హోం విధానాలను ప్రోత్సహించండి అని ప్రభుత్వాలు సూచనలు చేస్తుంటాయి. యుద్ధ వాతావరణం, అంతర్జాతీయ ఆర్థిక అస్థిరతలు, ఇంధన ధరల పెరుగుదల, ప్రపంచ మార్కెట్ ఒడిదుడుకులు వంటి కారణాలతో దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి ఏర్పడినప్పుడు ప్రజల సహకారం అవసరమని చెప్పడం సహజమే. ప్రజలు కూడా దేశ ప్రయోజనం కోసం ఎన్నో త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉంటారు. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న సమాజం మొత్తం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు పొదుపు గురించి చెప్పే పాలకులు,ప్రజలు ఆధారపడే ప్రభుత్వ మౌలిక వ్యవస్థలను ఎంతవరకు బలోపేతంచేస్తున్నారు? ప్రజా రవాణా ఉపయోగించండి అని చెప్పడం మాత్రమే సరిపోదు, ఆ రవాణా వ్యవస్థ సౌకర్యవంతంగా, సమయపాలనతో, అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తీర్చిదిద్దాలనే బాధ్యత కూడా ఉంది. ఒక సాధారణ ఉద్యోగి లేదా విద్యార్థి బస్సు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సివస్తే, రైళ్లు కిక్కిరిసి ప్రయాణం ప్రమాదకరంగా మారితే, ప్రజలు స్వచ్ఛందంగా ప్రజా రవాణాను ఎందుకు ఆశ్రయిస్తారు? ప్రజా రవాణా బలపడితేనే పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గుతుంది. కుటుంబాల ఖర్చులు తగ్గుతాయి. కాలుష్యం తగ్గుతుంది. నగరాలలో ట్రాఫిక్ సమస్యలు కూడా నియంత్రణలోకి వస్తాయి. కాబట్టి ప్రజలకు సూచనలు చేయడమే కాకుండా ప్రభుత్వాలు ముందుగా సేవల నాణ్యతను పెంచాలి. ప్రజలకు పొదుపు బోధించే ముందు ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే వ్యవస్థలను నిర్మించాలి. ప్రభుత్వ పాఠశాలలు అత్యుత్తమ విద్యను అందిస్తే,ప్రభుత్వ ఆసుపత్రులు విశ్వసనీయ వైద్య సేవలను అందిస్తే, ప్రజలు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి ప్రైవేటు రంగం వైపు ఎందుకు పరుగులు తీస్తారు? గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ ప్రభుత్వసేవలు బలహీనపడినప్పుడు ప్రజలు అప్పులు చేసి అయినా ప్రైవేటురంగాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ఇది వ్యక్తిగత ఖర్చులను పెంచడమే కాక సమాజంలో ఆర్థిక అసమానతలను మరింత పెంచుతోంది. ఒక కుటుంబం పిల్లల చదువు కోసం అప్పులు చేస్తోంది. మరో కుటుంబం వైద్య చికిత్సకోసం ఆస్తులు అమ్ముకుంటోంది. ఇవన్నీప్రజల పొదుపులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. ప్రజలు పొదుపు చేయాలంటే ముందువారి జీవితవ్యయాలు తగ్గాలి. ఆ బాధ్యతను ప్రభుత్వాలు మర్చిపోవద్దు. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలపడితే దేశ భవిష్యత్తు బలపడుతుంది. ప్రభుత్వ వైద్య వ్యవస్థ బలపడితే ప్రజల ఆరోగ్యం బలపడుతుంది. ఆరోగ్యవంతమైన సమాజమే ఆర్థికంగా బలమైన దేశానికి పునాది అవుతుంది. ఉద్యోగ కల్పన విషయంలో కూడా ఇదే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నిరుద్యోగ యువతకు 'స్వయం ఉపాధి' అనే ఒకే మాట చెప్పడం సరిపోదు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసి, కొత్త పరిశ్రమలను ప్రోత్సహించి,



ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలను పెంచితేనే దేశ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం వస్తుంది. ఒకవైపు యువత నిరుద్యోగంతో బాధపడుతుంటే, మరోవైపు ఖాళీగా ఉన్నప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా సంవత్సరాల తరబడివాయిదా వేయడం సమంజసంకాదు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు సమాజ నిర్మాణంలో కీలకమైన శక్తులు. వారికిసకాలంలో వేతనాలు, కరవు భత్యాలు, వేతన సవరణలు అందించకపోతే ఆర్థిక వ్యవస్థలో వినియోగ శక్తి తగ్గిపోతుంది. వినియోగ శక్తి తగ్గితే మార్కెట్ మందగిస్తుంది. మార్కెట్ మందగిస్తే దేశ అభివృద్ధి కూడా మందగిస్తుంది. కాబట్టి ఉద్యోగులకు సముచిత గౌరవం ఇవ్వడం కేవలం సంక్షేమం కాదు, అది దేశ ఆర్థిక చక్రాన్ని ముందుకు నడిపించే ప్రధాన ఆధారం. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం చూపడం అంటే ప్రజా సేవల పట్ల నిర్లక్ష్యం చూపడమే. ఎందుకంటే ఒక ఉపాధ్యాయుడు బలంగా ఉంటే విద్యా వ్యవస్థ బలపడుతుంది. ఒక వైద్యుడు గౌరవంగా పనిచేస్తే వైద్య వ్యవస్థ బలపడుతుంది. ఒక ఉద్యోగి నమ్మకంతో పనిచేస్తే పరిపాలన బలపడుతుంది. ఈ రోజు ప్రజలకు పొదుపు చెప్పే నాయకులు తమ కాన్వాయ్‌లను తగ్గించుకోవడం, ప్రభుత్వ ఖర్చులను నియంత్రించడం వంటి చర్యలు చేపట్టడం స్వాగతించదగ్గ విషయం. నాయకత్వం ముందు ఆదర్శంగా నిలిస్తే ప్రజలు కూడా సహకరిస్తారు. కానీ అది ఒక్కటే సరిపోదు. దేశాన్ని బలపరచేది కేవలం పొదుపు కాదు, ప్రజలకు అందుబాటులో ఉండే బలమైన ప్రభుత్వ వ్యవస్థలు. ఒక దేశం నిజంగా శక్తివంతం కావాలంటే ప్రభుత్వ విద్య, ప్రభుత్వ వైద్యం, ప్రజా రవాణా, ప్రజా పంపిణీ వ్యవస్థ, ప్రభుత్వ రంగ ఉపాధి వంటి రంగాలు అత్యున్నత స్థాయిలో ఉండాలి. అప్పుడు ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వ వ్యవస్థలనే ఆశ్రయిస్తారు. అప్పుడు ఇంధన వినియోగం తగ్గుతుంది, కుటుంబాలపై ఆర్థికభారం తగ్గుతుంది. దేశ సంపద దేశంలోనే నిలుస్తుంది. నేడు అభివృద్ధి పేరుతో అనేక ప్రాజెక్టులు వస్తున్నాయి. కానీ ప్రజల దైనందిన జీవితాన్ని సులభతరం చేసే రంగాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే అభివృద్ధి అసంపూర్ణంగానే మిగులుతుంది. భారీ భవనాలు కట్టడం కంటే బలమైన ప్రభుత్వ పాఠశాల నిర్మించడం గొప్పది. విలాసవంతమైన కార్యాలయాల కంటే గ్రామీణ ఆసుపత్రులను ఆధునికీకరించడం అవసరం. ప్రజా ప్రయోజనాలకే ప్రభుత్వ ధనం ఎక్కువగా వినియోగించాలి. దేశాభివృద్ధి అంటే కేవలం గణాంకాలు కాదు, సామాన్య ప్రజల జీవితాల్లో కనిపించే మార్పు. ఒక రైతు తన పిల్లలను నాణ్యమైన ప్రభుత్వ పాఠశాలలో చదివించగలగాలి. ఒక కార్మికుడు ప్రభుత్వ ఆసుపత్రిలో గౌరవప్రదమైన వైద్యం పొందగలగాలి. ఒక యువకుడు ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి నిరాశతో తిరగకూడదు. ఒక ఉద్యోగి తన కష్టానికి తగినవేతనం కోసం నిరసనలుచేయాల్సిన పరిస్థితి రాకూడదు. ప్రజలకు ఈ భరోసా కలిగినప్పుడే దేశం నిజమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుంది. పొదుపు అనే మాట ప్రజలపై భారం మోపే నినాదంగా కాకుండా, సమగ్ర ప్రజా సంక్షేమంతో కూడిన జాతీయ బాధ్యతగా మారాలి. దేశం అంటే కేవలం భూభాగం కాదు, దేశప్రజల జీవన ప్రమాణాలే నిజమైన దేశ బలం. ప్రజల కష్టాలు తగ్గితేనే దేశం బలపడుతుంది. ప్రజల ఆదాయం పెరిగితేనే మార్కెట్ బలపడుతుంది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితేనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. కాబట్టి ప్రజలసంక్షేమం దేశాభివృద్ధి పరస్పర విరుద్ధాలు కావు. అవి ఒకదానికొకటి ఆధారాలు. కాబట్టి ఈ కాలం మనందరికీ ఒక గొప్ప పాఠం చెబుతోంది. ప్రజలకు సూచనలు చేయడం సులభం, కానీ ప్రజలు గౌరవంగా జీవించే వ్యవస్థలను నిర్మించడం పాలకుల అసలు బాధ్యత. ప్రజా ధనం ప్రజలకే ఉపయోగపడే విధంగా ప్రభుత్వాలు పనిచేస్తేనే దేశం బలపడుతుంది. ప్రజలపై భారాలు మోపకుండా, ప్రజల జీవిత వ్యయాలను తగ్గించే ప్రభుత్వ విధానాలే నిజమైన దేశభక్తి.

# ప్రజావాక్కు

## కఠిన చర్యలు తీసుకోవాలి

నీట్ పరీక్షాపత్రాల లీకేజీఉదంతం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది. ఎంతో కష్టపడి చదివిన అభ్యర్థులకు ఈ ఘటన తీవ్ర నిరాశను, మానసిక వేదనను కలిగించింది. పరీక్షా పత్రం లీక్ కావడంవల్ల పరీక్ష రద్దుకావడం అనేది విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. ఇదికేవలం ఒక పరీక్షకు సంబంధించిన అంశం కాదు, దేశంలోని వైద్య విద్య ప్రమాణాలను, నైతికతనుప్రశ్నిస్తోంది. దోషులను పట్టుకోవడానికి, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలి. మొదటగా, ఈకుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించడానికి ఉన్నత స్థాయి దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలి. దోషులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన కఠిన శిక్షలు అమలు చేయాలి, తద్వారా ఇతరులకు ఇది ఒక హెచ్చరికగా మారుతుంది. సాంకేతికపరంగా, పరీక్షాపత్రాల రవాణా నిల్వలో అత్యాధునిక ఎన్క్రిప్షన్ పద్ధతులను వాడాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తం

నేడుగ్రామలలో ఐస్‌క్రీమ్ అమ్మేవాళ్ళు,చిన్నపిల్లల బట్టలు అమ్మేవాళ్ళు,రిపేర్‌లు చేస్తాం అనిఉదయం నుండి మధ్యాహ్నం వరకు తరచూ గ్రామాలలో తిరుగుతూ అనువైన వ్యక్తులను, ఇండ్లను పరిశీలిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారు.ఇలాంటి వ్యక్తులను గ్రామాల్లోకి రాకుండా నిషేధించినప్పుడే గ్రామాలు సురక్షితంగా ఉంటాయి.ఎక్కడ ఇలాంటి వారు కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలి. అందరూ అప్రమత్తంగా ఉండాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## పిల్లల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచాలి

ఉభయరాష్ట్రాల్లో పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు వచ్చాయి. ఈ సమయాన్ని రాబోయే తరగతిలో వారికి ఏదైనా అంశాలు అవగాహన లేని వాటిపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా గణితం,తెలుగువ్యాకరణం, ఆంగ్ల వ్యాకరణం తృప్తిగా అర్థమయ్యే విధంగా తల్లితండ్రులు, లేదా మిత్రుల సహకారంతో పునాది వేసుకోవాలి. విజ్ఞాన శాస్త్రం పాఠంలోసందేహాలు,నివృత్తిచేసుకోవాలి.అదనంగా పత్రిక పఠనం,నీతికథలు,చిత్రలేఖనం,దస్తూరి మెరుగుపరచడం తప్పక చేయాలి. సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకునేలా చూడాలి.

-కె.నారాయణ, నల్గొండ

## మూఢనమ్మకాలతో వ్యాధులు నయం కావు

వృద్ధులు మినహా నలభైఏళ్లలోపు యువకులు కూడా ఊహించని వ్యాధులకు గురవుతున్నారు. డబ్బులేక వైద్యం కోసం వ్యాధులకు సరైన సమయంలో చికిత్సపొందని వారు కొంత వరకు ఆరోగ్యశ్రీతో లబ్ధిపొంది శస్త్రచికిత్సలు చేసుకొని కుటుంబ పోషణ కొనసాగిస్తున్నారు. ఏరోగలక్షణమైన కనీసం అర్హత గల వైద్యున్ని మొదట సంప్రదించడం మన విధి. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఇతరుల సలహాతో ఆకుల పసరు వగైరా శరీరంలోకి తీసుకొని కోరి దుష్ప్రభావాన్ని ,కొన్ని చోట్ల కొత్త రోగాన్ని తెచ్చుకుని కుటుంబానికి ఆపద తెస్తున్నారు. ఈ విధంగా అశాస్త్రీయ, మూఢ నమ్మకాలతో వ్యాధులు తగ్గవని రాష్ట్ర వైద్యశాఖజిల్లాల్లో వినూత్నైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరిచారు. ఇది రాష్ట్ర వైద్య శాఖకు ఒక తలమానికం.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

## ఫిర్యాదులు స్వీకరించాలి

ప్రభుత్వం పేద ప్రజలకు ఎస్సి,ఎస్టీ, వికలాంగులకు పంచిన ఇండ్ల స్థలంలో కొందరు భూమి కబ్జాలు చేస్తున్నారు. ఎస్సి, ఎస్టీ, వికలాంగులకు సంబంధించిన స్థలంలో అక్రమ నిర్మాణం చేసి యజమానులపై దాడులు, దౌర్జన్యం చేస్తున్నారు. తహసీల్దార్, పోలీస్ స్టేషన్, జిల్లా కలెక్టర్ మానవ హక్కుల కమిషన్, ఎస్సి,ఎస్టీ కమిషన్,వికలాంగుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసిన కూడా న్యాయం జరగడంలేదు. రెవిన్యూ అధి కారులు, పోలీస్ అధికారుల సమక్షంలో భూమి కబ్జాల పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## వేగంగా ఎదుగుతున్న రాష్ట్రం

సేవల రంగంలో తెలంగాణ ఇతరరాష్ట్రాలను అధిగమించడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఒకమైలురాయిగా నిలిచింది. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని రాష్ట్రంవేగంగా పట్టణీకరణ దిశగా పయనించడంతో సేవలరంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం,ఐటీ, ఫైనాన్స్, విద్య, ఆరోగ్యం, రియల్ ఎస్టేట్ వంటి విభాగాల్లో తెలంగాణ సాధించిన పురోగతి దేశంలోనే ఆదర్శప్రాయమని చెప్పవచ్చు. ప్రభుత్వం చేపట్టిన మౌలికసదుపాయాల విస్తరణ, పరిశ్రమల ప్రోత్సాహక విధానాలు,డిజిటల్ ఇన్నోవేషన్‌కు ఇచ్చిన ప్రాధాన్యం ఈ అభివృద్ధికి ప్రధాన బలాలుగా నిలిచాయి. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాజెక్టులు తెలంగాణను గ్లోబల్ సేవల రంగంలో కీలక స్థానంలో నిలబెట్టాయి.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# ప్రధాని మోడీ ప్రత్యేకమైన వ్యక్తి

## కెనడా ప్రధాని మార్క్‌కార్నీ ప్రశంసలు

**సిడ్నీ, మే 15:** ప్రధాని నరేంద్ర మోడీపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ ప్రశంసల వర్షం కురిపించారు. మోడీవాలా ప్రత్యేకమైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ లోవీ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కెనడా ప్రధాని మాట్లాడుతూ భారత పర్యటన సందర్భంగా ప్రధాని మోడీతో జరిగిన సమావేశాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నిబద్ధత ఎంతో ప్రత్యేకమైనదని కార్నీ ప్రశంసలు కురిపించారు. గత 25 ఏళ్లల్లో ఒక్క రోజు కూడా మోడీ సెలవు తీసుకోలేదన్నారు. ప్రతి వారాంతంలో ఆయన ప్రజలకు చేరువయ్యేందుకు ప్రత్యేక శ్రద్ధ పెడతారన్నారు. ప్రధాని మోడీకి తన పనిపై ఉన్న నిష్ఠ గొప్పదని కూడా అన్నారు. గ్రామీణ ప్రజానీకానికి సేవ చేయడంపై ప్రధాని మోడీ ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. యూపీఐపై కూడా ప్రశంసలు కురిపించారు. నేరుగా నగదు లబ్ధిదారులకు బదిలీ చేయడం ఈ వ్యవస్థ సాధ్యమైందని అన్నారు. దీంతో, అనేక మంది ప్రధాన ఆర్థికవ్యవస్థలో భాగం కాగలిగారని అన్నారు. ఈ విషయంపై ప్రధాని ప్రత్యేక దృష్టి పెట్టారని కామెంట్ చేశారు. ట్రుడో హయాంలో కెనడాతో భారత్ సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రధాని కార్నీ ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల భారత్‌లో కూడా పర్యటించారు. భారత దేశ ఇంధన అవసరాలు తీర్చేందుకు కెనడా తన వంతు ప్రయత్నం చేస్తుందని పర్యటన సందర్భంగా ఆయన చెప్పారు. భారత్‌కు యూరేనియం సరఫరా కోసం కెనడా సంస్థ కామికో దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుందన్నారు. కెనడా, భారత దేశాల ప్రజల మధ్య సంబంధాలు బలమైనవని వ్యాఖ్యానించారు. రెండు మిలియన్‌ల మంది కెనడా పౌరులకు భారతీయ మూలాలు ఉన్నాయని గుర్తు చేశారు. రక్షణ రంగంలో సహకారాన్ని కూడా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు భారత్, కెనడాలు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు.


# తైవాన్‌కు సహకరిస్తే భవిష్యత్తులో యుద్ధమే

## ట్రంప్ ముఖంమీదే స్పష్టత ఇచ్చిన జిన్‌పింగ్



**బీజింగ్, మే 15:** తైవాన్‌కు అమెరికా సైనిక సహకారం అందించడంపై గుర్రుగా ఉన్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అగ్రరాజ్యాధినేతకు నేరుగా హెచ్చరికలు జారీచేశారు. తైవాన్ విషయంలో ఏమాత్రం తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా ఘర్షణ తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖంమీదే తేల్చిచెప్పారు. రెండురోజుల చైనా పర్యటనలో ఉన్న ట్రంప్ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లో రెండు గంటలపాటు ఏకాంతంగా జరిగిన చర్చల్లో తైవాన్ వివాదంతోపాటు పశ్చిమాసియా యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన సంక్షోభం, అమెరికాచైనాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం తదితర అంశాలపై చర్చలు జరిపారు. చర్చల వివరాలను అధికారికంగా వెల్లడించనప్పటికీ చైనా అధికారిక మీడియా సంస్థ జిన్‌హువా పలు వివరాలు బయటపెట్టింది. తైవాన్ విషయంలో ట్రంప్‌కు జిన్‌పింగ్ తన వైఖరిని స్పష్టంగా చెప్పారని పేర్కొంది. తైవాన్ విషయంలో అమెరికా సరైన పద్ధతిలో వ్యవహరిస్తే మన రెండు దేశాల మధ్య సంబంధాలు ఉన్నతంగా స్థిరంగా కొనసాగుతాయి అని జిన్‌పింగ్ తెలిపినట్టుప్రస్తావించింది. వాణిజ్య యుద్ధం వల్ల ఎవరికీ ప్రయోజనం కలగదని, నష్టమే మిగులుతుందని ట్రంప్‌తో జిన్‌పింగ్ అన్నారు. వాణిజ్యం విషయంలో ప్రత్యర్థుల్లా కాకుండా భాగస్వాముల్లా ఉందాం. పరస్పర సహకారంతో పనిచేద్దాం అని జిన్‌పింగ్ సూచించినట్లు పేర్కొంది. మరోవైపు చైనాతో తమకు ఉన్న వాణిజ్య లోటును పూడ్చటమే ముఖ్యమైన అంశమని ట్రంప్ స్పష్టంచేసినట్లు అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. చైనాకు సమీపంలో దక్షిణ చైనా సముద్రంలో ఉన్న తైవాన్ తనదేనని చైనా ఎప్పటి నుంచో వాదిస్తోంది. ఆ ద్వీపంతో ఏ దేశమూ నేరుగా సంబంధాలు పెట్టుకోవద్దని హెచ్చరిస్తూ వస్తోంది. తైవాన్ మాత్రం తాను సర్వస్వతంత్ర ప్రతిపత్తి కలిగినదేనని చెప్పుకుంటోంది. తైవాన్‌తో అనధికారిక సంబంధాలు కొనసాగిస్తున్న అమెరికా ఆ దేశానికి ఆయుధాలు, ఇతర సాంకేతికతలను అందిస్తోంది. జిన్‌పింగ్ హెచ్చరికల నేపథ్యంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. తైవాన్ విషయంలో అమెరికా విధానంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టంచేశారు. చైనాతో తైవాన్ స్వచ్ఛందంగా కలిసిపోయేందుకు ముందుకొస్తే తమకు అభ్యంతరం లేదని, బలవంతంగా ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తే మాత్రం చైనా పెద్ద తప్పు చేసినట్లే అవుతుందని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధిని స్వేచ్ఛాయుత నౌకారవాణా కోసం తెరిచి ఉంచాల్సిందేనని ట్రంప్, జిన్‌పింగ్ నొక్కి చెప్పారు. ఈ జలసంధిపై ఎవరి నియంత్రణ ఉండరాదని ఇద్దరు నేతలు అంగీకారానికి వచ్చినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండరాదన్న అమెరికా వాదనకు జిన్‌పింగ్ సంపూర్ణ మద్దతు ఇచ్చినట్లు తెలిపింది.


# ప్రధానిమోడీకి ఎమిరేట్స్ యుద్ధవిమానాల ఎస్కార్ట్!



**అబుదాబి, మే 15:** యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోడీకి అక్కడ అరుదైన స్వాగతం లభించింది. దేశ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ స్వయంగా అబుదాబీ ఎయిర్‌పోర్టులో ప్రధాని మోదీకి సాదర స్వాగతం పలికారు. అంతకు ముందు ప్రధాని ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా విమానం యూఏఈ గగనతలంలోకి ప్రవేశించగానే ఆయనకు రక్షణగా యూఏఈ తన ఎఫ్16 బ్లాక్ 60 డెజర్ట్ ఫాల్కన్ ఫైటర్ జెట్‌లను పంపించింది. విమానం ఎయిర్‌పోర్టులో దిగేంతవరకూ ఈ యుద్ధవిమానాలు మోడీ విమానానికి రక్షణగా వచ్చాయి. ఎయిర్‌పోర్టులో యూఏఈ అధ్యక్షుడు ప్రధాని మోదీకి స్వయంగా స్వాగతం పలికారు. ప్రధాని యూఏఈ సైనిక బృందం గౌరవ వందనాన్ని స్వీకరించారు. గల్ఫ్ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభానికి దారి తీస్తున్న తరుణంలో ప్రధాని మోడీ యూఏఈ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఇరు దేశాలు పలు అంశాలకు సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. యూఏఈపై జరిగిన దాడులను కూడా ప్రధాని మోడీ ఖండించారు. భారత్ ఎల్లప్పుడూ యూఏఈకి అండగా ఉంటుందని అన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో యూఏఈలోని భారతీయులకు అక్కడి ప్రభుత్వం సొంత కుటుంబసభ్యుల్లా రక్షణ కల్పించినందుకు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఏ సమస్యకైనా చర్చలు, దౌత్యమార్గాల ద్వారానే పరిష్కారాన్ని అన్వేషించాలనేదే భారత్ అభిమతమని కూడా ప్రధాని మోడీ స్పష్టం చేశారు. యూఏఈలో కొన్ని గంటల పాటే ఉండనున్న ప్రధాని ఆ తరువాత నెదర్‌లాండ్స్, స్వీడెన్, నార్వే, ఇటలీ దేశాల పర్యటనకు వెళతారు.

# భోజ్‌శాల మసీదు హిందూ దేవాలయమే!

## హైకోర్టు ఇండోర్ బెంచ్ గుర్తింపు



**ఇండోర్, మే 15:** భోజ్‌శాల కమాల్ మౌలా మసీదు కాంప్లెక్స్ వివాదంలో మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన ఉత్తర్వులు వెలువరించింది. ఆ వివాదాస్పద ప్రాంతాన్ని హిందూ ఆలయమేనని న్యాయస్థానం గుర్తించింది. ఈ ప్రదేశంలో హిందూ ఆరాధన కొనసాగింపు ఎన్నడూ నిలిచిపోలేదని మేం గమనించాం. పర్మార్ వంశానికి చెందిన రాజా భోజుడితో సంబంధం ఉన్న సంస్కృత విద్యా కేంద్రంగా ఈ వివాదాస్పద ప్రాంతం భోజ్‌శాల ఉండేదని చారిత్రక ఆధారాలు చెబుతున్నట్లు మా పరిశీలనలో తేలిందని మధ్యప్రదేశ్ హైకోర్ట్ ఇండోర్ బెంచ్ పేర్కొంది. భోజ్‌శాలను వాగ్దేవి (సరస్వతీ దేవి)కి అంకితం చేసిన ఆలయంగా హిందువులు పరిగణిస్తుండగా, ముస్లిం వర్గం ఈ కట్టడాన్ని కమల్ మౌలా మసీదుగా గుర్తిస్తోంది. జైన సమాజానికి చెందిన ఒక పిటిషనర్ ఈ సముదాయం మధ్యయుగానికి చెందిన జైన ఆలయం, గురుకులమని వాదించారు. 2003 ఏఎస్ఐ (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎఎస్ఐ) ఒప్పందం ప్రకారం భోజ్‌శాలలో హిందువులు మంగళవారాల్లో, ముస్లింలు శుక్రవారాల్లో ప్రార్థనలు చేస్తున్నారు. అయితే ఆ ప్రాంగణంలో పూజలు చేసుకునే ప్రత్యేక హక్కులు తమకే కావాలని కోరుతూ హిందూ పక్షం హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఇది హిందూ ఆలయమేనని గుర్తించింది. విచారణ సమయంలో భారత పురావస్తు విభాగం సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపింది. ఇది ఒకప్పుడు హిందూ ఆలయాల సముదాయమని పేర్కొంది. అంతేకాదు, వాటి శిథిలాలతోనే మసీదు నిర్మాణం జరిగిందని తెలిపింది. రెండేళ్ల కిందట ఏఎస్ఐ 98 రోజులపాటు శాస్త్రీయ సర్వే జరిపి, 2 వేల పేజీలకుపైగా నివేదికను సమర్పించింది. మసీదు నిర్మాణం కంటే ముందే ఆ ప్రాంతంలో భారీ ఆలయం ఉన్నట్లు పలు శిల్పాలు, స్తంభాల శిథిలాలు, శాసనాలు తెలియజేస్తున్నాయని వివరించింది. అవి పర్మార్ రాజవంశం కాలానికి చెందినవని చెప్పింది. ఎఎస్ఐ తన శాస్త్రీయ సర్వేలో కనుగొన్న నాణేలు, శిల్పాలు, శాసనాలు ఈ సముదాయం వాస్తవానికి ఒక దేవాలయం అని నిరూపిస్తున్నాయని హిందూ పక్షం వాదిస్తోంది. ఆ సర్వే నివేదిక పక్షపాతంతో ఉందని, హిందూ పిటిషనర్ల వాదనలకు మద్దతు ఇచ్చేలా తయారు చేశారని ముస్లిం పక్షం కోర్టులో వాదించింది. కానీ హైకోర్టు మాత్రం అది హిందువులకు చెందిన ప్రాంతమేనని నిర్ధారణకు వచ్చింది. ఇక్కడ హిందువులు పూజలు చేయడానికి అనుమతి ఇచ్చిన న్యాయస్థానం, ముస్లింలు నమాజ్ చేయకూడదని ఆదేశించింది. లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న వాగ్దేవి మాతా విగ్రహాన్ని వెనక్కి రప్పించే విషయాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి న్యాయస్థానం సూచించింది. మసీదు ఏర్పాటు కోసం ముస్లింలు కోరితే, వారికి ధార్‌లో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. ఈ కేసులో వాదనలు పూర్తి కాగా మధ్యప్రదేశ్ హైకోర్టు తుది తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. కోర్టు సెలవులు ముగిసిన తర్వాత తుది తీర్పు వెలువడే అవకాశం ఉందని భోజ్ ఉత్సవ్ సమితి లాయర్ శిరీష్ దూబే అభిప్రాయపడ్డారు.

# చైనాలో పనిచేయని డొనాల్డ్ ట్రంప్ 'సీక్రెట్' కమాండ్



**బీజింగ్, మే 15:** సాధారణంగా అమెరికా అధ్యక్షుడు ఏ దేశానికైనా వెళ్తే.. ఆయన పర్యటించే ప్రాంతం మొత్తాన్ని అగ్రరాజ్య సీక్రెట్ ఏజెంట్లు తమ గుప్పిట్లో ఉంచుకుంటారు. ఆ చోట చీమ చిటుక్కుమనాలన్నా తమ అనుమతి ఉండాల్సిందే అన్న రీతిలో అమెరికా భద్రా సిబ్బంది వ్యవహరిస్తారు. కానీ, చైనాలో మాత్రం వీరి కమాండింగ్ పని చేయలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటన వేళ బీజింగ్ భద్రతా సిబ్బంది వీరికి షాకిచ్చారు. ఈ క్రమంలో ఇరు దేశాల భద్రతా సిబ్బంది, జర్నలిస్టుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడం గమనార్హం. అసలేం జరిగిందంటే..

**వైట్‌హౌస్ సిబ్బందిని నెట్టేసి.**

రెండు రోజుల పర్యటన నిమిత్తం బీజింగ్ వెళ్లిన ట్రంప్.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో గురువారం ద్వైపాక్షికంగా భేటీ అయ్యారు. అయితే, ఈ సమావేశ వేదిక వద్దకు చైనా మీడియా సిబ్బంది దూసుకొచ్చారు. వైట్‌హౌస్ సిబ్బందిని నెట్టుకుంటూ ప్రాంగణం లోపలికి వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనలో అమెరికా సిబ్బందిలో ఒకరు కిందపడటంతో స్వల్ప గాయాలైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీనిపై అగ్రరాజ్య అధికారులు చైనా వద్ద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**టెంపుల్‌లోకి నో ఎంట్రీ..**

ఇక, బీజింగ్‌లోని 'టెంపుల్ ఆఫ్ హెవెన్'ను ఇరు దేశాధినేతలు సందర్శించారు. ఆ సమయంలో యుఎస్ సీక్రెట్ సర్వీస్‌కు చెందిన ఓ ఏజెంట్ వద్ద తుపాకీ ఉందన్న కారణంతో చైనీస్ అధికారులు టెంపుల్ లోపలికి అనుమతించలేదు. ఆయుధాన్ని తమకు ఇచ్చిన తర్వాతే లోపలికి వెళ్లాలని సూచించారు.

ఇందుకు అమెరికా ప్రతినిధులు అంగీకరించకపోవడంతో ఇరువర్గాల మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి.

దాదాపు 30 నిమిషాల తర్వాత మరో సీక్రెట్ సర్వీస్ అధికారిని అనుమతించగా.. గన్‌తో ఉన్న ఆ ఏజెంట్ వెలుపలే ఉండిపోయారు.

# ఖైబర్ ఫక్తూన్‌ఖ్వాలో ఉగ్రదాడి..

## 15 మంది సైనికులు మృతి



**పెషావర్, మే 15:** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు వరుస షాక్‌లు ఎదురవుతున్నాయి. తాను తవ్వుకున్న గుంతలో తానే పడ్డట్టు అన్న చందంగా పాకిస్థాన్ పరిస్థితి తయారైంది. భారత్‌ను ఎలాగైనా నాశనం చేయాలని కంకణం కట్టుకున్న పాక్ ఉగ్రవాదులకు నిధులు వెచ్చించి మరి పోషిస్తోంది. ఇదే ఉగ్రవాదుల్లోని ఓ వర్గం మాత్రం దాయాదీ దేశానికి చుక్కలు చూపిస్తోంది. వరుస దాడులతో కంటి నిండా నిద్ర లేకుండా చేస్తోంది. తాజాగా పాకిస్థాన్‌లోని బాజౌర్‌లో ఉన్న మిలిటరీ క్యాంపుపై జరిగిన భారీ ఆత్మాహుతి దాడి ఆ దేశ సైన్యాన్ని వణికించింది. ఈ పక్కా ప్లాన్డ్ అటాక్‌లో ప్రాథమిక సమాచారం ప్రకారం కనీసం 15 మంది సైనికులు మరణించారు. ఉగ్రవాదులు ముందుగా సైనిక స్థావరం వద్ద భారీ పేలుడుకు పాల్పడి, ఆ గందరగోళం మధ్యలో ఆయుధాలతో క్యాంపులోకి చొరబడ్డారు. ఈ క్రమంలో సైనికులకు, ఉగ్రవాదులకు మధ్య కొద్దిసేపు భీకర కాల్పులు జరిగాయి.

నిషేధిత ఉగ్రవాద సంస్థ తహ్రీక్‌ఏతాలిబాన్ పాకిస్థాన్ టిటిపి ఈ దాడికి బాధ్యత వహించింది. తమ స్పెషల్ ఇస్తషాదీ ఫోర్సెస్ ద్వారా ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రకటించింది. 2025 అక్టోబర్‌లో క్వెట్టాలో జరిగిన దాడి తర్వాత, టీటీపీ అధికారికంగా బాధ్యత వహించిన ప్రధాన ఆత్మాహుతి దాడి ఇదే కావడం గమనార్హం. ఖైబర్ పఖ్తున్ఖ్వా ప్రాంత్నంలో కేవలం వారం వ్యవధిలో ఇలాంటి ఆత్మాహుతి దాడి జరగడం ఇది రెండోసారి. అంతకుముందు మంగళవారం లక్కీ మర్వత్ జిల్లాలోని నౌరంగ్ బజార్‌లో పేలుడు పదార్థాలతో నిండిన ఆటో రిక్షాతో జరిపిన దాడిలో ఇద్దరు పోలీసులు, ఒక మహిళ సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆ పేలుడు ధాటికి సమీపంలోని దుకాణాలు, వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇక్కడే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మరో దాడిలో ఐదుగురు పోలీసులు, ఇద్దరు పౌరులు మరణించారు. వరుసగా జరుగుతున్న ఈ ఉగ్రదాడులతో బాజౌర్, సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా బలగాలు హై అలర్ట్ ప్రకటించాయి.

# సుంకాలు రద్దుచేసి టెక్స్‌టైల్ పరిశ్రమను ఆదుకోండి..

## ప్రధానిమోడీకి తమిళనాడు సిఎం విజయ్ లేఖ



**చెన్నై, మే 15:** తమిళనాడులోని టెక్స్‌టైల్ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉందని, దానిని ఆదుకునేందుకు పత్తిపై ఉన్న 11 శాతం దిగుమతి సుంకాన్ని తక్షణమే తొలగించాలని ముఖ్యమంత్రి విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు ఆయన ప్రధానికి శుక్రవారం ఒక లేఖ రాశారు. పత్తి, నూలు ధరలు విపరీతంగా పెరగడంతో రాష్ట్రంలోని టెక్స్‌టైల్ రంగం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు, దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్, దుస్తుల ఎగుమతి రాష్ట్రం. ముఖ్యంగా గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది మహిళలు ఈ రంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఇటీవల పత్తి, నూలు ధరలు పెరగడంతో పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. దేశీయంగా పత్తి ఉత్పత్తి కొరత, ట్రేడింగ్ కార్యకలాపాలు పెరగడమే ఇందుకు కారణమని విజయ్ తన లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదల వివరాలను ఆయన తన లేఖలో స్పష్టంగా తెలిపారు. గత రెండు నెలల్లోనే పత్తి ధర 25 శాతం పెరిగింది. ఒక క్యాండీ (సుమారు 356 కిలోలు) ధర రూ. 54,700 నుంచి రూ. 67,700కు చేరింది. అదే సమయంలో నూలు ధర కిలోకు రూ. 301 నుంచి రూ. 330కి పెరిగింది. ఈ పరిస్థితుల్లో ముడిసరుకు కోసం దిగుమతులే ఏకైక మార్గం. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం ఉండటం అవరోధంగా మారిందని విజయ్ వివరించారు. వ్యవసాయం తర్వాత రాష్ట్రంలో అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం టెక్స్‌టైల్ అని గుర్తుచేసిన విజయ్, ఈ పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దిగుమతి సుంకాన్ని పూర్తిగా తగ్గిస్తే, పరిశ్రమకు అవసరమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల పెరుగుతున్న ఎగుమతి ఆర్డర్లను అందుకోవడమే కాకుండా ప్రపంచ మార్కెట్లో మన పరిశ్రమ పోటీతత్వాన్ని నిలబెట్టుకోగలుగుతుంది. తద్వారా లక్షలాది ఉద్యోగాలను కాపాడవచ్చని ఆయన అభ్యర్థించారు. ఈ విషయంలో కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని సీఎం విజయ్ విజ్ఞప్తి చేశారు.

# అవును నిజమే.. అయితే నాపాలనలో కాదు!

## అమెరికా క్షీణిస్తోందన్న జిన్‌పింగ్ వ్యాఖ్యలపై ట్రంప్ కౌంటర్

**వాషింగ్టన్, మే 15:** డోనాల్డ్ ట్రంప్ తన చైనా పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఆదేశస్తుల్లో చర్చకు దారితీసాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికాను క్షీణిస్తున్న దేశం"గా పేర్కొన్న విషయంపై స్పందించిన ట్రంప్ ఆ వ్యాఖ్య 100 సరైనదేనని అన్నారు. ఆ వ్యాఖ్యలు తన పాలనకు కాకుండా మాజీ అధ్యక్షుడు జో బిడెన్ హయాంలోని పరిస్థితులకు సంబంధించినవని స్పష్టం చేశారు. ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో ట్రంప్ బైడెన్ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో అమెరికా తీవ్ర నష్టాన్ని చవిచూసింది. ఓపెన్ బోర్డర్స్, అధిక పన్నులు, తప్పు వాణిజ్య ఒప్పందాలు, పెరుగుతున్న నేరాలు, విదేశీ విధానాలు వంటి అంశాలు దేశాన్ని బలహీనపరిచాయని ఆరోపించారు. తన పాలనలో అమెరికా మళ్లీ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదిగిందని ట్రంప్ పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయికి చేరుకున్నాయని, ఉద్యోగావకాశాలు భారీగా పెరిగాయని, విదేశీ పెట్టుబడులు ట్రిలియన్ల డాలర్లుగా అమెరికాలోకి వస్తున్నాయని తెలిపారు. సైనిక రంగంలోనూ అమెరికా బలంగా నిలిచిందని, ఇరాన్‌పై విజయం సాధించామని ఆయన వ్యాఖ్యానించారు. వెనిజులాతో సంబంధాలు మెరుగుపడ్డాయని కూడా ట్రంప్ పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం అమెరికా నిజంగానే క్షీణించిన దేశంగా ఉండేది. ఆ విషయంలో జిన్‌పింగ్‌తో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. కానీ ఇప్పుడు అమెరికా ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదిగిన దేశంగా మారిందని ట్రంప్ తెలిపారు. ఇక భవిష్యత్తులో అమెరికాచైనా సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంక్షిప్తంగా..

## అదృశ్య హంతకుల చేతిలో లష్కరే టాప్ కమాండర్ హతం

**క్వెట్టా, మే 15:** పాకిస్తాన్‌లో మరోసారి గుర్తుతెలియని వ్యక్తుల హల్చల్ చేశారు. ఉగ్రవాద నాయకుడిపై మరోసారి టార్గెటెడ్ అటాక్ జరిగింది. ఆ దేశంలోని బలూచిస్తాన్ ప్రావిన్సులో అజ్ఞాత వ్యక్తుల చేతిలో లష్కరే తోయిబా ఉగ్రసంస్థ సీనియర్ కమాండర్ మీర్ శుక్ర ఖాన్ రైసాని హతమయ్యాడు. ఇటీవల కాలంలో లష్కరేకు చెందిన పెద్ద తలకాయలను గుర్తుతెలియని వ్యక్తులు టార్గెట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఏ ప్రావిన్సులో ఉన్నా కూడా వెతికి మరి చంపుతున్నారు. తాజాగా జరిగిన సంఘటన బలూచిస్తాన్ రాజధాని క్వెట్టాలో జరిగింది. ఒక లష్కరే తోయిబా కార్యక్రమంలో పాల్గొన్న కొద్దిసేపటికే రైసాని అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఈ దాడిపై పాకిస్తాన్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## అక్రమ వలసలు ప్రోత్సహించిన ఇండియన్‌పై అమెరికా విచారణ


**న్యూయార్కు, మే 15:** కెనడా నుంచి అమెరికాలోకి అక్రమంగా మనుషులను తరలిస్తున్న స్మగ్లింగ్ రాకెట్‌లో తన ప్రమేయం ఉన్నట్లు 22 ఏళ్ల భారత యువకుడు అంగీకరించాడు. శివమ్ అనే ఈ యువకుడు, భారతీయులతో పాటు ఇతర దేశస్థులను అక్రమంగా యూఎస్‌కెనడా సరిహద్దు దాటించడంలో కీలక పాత్ర పోషించినట్లు అమెరికా న్యాయ విభాగం వెల్లడించింది. ఆర్థిక లబ్ధి కోసమే ఈ నేరానికి పాల్పడినట్లు అతను ఒప్పుకునాడు. కోర్టు పత్రాల ప్రకారం 2024 అక్టోబర్ నుంచి 2025 జూన్ మధ్య కాలంలో ఈ స్మగ్లింగ్ కార్యకలాపాలు సాగాయి. కెనడా సరిహద్దుల వద్దకు చేరుకున్న వలసదారులను పికప్ చేసుకుని, వారిని ఉత్తర న్యూయార్క్‌లోని రహస్య ప్రదేశాలకు (స్టాష్ హౌస్‌లు), ప్లాట్స్‌బర్గ్‌లోని హోటళ్లకు తరలించడం కోసం డ్రైవర్లను ఏర్పాటు చేయడమే శివమ్ పని. ఇలా ఒక్కో వ్యక్తిని తరలించినందుకు డ్రైవర్లకు అతను డబ్బు చెల్లించేవాడు. ఈ మొత్తం వ్యవహారంలో తన పాత్రకు గాను అతను కూడా పెద్ద మొత్తంలో డబ్బు ఆశించాడు.

## ప్రియుడితో వెళ్లిపోయేందుకు సొంత ఇంటికే కూతురు కన్నం

**మొరాదాబాద్, మే 15:** ప్రేమించిన వాడితో కలిసి కొత్త జీవితం ప్రారంభించేందుకు సొంత ఇంటికే కన్నం వేసిందో కూతురు. ప్రియుడు, అతడి స్నేహితులతో కలిసి సొంత ఇంట్లోనే కోటి రూపాయలకు పైగా దోపిడీకి పాల్పడింది. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో జరిగిన ఈ ఘటనలో వ్యాపారి కూతురు, ఆమె ప్రియుడు సహా ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మొరాదాబాద్‌కు చెందిన ఇత్తడి వ్యాపారి మహమ్మద్ ఇమ్రాన్ ఇంట్లో మే 11న తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ దోపిడీ జరిగింది. సాయుధులైన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను తుపాకీతో బెదిరించి బందీలుగా చేశారు. అనంతరం ఇంట్లో ఉన్న సుమారు రూ.1.2 కోట్ల నగదు, బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. వెళ్తూ వెళ్తూ ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్‌ను కూడా తమ వెంట తీసుకెళ్లారు.

## హిందువులకు కాదు హిందూత్వానికి వ్యతిరేకం:ఉదయనిధి

**చెన్నై, మే 15:** సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని తమిళనాడు డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ గతంనుంచి చేసిన వ్యాఖ్యలపై తాజాగా గురువారం స్పష్టత ఇచ్చారు. సనాతన విధానాలను నిర్మూలించడం అంటే ప్రజలు గుడికి వెళ్లకూడదని కాదు అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఇవ్వాలని, ఆలయాల్లోనే కాదు, యావత్ సమాజంలో సమానత్వం పాటించాలన్నారు. అసెంబ్లీలో మాట్లాడిన తన ప్రసంగంపై వస్తున్న విమర్శలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. ప్రజలను విభజిస్తున్న సనాతన ధర్మాన్ని నాశనం చేయాలన్నది తన ఉద్దేశమన్నారు. అయితే తనపై వస్తున్న విమర్శలకు తలొగ్గేది లేదన్నారు. హిందువులకు కాదు, హిందుత్వకు వ్యతిరేకం అన్నారు.




## ఆర్జీకర్ హత్యాచారం కేసులో ముగ్గురు పోలీస్ అధికారులపై వేటు!

**కోల్‌కత్తా, మే 15:** పశ్చిమ బెంగాల్‌లోని ఆర్జీకర్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మమత హయాంలో జరిగిన ఈ కేసు విచారణపై ఇప్పుడు బెంగాల్‌లోని బీజేపీ సర్కార్ దృష్టిపెట్టింది. ఈ కేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, తప్పుదోవపట్టించడం వంటివి చేసినందుకు ముగ్గురు పోలీసు అధికారులపై సీఎం సువేందు అధికారి వేటు వేశారు. నబ్బానాలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సువేందు అధికారి ఈ విషయంపై ప్రకటన చేశారు. ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశించారు. వినీత్ గోయల్ (కోల్‌కతా పోలీస్ కమిషనర్)తోపాటు అభిషేక్ గుప్తా, ఇందిరా ముఖోపాధ్యాయ్ అనే ముగ్గురిని సస్పెండ్ చేశారు.

# పాక్ మధ్యవర్తిత్వాన్ని అమెరికా విశ్వసించడంలేదు - భారత్ ముందుకు రావాలి: రష్యా మంత్రి సెర్గీ లావ్రోవ్

**న్యూఢిల్లీ, మే 15:** న్యూఢిల్లీ వేదికగా బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు సమావేశంలో రష్య విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలలో భారతదేశం ఒక ధీర్ఘకాలిక మధ్యవర్తి పాత్ర పోషించగలదని రష్యా విదేశాంగ మంత్రి అన్నారు. ప్రస్తుతం, ఇరాన్ యుద్ధంలో పాకిస్తాన్ మధ్యవర్తి పాత్ర పోషిస్తోంది. పాకిస్తాన్ చేసిన మధ్యవర్తిత్వం ఫలితాలను ఇవ్వలేదు. పాక్ అమెరికా ప్రతిపాదనల్ని తమ ముందు పెడుతోందని, తమ ప్రతిపాదనల్ని పట్టించుకోవడం లేదని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా ప్రతిపాదన కీలకంగా మారింది. సమస్యలను పరిష్కరించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు జరిపేందుకు పాకిస్తాన్ ప్రస్తుతం సహాయం చేయవచ్చు. అయితే దీర్ఘకాలిక మధ్యవర్తి అవసరమైతే సుదీర్ఘ దౌత్య అనుభవం ఉన్న భారత్ ఆ పాత్ర పోషించగలద్దు అని రష్యా మంత్రి అన్నారు. అయితే, లావ్రోవ్ చేసిన ఈ వ్యాఖ్యలు పాకిస్తాన్‌కు చికాకు తెప్పించవచ్చు. పాక్ మధ్యవర్తిత్వంపై ఇజ్రాయిల్, యూఏఈ, ఇరాన్ కూడా అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇటీవల పాక్ మధ్యవర్తిత్వాన్ని తాము విశ్వసించడం లేదని అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల నుంచి ఇరాన్ తన సైనిక విమానాలను రక్షించుకోవడానికి పాక్ సహాయం చేసిందని, పాకిస్తాన్‌లోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌లో ఇరాన్ విమానాలు ఉంచడానికి అనుమతించిందని అమెరికన్ మీడియా పేర్కొంది. ఇదే సమయంలో భారత్‌కు అటు అమెరికా, ఇటు ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతోనే రష్యా ఈ ప్రతిపాదన చేసి ఉంటుందన్న అంచనాలు వెల్లడ అయ్యాయి.



### పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై

# నేడు నిరసన ధర్నాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త :** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా నేడు(శనివారం) రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ధర్నాలు చేపట్టాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలెండర్స్‌పై రూ.1000 పెంచి, నెల రోజుల లోపే తాజాగా పెట్రోల్, డీజీల్ ధరలను సుమారు రూ. 3 పెంచి, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బిజెపి సభలో దేశ ప్రధాని నరేంద్రమోడీ పొదుపు మంత్రం జపించిన కొన్ని రోజులకే పెట్రోల్, డీజీల్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచిందని మండిపడ్డారు. తాజాగా పెంచిన పెట్రో ధరలతో నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజల మీద భారం పడుతున్నదన్నారు. 5 రాష్ట్రాల ఎన్నికలకు ముందు చమురు, గ్యాస్ నిల్వలు బాగా ఉన్నాయని, అమెరికా, ఇరాన్ యుద్ధం వలన భారతదేశానికి ఎలాంటి నష్టం లేదని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు ధరలను పెంచిందని కూనంనేని ప్రశ్నించారు. పెంచిన పెట్రో ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నేడు(మే 16న) రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా, మండల, గ్రామ, బస్తీ స్థాయిల్లో నిరసన ధర్నాలు చేపట్టాలని నిర్ణయించినట్టు కూనంనేని సాంబశివరావు తెలిపారు.

**సామాన్యులపై భారం మోపిన కేంద్రం:**

**సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వలన సామాన్య ప్రజలపై తీవ్రమైన భారం మోపుతున్నాయని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినా, దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం భారీ పన్నులతో ప్రజలను దోచుకుంటోందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి సామాన్యులు, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రవాణా ఛార్జీలు పెరగడంతో అన్ని రంగాలపై ప్రభావం పడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని, ప్రజలపై భారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ

### కమిటీ ఛైర్మన్‌గా ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 15:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు-త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. ఉద్యమంలో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో, వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలాకాలంగా ఉన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ-విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది.త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశంకమిటీ అవసరమైతే అధికారులను పిలిపించుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. అవసరమైన ఇతర వ్యక్తులు, అధికారులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

### సిఎస్‌కు తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రధానోపాధ్యాయులకి పదోన్నతులు కల్పించాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాష్, ముఖ్య సలహాదారు పర్వతి సత్యనారాయణ శుక్రవారం సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖలో రెండు దశాబ్దాలుగా పదోన్నతులకు దూరంగా ఉన్న ప్రధానోపాధ్యాయులకి సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతులు కల్పించాలని కోరినట్టు రాజభాను తెలిపారు. ఉపాధ్యాయ విద్యను బలోపేతం చేయడానికి డైట్, సీటీఈ, ఐఎఎస్ఈ, సీజీపీఈ తత్సమాన విద్యాసంస్థల్లోని ఖాళీలను అర్హులైన ఉపాధ్యాయులకి పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీ చేయాలన్నారు. మండల విద్యాధికారి(ఎంఈవో) పోస్టును మండల స్థాయి ఎడ్యుకేషన్ ఆఫీసర్ (ఎంఎల్ఈవో)గా మార్చి, గెజిటెడ్ హెడ్మాస్టర్ కంటే ఉన్నత హోదా కల్పించాలన్నారు. రెవెన్యూ డివిజన్ల తరహాలో ప్రతి 45 మండలాలకు ఒక విద్యా డివిజన్ ఏర్పాటు చేసి, ఒక ఉప పర్యవేక్షణాధికారిని నియమించాలని కోరినట్టు తెలిపారు. ఈ పోస్టులను 100 శాతం పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలన్నారు. గెజిటెడ్ హెడ్మాస్టర్(జీహెచ్ఎం) అనే నామకరణాన్ని మారుస్తూ, మారుతున్న కాలానికి అనుగుణంగా "ప్రిన్సిపాల్"గా గుర్తించాలన్నారు. కొత్తగా ఏర్పడిన 21 జిల్లాల్లో ఖాళీగా ఉన్న జిల్లా విద్యాధికారి(డీఈవో) పోస్టులను వెంటనే మంజూరు చేసి పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర పాత నిబంధనలను రద్దు చేసి, తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ సర్వీస్ రూల్స్ రూపొందించాలన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ, డైట్, సీటీఈ వంటి సంస్థల్లో గత 21 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఖాళీలను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని సీఎస్‌ని కోరినట్టు తెలిపారు.

# పర్సంటేజ్ విధానంపై కమిటీ

### నిర్మాతలు, ఎగ్జిబిటర్ల వివాద పరిష్కారానికి చర్యలు

### ఇరు వర్గాలతో ఫిల్మ్ ఛాంబర్ కీలక భేటీ

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త :** చిత్ర పరిశ్రమలో నిర్మాతలు, థియేటర్ ఎగ్జిబిటర్ల మధ్య సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజ్ విధానం అమలు, సాధ్యాధ్యాలపై ఒక కమిటీని ఏర్పాటు చేసింది. చిత్ర పరిశ్రమకు చెందిన 15 మందికి ఈ కమిటీ స్థానం కల్పించింది. సినిమాల ప్రదర్శన విషయంలో నిర్మాతలు, థియేటర్ ఎగ్జిబిటర్ల మధ్య ఏర్పడిన పర్సంటేజ్ వివాదంపై రాను రాను మరింత తీవ్రతరం అయి చిత్ర పరిశ్రమలో ప్రతిష్టంభ ఏర్పడే ప్రమాదం ఏర్పడింది. నిర్మాతలు, థియేటర్ ఎగ్జిబిటర్ల మధ్య పర్సంటేజ్ వివాదం తలెత్తడంతో ఈ సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రంగంలోకి దిగింది. ఇవాళ ఇరు వర్గాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ శుక్రవారం హైదరాబాద్‌లో భేటీ అయింది. వాడీవేడీగా జరిగిన ఈ సమావేశంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. నిర్మాతలు, ప్రొడ్యూసర్స్ మధ్య ఏర్పడిన వివాదాన్ని ఒక కొలిక్కి తీసుకువచ్చేందుకు ఈ ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీలో ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్, నిర్మాతలకు చోటు కల్పించింది. ఈ కమిటీలో ఒక్కో విభాగం నుంచి ఐదుగురుకి అవకాశం కల్పించారు.

# సింగరేణిలో స్త్రీ శక్తికి ప్రాధాన్యత

### తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలు

### సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త :** సింగరేణి కాలరీస్‌లో మహిళా శక్తికి ప్రాధాన్యత ఇచ్చే దిశగా ఆ సంస్థ యాజమాన్యం అడుగులు వేస్తోంది. ఇందుకు గాను చరిత్రలో తొలిసారిగా సంస్థ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా భారీ డంపర్లను నడిపే విషయమై మహిళలను నియమించనుంది. ఈ మేరకు సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి ఒక ప్రకటనలో వాటి వివరాలను వెల్లడించారు. వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై ఆసక్తి గల మహిళలకు సింగరేణిలో అవకాశాలు ఇవ్వనున్నారు. త్వరలో జారీ అయ్యే డంపర్ ఆపరేటర్లుగా మహిళల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటి వరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు, శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి, పైగా మండే ఎండల్లోనూ, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది. మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (ట్రైడ్స్)అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు డాక్టర్ బుద్ధప్రకాష్ వెల్లడించారు.

# ఉక్కు పరిశ్రమ పునాదిపైనే దేశ ఫార్మా రంగం విస్తరణ

### ఇఇపిసి-భారత్ జాయింట్ డిజిఎఫ్‌టి అక్షయ్

### హైదరాబాద్‌లో ఫార్మా మాక్‌టెక్ ల్యాబ్‌నెక్స్ట్‌ఎక్స్‌పో- 2026 రోడ్‌షో




**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** భారతదేశ ఔషధరంగ (ఫార్మాస్యూటికల్) భవిష్యత్తు వృద్ధి దేశీయ ఉక్కు, ఉత్పాదకరంగాల బలంపైనే ఆధారపడి ఉంటుందని ఈఈపీసీ-భారత్ హైదరాబాద్ ప్రాంతీయ సంయుక్త డిజిఎఫ్‌టి అక్షయ్ ఎస్‌సి స్పష్టం చేశారు. ప్రపంచ మార్కెట్ అవసరాలకనుగుణంగా ఉత్పత్తిదారులు మారాల్సిందేనన్నారు. ఈ మేరకు ఫార్మామాక్‌టెక్ ల్యాబ్ నెక్స్ట్ ఎక్స్‌పో- 2026 రెండో విడత ప్రత్యేక రోడ్‌షో హైదరాబాద్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని దేశంలోనే అగ్రగామి ఇంజనీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక సంస్థ ఈఈపీసీ-భారత్ నిర్వహించింది. ఈ సందర్భంగా డిజిఎఫ్‌టి అక్షయ్ ఎస్‌సి మాట్లాడుతూ... ప్రత్యేక యంత్రాల దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాలని కోరారు. అనంతరం ఈఈపీసీ భారత్ కార్యనిర్వాహక డైరెక్టర్ కార్యదర్శి అధిప్ మిత్ర మాట్లాడుతూ అమెరికాకు చేసే ఫార్మా ఎగుమతులను 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇందుకు తయారీ దారులు, ఎగుమతిదారులు విలువ ఆధారిత, ఆవిష్కరణలతో కూడిన నైపుణ్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఫార్మా 4.0, ఆటోమేషన్, ప్రిసిషన్ డ్రగ్ డెలివరీ, నాణ్యమైన ల్యాబ్ పరికరాల వంటి తాజా ఆవిష్కరణల గురించి తెలుసుకునేందుకు ఫార్మా మాక్‌టెక్ ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో -2026 ఒక విశిష్ట అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 7 నుంచి 9 వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో రెండో విడత ఫార్మా మాక్‌టెక్ ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్‌పో -2026 జరగనుంది. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద ఫార్మా ప్రదర్శనల్లో ఒకటిగా పేరుగాంచిన ఐపెక్స్‌తో కలిపి ఈ ఎక్స్‌పోను నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలు ఫార్మా, వైద్యారోగ్య ఇంజనీరింగ్ రంగానికి సంబంధించిన అన్ని సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురానున్నాయి. ఈ రోడ్‌షోలో ఫార్మా యంత్రాలు, ల్యాబ్ పరికరాల రంగంలో భారతదేశాన్ని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దడంపై చర్చించారు. సిడిఎస్‌సిఒ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ కే. నరేంద్రన్, హైదరాబాద్ ఈసిజిసి సీనియర్ మేనేజర్ సురేష్‌బాబు, పరిశ్రమల నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

# 'దోస్త్' తొలి విడతలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు జైకొట్టిన విద్యార్థులు

### తొలి దశ సీట్ల కేటాయింపుల్లో 50 శాతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరిక

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2026 విద్యాసంవత్సరానికి సంబంధించిన తొలి దశ సీట్ల కేటాయింపులో ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చేరడానికి విద్యార్థులు ఎక్కువ ఉత్సాహం చూపారు. మొదటి విడతలో ప్రకటించిన సీట్లలో సుమారు 50 శాతం సీట్లు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చేరినట్టు కళాశాల విద్య కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు తెలంగాణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయన్నారు.

తొలి విడతలో మొత్తం 56,147 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు 27,853 సీట్లు లభించాయి. తొలి దశ అడ్మిషన్లలో దాదాపు 49.6 శాతానికి సమానం. వాటిలో 8,079 సీట్లు సాధారణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు, 19,774 సీట్లు ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలలకు కేటాయించబడ్డాయని కళాశాల కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కేవలం ఉన్నత విద్యకు అవకాశాలు కల్పించే సంస్థలుగానే కాకుండా, నాణ్యమైన డిగ్రీ విద్యకు విద్యార్థులు ప్రాధాన్యంగా ఎంపిక చేసుకునే విద్యాసంస్థలుగా ఎదుగుతున్నాయన్నారు. స్వయంప్రతిపత్తి ద్వారా లభించే అకాడమిక్ స్వేచ్ఛ, విభిన్న కోర్సులు, మెరుగైన మౌలిక వసతులు, విద్యార్థి మద్దతు వ్యవస్థలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయన్నారు.


ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలల్లో అందుబాటులో ఉన్న 45,180 సీట్లలో 19,774 సీట్లు భర్తీ కావడంతో 43.77 శాతం సీట్ల భర్తీ నమోదైందన్నారు. తొలి దశ అడ్మిషన్లలో బాలికల ఆధిక్యం స్పష్టంగా కనిపించిందని, మొత్తం 36,302 మంది బాలికలకు సీట్లు కేటాయించగా, బాలురు 19,845 మందికి సీట్లు లభించాయన్నారు.

రాష్ట్రంలో మహిళల ఉన్నత విద్యాభివృద్ధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఇది సూచిస్తోందన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 23 వరకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని, గడువులోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకపోతే సీటు రద్దవుతుందన్నారు. ఈపాస్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్న విద్యార్థులు కుల, ఆదాయ ధృవపత్రాల పరిశీలన అనంతరం ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ సమయంలో ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటనలో స్పష్టం చేశారు.

# భేషజాలు వద్దు.. టిమ్స్‌ను అందుబాటులోకి తీసుకురండి

### టిమ్స్ సనత్‌నగర్‌ను సందర్శించిన మాజీమంత్రి కెటిఆర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 15, ప్రభాతవార్త:** కార్పొరేట్ ఆసుపత్రులకు తలదన్నే రీతిలో రూ. 1200ల కోట్లతో ఒక్కో టిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిలో వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఇంఛార్జి మాగంటి సునీతగోపీనాథ్, రాగిడి లక్ష్మారెడ్డి, పి. విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. హైద రాబాద్‌కు నాలుగువైపులా టిమ్స్ ఆసుపత్రులకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ శ్రీకాంర చుట్టారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉండి ఉంటే, రెండేళ్ల క్రితమే ఈ నిర్మాణాలు పూర్తై ఆసు పత్రి పేదలకు అందుబాటులోకి వచ్చే దన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం భేషజాలకు పోవద్దని, ఆసు పత్రిని ప్రారంభించాలని ఆయన సూచించారు. ఎయిమ్స్ స్థాయిలో వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో టిమ్స్‌ను ఆలోచించి రూపకల్పన చేశామ న్నారు. సనత్‌నగర్ టిమ్స్ కోసం దాదాపు 22 ఎకరాల వీస్తీర్ణాన్ని విని యోగించామని, అత్యాధునిక టెక్నాలజీ, అంతర్జాతీయ ప్రమా ణాలతో ఈ ఆసు పత్రి నిర్మాణం చేపట్టా మన్నారు. ఇందులో ఐసి యూ బెడ్స్‌తో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, రోగుల బంధువుల కోసం ప్రత్యేక ధర్మ శాలను ఏర్పాటుచేశామన్నారు. సనత్‌నగర్, వరంగల్ ఎంజిఎం, అల్వాల్, గచ్చిబౌలి, నిమ్స్ విస్తరణ పనులను సత్వరమే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి నోడల్ అధికారి మహబూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి కెటిఆర్, చిత్రంలో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాగంటి సునీతగోపీనాథ్

# ఆర్టీసీలో అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్టీసీజెఎసి విజ్ఞప్తి

**హైదారాబాద్, మే 15, ప్రభాతవార్త:** ప్రభుత్వంలో ఆర్‌టీసీ విలీనంపై వెంటనే అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని ఆర్‌టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ నేతలు శుక్రవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసి సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్స్‌ను గుర్తు చేస్తూ విలీనం గురించి వెంటనే అపాయింటెడ్ డేట్ ప్రకటన చేయాలని జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, యాదగిరి కోరారు. జేఏసీ నేతలతో మంత్రి స్పందిస్తూ .. సమ్మె చర్చల సందర్భంగా మంత్రులతో కూడిన కమిటీతో ఐఏఎస్ అధికారుల కమిటీలో కార్మిక సంఘాల నాయకులు చర్చచేసి ఒప్పుకున్న అంశాలను ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోందని మంత్రి తెలిపారు.

జేఏసీ నాయకులు ముందుగా విలీనం చేయాలని కోరగా సీఎం దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశం మేరకు తగు చర్యలు తీసుకుం టామని మంత్రి తెలిపారు. 2021 వేతన సవరణ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే అన్ని డిపోల్లో అధికారులు కార్మిక సంఘాల పట్ల స్నేహ సంబంధాలు కొనసాగించాలని అధికారులకు ఆదేశాలు చేస్తామని మంత్రి స్పష్టం చేయడం జరిగింది. మంత్రిని కలిసిన తరువాత జేఏసీ అత్యవసర సమావేశం జరిగిందని, ఈ సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో మరొక మారు సీఎంని కలిసి కాలయాపన చేయకుండా వెంటనే విలీనం చేయాలని, జేఏసీ ఆధ్వర్యంలో ఇచ్చిన విధి విధానాలను, ఉన్న సౌకర్యాలను కొనసాగిస్తూ మాస్టర్ స్కేల్ అమలు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించినట్టు జేఏసీ నేతలు తెలిపారు.

# పెట్రో ధరల పెంపుతో ప్రజలపై మోడీ ప్రభుత్వ మరో భారం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను మళ్లీ పెంచడం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ పెట్రో ధరల పెంపు ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్న సమయంలో కూడా దేశంలో పెట్రో ధరలను తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందని, చివరకు సామాన్యుడు తీవ్రంగా నష్టపోతారనీ ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలకే పరిమితమైందని విమర్శించారు. ప్రజల సంక్షేమం కంటే పన్నుల వసూళ్లపైనే కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని, వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని మహేష్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు.

# వారంలో అన్ని రోజులు పెట్రోల్‌బంకులు ఓపెన్

### ప్రతి ఆదివారం బంద్ ప్రచారానికి పౌర సరఫరాల శాఖ ఖండన

**హైదారాబాద్, మే 15, ప్రభాతవార్త:** ప్రతి ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకులు మూసివేస్తారని, కేవలం పని దినాల్లో మాత్రమే పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంటాయని జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ పౌరసరఫరాల శాఖ తీవ్రంగా ఖండించింది. కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఈ వార్త చక్కర్లు కొడుతుండడంతో వాహనదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇవన్నీ కేవలం అవాస్తవాలని స్పష్టం చేస్తూ ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రచారంపై తెలంగాణ సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పందిస్తూ రాష్ట్రంలోని పెట్రోల్ బంకులు అన్ని రోజులూ యథావిధిగా పనిచేస్తాయని వెల్లడించారు. ఆదివారంతో సహా వారంలోని ఏడు రోజులూ పెట్రోల్ బంకులు తెరిచే ఉంటాయని, ఎక్కడా సరఫరా నిలిపివేసే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. సాధారణంగా ఇలాంటి తప్పుడు వార్తలు ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తాయని, దీనివల్ల బంకుల వద్ద అనవసరపు రద్దీ పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ప్రముఖ రచయిత్రి శారదాఅశోక్‌వర్ధన్ అంత్యక్రియలు

### కన్నీటి వీడ్కోలు పలికిన సాహితీ లోకం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 15, ప్రభాతవార్త:** తొలితరం తెలుగు సినీగీత రచ యిత్రి శారదాఅశోకవర్ధన్(88) కన్నుమూశారు. కొద్దిరోజులుగా ఆమె అనా రోగ్యం తో బాధపడుతున్నారు. బంజారాహిల్స్‌లోని తన కుమార్తె అరుణ నివాసంలో ఆమె తుదిశ్వాస విడిచారు. సికింద్రాబాద్‌లో జన్మించిన శారద.. కుటుంబ పరిస్థితులరీత్యా 17వ యేట హైదరాబాద్ రాష్ట్ర సమాచార శాఖలో సహాయ అనువాదకురాలిగా చేరారు. తర్వాత అదే శాఖలో సంయుక్త సంచా లకులుగా ఉద్యోగ విరమణ పొందారు. ఉమ్మడి ఏపిలో జవహర్ బాలభవన్ డైరెక్టర్‌గా సైతం ఆమె పనిచేశారు. ఉద్యోగంలో చేరే సమయంలో తండ్రి నూకల అప్పారావుతో జరిగిన సంభాషణ ఆధారంగా ఆత్మార్పణ నాటకం రాయగా, ఆల్ ఇండియా రేడియోలో అది ప్రసారమైంది. డిప్యుటేషన్‌పై ఆకాశవాణిలో పని చేసినప్పుడు కుటుంబ నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు రూపొం దించారు. వందకు పైగా లలిత గీతాలు రచించగా, మనసాయెరా.. మాధవా ఎంత రాతి మనసు నీది తదితర పాటలు ఆకాశవాణి శ్రోతల అభిమానాన్ని పొం దాయి. శారద రాసిన గణపతి సుప్రభాతాన్ని మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఆలపించారు. ఎన్టీఆర్‌పై ఆమె రచించిన బుర్రకథ విశేషంగా ఆకట్టుకుంది. వచన, పద్య కవిత్వం, కథలు, నవలు, నాటకాలు ఇలా అన్ని సాహిత్య ప్రక్రి యల్లో ఆమె రచనలు చేశారు. 6 నృత్య రూపకాలు, 4 కవితా సంపుటాలు, 15 నవలలు, 300పైగా కథలు, బాలసాహిత్యం, రెండు బుర్రకథలు కలిపి 88 పుస్తకాలుగా ప్రచురితమయ్యాయి. తెలుగు సినీరంగంలో మొదటి గీత రచ యిత్రిగా ఆమె పేరు పొందారు. ఆమె రచించిన పలు ధారా వాహికలకు ఉత్తమ రచయిత్రిగా మూడుసార్లు బంగారు నంది పురస్కారాలు లభించాయి. సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యురాలిగా, రీజనల్ బోర్డు ఛైర్‌పర్సన్‌గానూ ఆమె సేవలందించారు. శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.



శారదా అశోకవర్ధన్(ఫైల్)

**త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి సంతాపం**

ప్రముఖ రచయిత్రి శారదాఅశోకవర్ధన్ మృతి తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్. జనార్ధనమూర్తి పేర్కొ న్నారు. ఆమె మరణవార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని తెలిపారు. తెలుగు భాషా సాహిత్య అభివృద్ధికి, మహిళా రచయితల ప్రోత్సాహానికి శారదా అశోకవర్ధన్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సాహిత్యంలో తనదైన శైలితో అనేక కథలు, వ్యాసాలు, నవలల ద్వారా పాఠక లోకాన్ని ఆకట్టుకున్నారని ఆయన కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# టిజిఎస్‌డబ్ల్యుఆర్‌జెసి సెట్‌కు 86.87 శాతం హాజరు

### 231 కాలేజీల్లో 19,860 సీట్లు

**హైదారాబాద్, మే 15, ప్రభాతవార్త:** టిజి ఎస్‌డబ్ల్యు ఆర్‌జేసీ సెట్-2026 ప్రవేశ పరీక్ష శుక్రవారం ముగిసింది. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యు కేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన సైనిక్, సీవోఈ, నాన్ సీవోఈ, ఒకేషనల్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాల కోసం నిర్వహించిన ఆర్‌జేసీ సెట్-2026 ప్రవేశ పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా విజయ వంతంగా నిర్వహించబడిందని గురుకుల సొసైటీ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌జేసీ సెట్‌కి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏప్రిల్ 5న విడుదల చేయగా ఏప్రిల్ 6 నుంచి 25 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 45,357 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో ఎంపీసీ గ్రూప్‌కి 21,447, బైపీసీ గ్రూప్‌కి 17,400, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులకు 6,510 దరఖాస్తులు వచ్చాయి. 2026-27 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 231 గురుకుల విద్యాసంస్థల్లో 19,860 సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నారు.

శుక్రవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 117 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో 39,400 మంది విద్యార్థులు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 86.87 శాతం విద్యార్థులు పరీక్షా రాశారు. ఎంపీసీ గ్రూప్‌కి 18,870 మంది (87.98శాతం), బైపీసీ గ్రూప్‌కి 15,173 మంది (87.20 శాతం), ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులకి 5,357 మంది (82.28శాతం) హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించినట్లు సొసైటీ కార్యదర్శి శారద ప్రకటనలో తెలిపారు.



# కేన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక ఆస్పత్రులు

## సిఎం రేవంత్‌రెడ్డికి కేన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ నివేదికను అందజేసిన వైద్యనిపుణుడు నోరి దత్తాత్రేయ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 15:** హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. శుక్రవారం సిఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ ను ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు నోరి దత్తాత్రేయ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చోంగ్థు పాల్గొన్నారు. తెలంగాణలో క్యాన్సర్ వ్యాధిపై సమగ్ర నివేదికను అందజేసిన నోరి దత్తాత్రేయుడిని సిఎం అభినందించారు. క్యాన్సర్‌పై పోరాటంలో నోరి దత్తాత్రేయుడు రూపొందించిన అట్లాస్ ఎంతో ఉపయోగకరమన్న సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి కారణాలను అన్వేషించే అవకాశం ఈ నివేదిక ద్వారా లభిస్తుందని సిఎం పేర్కొన్నారు. నివేదికలో అందించిన డేటా ఆధారంగా క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు

## ఎపి టిడిపి కీలక నిర్ణయం

**నెల్లూరు, మే 15, ప్రభాతవార్త-వైద్యం :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు మే 27, 28 తేదీల్లో జరగబోయే పసుపు పండుగ మహానాడు ఈసారి హైబ్రిడ్ మోడ్ లో జరపాలని పార్టీ నిర్ణయించింది. పశ్చిమాసియా యుద్ధం, ప్రస్తుతం దేశంలో ఉన్న ఆయిల్ క్రైసిస్ (చమురు సంక్షోభం) ప్రభావం దృష్ట్యా బాధ్యతగా వ్యవహరించాలని జాతీయ అధ్యక్షులు భావించారు.

పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో మే 27, 28 తేదీన హైబ్రిడ్ మోడ్ లో జరిగే మహానాడులో పొలిట్ బ్యూరో సభ్యులు, స్టేట్ బాడీ సభ్యులు పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1848 క్లస్టర్ల వద్ద స్క్రీన్లు ఏర్పాటు చేస్తాం. ఒక్కో క్లస్టర్ దగ్గర సుమారు 500 మంది కార్యకర్తలు వీక్షించేలా ఏర్పాట్లు ఉంటాయి. మే 18, 19, 20 తేదీల్లో జరగాల్సిన మినీ మహానాడులు, 23, 24 తేదీల్లోని పార్లమెంట్ స్థాయి మహానాడులను రద్దు చేస్తున్నాం. పొదుపు చర్యల్లో భాగంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ స్వాగతించాలని కోరుతున్నాం.

## ఉక్రెయిన్ డ్రోన్ల చొరబాటుతో

# నైతిక బాధ్యత వహించి లాత్వియా ప్రధాని రాజీనామా

**రిగా(లాత్వియా), మే 15:** తమదేశంలోకి ఉక్రెయిన్ డ్రోన్ ఒకటి చొచ్చుకు వచ్చిందన్న కారణంతో నైతిక బాధ్యతగా లాత్వియా ప్రధాని ఎవికా సిలినా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 2023 నుంచి ప్రధానిగా కొనసాగుతున్న ఎవికా సిలినాకు డ్రోన్ వ్యవహారంపై ఆమెకు మద్దతిచ్చిన సంకీర్ణభాగస్వామి ప్రొ గ్రెసివ్ పార్టీ తన మద్ద తును ఉపసంహరించు కోవడంతో ఆమె వెంటనే ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనకు మెజార్టీ లేకుండా ప్రభుత్వం నడప బోనని ఆమె స్పష్టం చేసారు. అయితే ఆమె పార్టీలోనే కొనసాగుతానని క్రియాశీలక రాజకీయాలకు దూరం కాబోనని స్పష్టంచేసారు. లాత్వియా రక్షణమంత్రి ఆండ్రిస్ స్ప్రడ్స్ పై తీవ్ర ఒత్తిడి



ఎదురుకావడంతో ఆయన రాజీనామాచేసారు. ఉక్రెయిన్‌నుంచి అనేక డ్రోన్లు లాత్వియా ప్రాదేశిక ప్రాంతంలోకి రావడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసాయి. ఈ సంఘటనతో స్ప్రడ్స్ దేశ ప్రజల విశ్వాసం పొందలేకపోయారని, తనకు కూడా సన్నగిల్లిందని పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీ రెండు అనుమానిత ఉక్రెయిన్‌డ్రోన్లు లాత్వియా మీదుగా రష్యావైపు దూసుకువెళ్లాయి. బాల్టిక్ దేశాలను గత మార్చినుంచి ఇలా జరుగుతూనే ఉన్నాయి. ఇతర యూరోపియన్ దేశాలు కూడా ఇలా ఉక్రెయిన్ డ్రోన్లబారినపడుతున్నట్లు తేలింది. నిజానికి అక్టోబరులో సార్వత్రిక ఎన్నికలు జరగాల్సి ఉంది. అనివార్యంగా ఎవికా సిలినా రాజీనామాచేయడంతో అధ్యక్షుడు ఎడ్‌గార్స్ రిన్‌కెవిక్స్ పార్టీ సీనియర్లు, ఎంపిలతో సమావేశం ఏర్పాటుచేసి చర్చలు జరిపారు.

# పుట్టపర్తిలో యుద్ధ విమానాల ప్రాజెక్టు

## రక్షణ రంగం మరింత బలోపేతం : రాజ్‌నాథ్‌సింగ్

**శ్రీసత్యసాయి జిల్లా, మే 15, ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ రక్షణలో పుట్టపర్తి లో తయారయ్యే యుద్ధ విమానాలు కీలకంగా మారనున్నాయని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణ పల్లి వద్ద ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంపాక్ట్ కాంబాక్ట్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్ట్‌తోపాటు వాటి అనుబంధ ప్రాజెక్టుల శిలాఫలకాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ ఏ ఎం సి ఏ ప్రాజెక్టు దేశ చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని, స్వదేశీ తయారీతో రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. అంతర్జాతీయంగా విభిన్న పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దేశభద్రత విషయంలో ఇతర దేశాలపై ఆధారపడలేమనీ అందుకే ఆత్మనిర్భరత అనేది ఓ కీలకమైన అంశంగా మారిందన్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో టెక్నాలజీ, అభివృద్ధి గురించి ఆలోచించే దార్శనిక నేత చంద్రబాబు నాయుడు అని, ఇలాంటి నేతను ఎక్కడా చూడలేదని కొనియాడారు. క్వాంటం సహా ఆధునిక టెక్నాలజీలను ఏపీకి తీసుకువచ్చారనీ, గూగుల్ లాంటి ఐటీ దిగ్గజ కంపెనీలు ఏపీని ఎంచుకున్నాయన్నారు. ఏపీ అంటే అడ్వాన్స్డ్ ప్రదేశ్ అనీ, దేశానికి ఓ రోల్ మోడల్ గా ఏపీ మారిందన్నారు. వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టులో నాలుగు డిఫెన్సు కంపెనీలకు కూడా శంకుస్థాపన జరిగాయనీ కర్నూలు డ్రోన్ సిటీలో 8 కంపెనీలకు కూడా శంకుస్థాపన చేశామన్నారు. డిఆర్డిఓ ఇప్పుడు 5వ తరం స్టెల్త్ యుద్ధ విమానం తయారు చేసేందుకు అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ను తయారు చేస్తోందన్నారు. రూ.15 వేల కోట్ల విలువైన పెట్టుబడితో ఎయిర్ క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ తో పాటు ఆధునిక ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కేవలం కొద్ది దేశాల వద్ద ఉన్న ఫైటర్ ఫ్లైట్ టెస్టింగ్ దేశాల సరసన భారత్ కూడా నిలిచిందన్నారు. అమ్కా ప్రాజెక్టుతో తయారైన ఆధునిక యుద్ధ విమానాలు మన రక్షణ శక్తిని, గగనశక్తిని చాటేలా పుట్టపర్తి నుంచి టేకాఫ్ అవుతాయన్నారు. బీడీఎల్ తయారు చేసిన టార్పెడో, హెచ్‌ఎఫ్ సీఎల్ నుంచి తయారయ్యే ఎలక్ట్రిక్ ఫ్యూజ్ కూడా ఈ నేల నుంచే పరీక్షిస్తామన్నారు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ కూడా రూ.480 కోట్లతో ఆధునిక అటానమస్ అండర్ వాటర్ వ్యవస్థలను, టార్పెడోలను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇప్పటి వరకూ దిగుమతి



చేసుకుంటున్న చాలా పరికరాలను కూడా స్వదేశీయంగా తయారు చేసుకోగలం తద్వారా మన సముద్ర తీరప్రాంతాలకు పూర్తి రక్షణతో పాటు బ్లూ ఎకానమీకి ఊతం ఇచ్చేలా ఈ ప్రాజెక్టు మారుతుందన్నారు.

భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ అగ్నేయాస్త్ర సంస్థ ఆధునిక ఆయుధాలను తయారు చేస్తుందనీ, రూ.1500 కోట్ల పెట్టుబడితో భవిష్యత్ లో యుద్ధానికి అవసరమైన ఆధునిక వ్యవస్థలు తయారు అవుతాయన్నారు. హెచ్‌ఎఫ్‌సీఎల్ రూ.1294 కోట్ల వ్యయంతో ఎలక్ట్రికల్ ఫ్యూజ్ లు తయారు చేస్తుందనీ, 8 డ్రోన్ కంపెనీలు ఓ డ్రోన్ సిటీని ఏర్పాటు చేస్తున్నాయన్నారు. డ్రోన్ టెక్నాలజీ ఆధునిక వార్ ఫేర్ లో ఓ గేమ్ చేంజర్ గా మారిందన్నారు.

మేక్ ఇన్ ఇండియాను బలోపేతం చేసేలా ఈ ప్రాజెక్టులు మారబోతున్నాయన్నారు. వీటితో పాటు వ్యవసాయం సహా వేర్వేరు అవసరాలకు వీటి ఉపయోగం ఉంటుందనీ, సూరత్ డైమండ్ సిటీగా, బెంగుళూరు భారత సిలికాన్ వ్యాలీగా పేరు పొందాయి. ఇక కర్నూలు కూడా ప్రపంచ డ్రోన్ హబ్ గా ప్రసిద్ధి చెందుతుందన్నారు. ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ లాంటి త్రివిధ దళాలకు అవసరమైన ఆయుధాలు, టెక్నాలజీని ఆంధ్రప్రదేశ్ నుంచి తయారు చేయబోతున్నట్లు తెలిపారు. పరిశ్రమలు, స్టార్టప్ లు, సంస్థలు అన్నీ కలిసి జన విప్లవంగా మారి దేశ అభివృద్ధి అనే మహా యజ్ఞం కోసం పని చేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రజా ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌లో స్పష్టంగా కనిపిస్తోందనీ, నైపుణ్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

దేశానికి మిలట్రీ ఇండస్ట్రియల్ కాంప్లెక్సుగా ఈ ప్రాంతాన్ని తయారు చేసేలా ప్రణాళికలు చేయాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. బెంగుళూరుకు అతి సమీపంలో ఉన్న ఈ ప్రాంతాన్ని సైనిక పారిశ్రామిక సముదాయంగా మారిస్తే దేశ అభివృద్ధికి కీలకం అవుతుందన్నారు.

# గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు ఇప్పపువ్వు ప్రాజెక్టు దిక్సూచి

## మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీతక్క

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** గిరిజనుల సంప్రదాయ జీవన విధానానికి ఆధారమైన ఇప్ప (మహువా) పువ్వును వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రధాన వనరుగా మలిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో మహువా ఫ్లవర్ ప్రాజెక్ట్ అమలుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క , ఎంపి వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.



గిరిజన ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, పోషకాహార భద్రత, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఇప్ప పువ్వు ఆధారిత ప్రాజెక్టులను రూపొందిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గిరిజన ఆర్థిక స్వావలంబనకు 'ఇప్ప పువ్వు' ప్రాజెక్ట్ దిక్సూచి అని పేర్కొన్నారు. అడవుల్లో సహజసిద్ధంగా లభించే ఇప్ప పువ్వు గిరిజన సంస్కృతి, ఆహార సంప్రదాయాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు.

అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో సహజసిద్ధంగా లభించే ఇప్ప పువ్వు నుండి లడ్డూలు, నాచురల్ హెల్త్ ఫుడ్స్, సంప్రదాయ ఆహార పదార్థాలు తయారు చేయవచ్చన్నారు. ఇప్ప గింజల నుండి నూనె తయారీకి కూడా పలు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఆకులు, పువ్వులు, గింజలు అన్నీ వినియోగంలోకి తీసుకువస్తే గిరిజన ప్రాంతాల్లో చిన్న స్థాయి పరిశ్రమలు ఏర్పడి మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

ఇప్ప పువ్వుతో పోషకాహార పదార్థాలు, పిల్లలకు ఆరోగ్యకరమైన స్నాక్స్, మిల్లెట్ ఆధారిత ఫుడ్ ప్రొడక్ట్స్, హెర్బల్ టీలు, సహజసిద్ధమైన స్వీట్లు తయారు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆమె సూచించారు.

గిరిజన మహిళల సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేస్తే ప్రపంచ మార్కెట్‌లో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావచ్చని వెల్లడించారు.

# బండి సంజయ్ లక్ష్యంగా దుష్ప్రచారాన్ని ఆపేయండి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 15:** బండి భగీరథ్ కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ లక్ష్యంగా కొనసాగిస్తున్న దుష్ప్రచారాన్ని వెంటనే ఆపేయం డని సిటీసివిల్ కోర్టు శుక్రవారం ఆదేశించింది. మరోవైపు బండి భగీరథ్ బాధితురాలి గోప్యతకు భంగం కలిగించిన సామాజిక మాధ్యమాల నిర్వాహకులకులపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తూ ప్రసారం చేసిన వీడియో క్లిప్పింగులను, పత్రికా క్లిప్పింగులను, డిజిటల్ కంటెంట్, వాల్‌పోస్టర్లను తొలగించండనీ పేర్కొన్నారు. ఈనెల 26లోపు ఆయా వీడియో క్లిప్పింగులను, డిజిటల్, పత్రికా కథనాలను, పోస్టర్లను తొలగించకపోతే చర్యలు తప్పవు హైదరాబాద్ సిటీసివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇకపై బండి సంజయ్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరిక చేసింది. తనపై మీడియా, సోషల్ మీడియా, యూ ట్యూబ్‌లో పరువు నష్టం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు.

తన కుమారుడు భగీరథ్ పోక్సో కేసుతో పాటు

## సిటీసివిల్ కోర్టు ఆదేశాలు

## బండి భగీరథ్ బాధితురాలి గోప్యతకు భంగం కలిగించిన సోషల్ మీడియాపై కేసులు

తనపైన ఉద్దేశ్యపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

భవిష్యత్తులో తన పేరు, ఫొటోలు, విడియోలు వాడొద్దంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పేరుతో ఇప్పటివరకు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న విడియోలను తొలగించాలని కోర్టును బండి సంజయ్ కోరారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా ప్రచారం జరుగుతోందని న్యాయస్థానానికి బండి సంజయ్ వివరించారు.

ఈ క్రమంలో సోషల్ మీడియా, యూట్యూబ్, మీడియాలో బండి సంజయ్‌పై వచ్చిన కథనాలను వెంటనే తొలగించాలని సిటీసివిల్ కోర్టు గ్యాగ్ ఆర్డర్‌లో ఆదేశించింది. తదుపరి ఆదేశాల వరకు ఎలాంటి కథనాలు ప్రసారం చేయొద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది.

బండి భగీరథ్ పోక్సో కేసు బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రుల ఫొటోలు, వీడియోలు వైరల్ చేసిన సోషల్ మీడియా నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లోని కొన్ని ఛానళ్లు బాధిత కుటుంబం వివరాలు బహిర్గతమయ్యేలా ఫొటోలు, విడియోలు ప్రసారం చేశాయి.


ఇవి వైరల్‌గా మారడంతో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలిక, ఆమె కుటుంబ వివరాలు బయటపెట్టిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అకౌంట్లను గుర్తించి సంబంధిత యూఆర్‌ఎల్‌లను ఉన్నతాధికారులకు పంపించారు. ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకునేందుకు రంగంలోకి దిగారు.

బాధితురాలి గోప్యతకు భంగం కలిగిస్తే శిక్ష తప్పదంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులను షేర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు..

## నాంపల్లి రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం

## ప్రయాణికులు సురక్షితం



**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త :** నాంపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్టేషన్‌లో నిలిపి ఉంచిన జైపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (హైదరాబాద్-జైపూర్) రైలుకు చెందిన ఏసీ కోచ్‌లలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో స్టేషన్‌లోని ప్రయాణికులు, రైల్వే సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రైలులోని బి-1, బి-2, బి-3 ఏసీ కోచ్‌లు మంటల్లో చిక్కుకున్నాయి. శుక్రవారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరాల్సి ఉన్న రైలులో సాయంత్రం సుమారు 6.20 గంటల ప్రాంతంలో బోగీల్లో నుంచి పొగలు రావడం గమనించిన రైల్వే అధికారులు వెంటనే ఫైర్ శాఖతో పాటు హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న హైడ్రా డీఆర్‌ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తెచ్చారు.

ప్రమాదం సంభవించిన సమయంలో బోగీలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో రైలు ప్లాట్‌ఫామ్‌పై నిలిచి ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలు వ్యాపిస్తున్న విషయాన్ని గమనించిన తోటి ప్రయాణికులు, ప్లాట్‌ఫామ్‌పై ఉన్నవారు వెంటనే స్పందించారు. అప్రమత్తమైన వారు బోగీల అద్దాలను పగలగొట్టి, లోపల ఉన్న ప్రయాణికులను అత్యంత సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ప్రమాద సమయంలో బోగీల్లో ప్రయాణికులు తక్కువ సంఖ్యలో ఉండటం, వెంటనే ఖాళీ చేయించడంతో ఒక పెద్ద ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు, స్థానిక ఫైర్ సిబ్బంది రంగంలోకి దిగారు. ఘటన స్థలానికి 3 ఫైర్ ఇంజన్లు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించాయి. ఫైర్ సిబ్బంది, రైల్వే సిబ్బంది ఉమ్మడిగా పోరాడి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. దీంతో మంటలు పక్కన ఉన్న ఇతర బోగీలకు, ప్లాట్‌ఫామ్‌కు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. ప్రాథమిక సమాచారం ప్రకారం..షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఏసీ కోచ్‌లలో ఈ మంటలు చెలరేగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి గల ఖచ్చితమైన కారనాలను తెలుసుకోవడానికి రైల్వే ఉన్నతాధికారులు దర్యాప్తుకు ఆదేశించారు. ఈ ప్రమాదం కారణంగా నాంపల్లి రైల్వే స్టేషన్‌లో కొంతసేపు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# వచ్చే ఎన్నికల్లో బిజెపిని అధికారంలోకి తీసుకురావడమే ప్రథమ లక్ష్యం

## బండి భగీరథ్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** రాబోయే పదేళ్లలో తెలంగాణలో భారతీయ జనతా పార్టీనే ప్రధాన రాజకీయ శక్తిగా అవతరిస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఒక వేదికలో పాల్గొన్న ఆయన రాష్ట్ర రాజకీయాలు, రైతు సమస్యలు, సంస్థాగత బలం, సమకాలీన అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బిజెపి సంస్థాగతంగా ఎంతో బలపడిందని, రాష్ట్రవ్యాప్తంగా 35 వేల బూత్ కమిటీలతో పార్టీ పటిష్ఠంగా ఉందని తెలిపారు. రాబోయే 2028-29 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకురావడమే తమ ప్రథమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఇక్కడ బిజెపి ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, గతంలో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు అవకాశమిచ్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతుందన్నారు. కాని ఈ రెండు పార్టీల అసంబద్ధ పాలనతో ప్రజలకు న్యాయం జరగలేదని, అందుకే ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని ఆయన తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందిస్తామని హామీ ఇచ్చారు.

ఇల్లు, వైద్యం, విద్య, పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా పాలన అందిస్తామని, బిజెపి పాలిత రాష్ట్రాల్లోని ప్రజానుకూల పరిపాలనను చూసే ప్రజలు మళ్లీమళ్లీ ఆ పార్టీకి అధికారాన్ని కట్టబెడుతున్నారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు ఇప్పటికే బిఆర్ఎస్ పాలనను చూశారని, ఇప్పుడు కాంగ్రెస్ వైఖరిని సైతం గమనిస్తున్నారని, అందుకే ప్రస్తుతం అందరూ బిజెపివైపు చూస్తున్నారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ సున్నా స్థానాలకు పడిపోవడం ప్రజలిచ్చిన స్పష్టమైన తీర్పేనని, తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ప్రధాన పోటీ కేవలం బిజెపితోనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల్లో పార్టీపై విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ఇతర పార్టీల నుండి నేతలు వస్తేనే పార్టీ బలపడుతుందనే భావన సరైంది కాదన్న ఆయన గ్రామీణ ప్రాంతాల యువత, మహిళలు, మేధావులు, వైద్యులు, న్యాయవాదులు, సినీ రంగానికి చెందినవారు స్వచ్ఛందంగా భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, గతంలో రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కొన్ని నిర్ణయాలు తీసుకున్నప్పటికీ ప్రస్తుతం పార్టీ బలం గణనీయంగా పెరిగిందని తేల్చిచెప్పారు. ఇప్పుడు తమకు ఎలాంటి పొత్తులు అవసరం లేదని, ఒంటరిగానే పోటీ చేసి అధికారంలోకి వస్తామనే నమ్మకం ఉందని అన్నారు.

# పోక్సో కేసులో భగీరథ్ బాధితురాలిపై దుష్ప్రచారం!

## సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న బాధితురాలి తల్లి లేఖ

**హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త:** బండి సాయిభగీరథ్ చేతిలో లైంగిక వేధింపులకు గురైన మైనర్ కూతురుపై కావాలనే దుష్ప్రచారం చేస్తూ, ఫొటోలు బయట పెడుతున్నారని, భగీరథ్ కుటుంబ అనుచరులతో తమకు ప్రాణహాని ఉందని బాలిక తల్లి ఆవేదన వ్యక్తం చేస్తూ లేఖ రాసినట్లు సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం చక్కర్లు కొట్టింది. రాజకీయ అండదండలు లేని సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన తాము ఈరోజు తమ బిడ్డను కాపాడుకోవడానికి పోరాటం చేస్తున్నామని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. అధికార దురహంకారానికి వ్యతిరేకంగా తమ న్యాయ పోరాటాన్ని వినమని సమాజంలోని వ్యవస్థలను వేడుకోవాల్సిన దారుణమైన పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదని పగతోనో, ప్రచారం కోసమో చేయడం లేదని నిజాలతో తమ బాధను అందరికీ తెలియపరచాలని ఈ ప్రకటన చేస్తున్నానని ఆమె తెలిపారు. నిందితుడు బండి భగీరథ్ బయట ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నాడని గతంలో న్యాయం కోసం సంగప్పతో కలిసి బండి భగీరథ్ ఇంటికి వెళ్తే బెదిరింపులకు దిగారని పేర్కొన్నారు. ఇప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా, వ్యక్తుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ బెదిరింపులు తమను తీవ్ర భయాన్ని కలిగిస్తున్నాయని, తమ కుటుంబానికి తీవ్రమైన ప్రమాదం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బిడ్డ పుట్టిన తేదీకి సంబంధించి కావాలనే వివాదం రేపి, న్యాయపరమైన విచారణ ఆలస్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని బాధితురాలి తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. 2025లో బండి భగీరథ్‌తో తనకు పరిచయం ఏర్పడిందని తన కూతురు చెప్పిందని ఆమె తెలిపారు. మొదట సాధారణ పరిచయంగా ప్రారంభమై.. తర్వాత భగీరథ్ తనతో పదే పదే మాట్లాడేవాడని, బలవంతంగా ఒప్పించడం, అనేక రకాల ప్రలోభాలకు గురిచేశాడని పేర్కొన్నారు. తర్వాత తన కుమార్తెకు మాయమాటలు చెప్పి మానసికంగా లొంగదీసుకున్నాడని చెప్పారు.

తనకు ఇష్టం లేకపోయినా.. అనేకసార్లు తీవ్రంగా ప్రతిఘటించిన సందర్భాల్లోనూ శారీరక సంబంధం కోసం బండి భగీరథ్ పదేపదే ఒత్తిడి తీసుకొచ్చారని తెలిపారు. ముఖ్యంగా 2025 డిసెంబరు 31వ తేదీ రాత్రి, 2026 జనవరి 1వ తేదీ తెల్లవారుజామున మొయినాబాద్‌లో తన కుమార్తెపై దాడి జరిగిందని తెలిపారు. ఆ రోజు తనకు ఇష్టం లేకపోయినా మద్యం సేవించాలని ఒత్తిడి తీసుకొచ్చాడని పేర్కొన్నారు. అచేతన స్థితిలో ఉన్నప్పుడు అనుచితమైన ప్రవర్తనకు దిగాడని, బలవంతంగా, శారీరకంగా దాడి చేశాడని వెల్లడించారు. ఆ తర్వాత కూడా అనేకసార్లు శారీరక సంబంధం కోసం ఒత్తిడి తీసుకొచ్చాడని తెలిపారు. చివరకు ధైర్యం చేసి 2026 మార్చి, ఏప్రిల్ నెలలో చట్టపరంగా ముందుకు పోదామని ప్రయత్నించామని పేర్కొన్నారు. బండి భగీరథ్ ప్రతినిధి అని చెప్పుకుంటూ ఏప్రిల్ 22న సంగప్ప తమ నివాసానికి వచ్చి మాట్లాడాడని తెలిపారు. సంగప్ప చెప్పినట్లుగా ఆ తర్వాత రోజు బండి భగీరథ్ ఇంటికి వెళ్లి కలిశామని పేర్కొన్నారు. ఆ భేటీలో తమకు భరోసా, రక్షణ కలుగుతుందని ఆశించాము కానీ, బండి ఇంటి నుంచి తీవ్రమైన భయంతో బయటకు వచ్చామని తెలిపారు. తన రాజకీయ ప్రాబల్యం, అనుచరుల ద్వారా మా కుటుంబానికి కష్టాలు తప్పవని, జరగబోయే పరిణామాల గురించి బండి భగీరథ్ కుటుంబసభ్యులు చేసిన హెచ్చరికలు తీవ్రంగా భయపెట్టాయని చెప్పారు. ఆ రోజు నుంచి భయం భయంగానే బతుకుతున్నామని తెలిపారు.

చివరకు ఈ నెల 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి పోక్సో చట్టం కింద తమ ఫిర్యాదును నమోదు చేయాలని కోరామని తెలిపారు. మైనర్ బాలిక అయిన తమ కూతురు తనకు కలిగిన కష్టనష్టాలను వెల్లడించినప్పటికీ ఐదు గంటలకుపైగా మమ్మల్ని పోలీస్ స్టేషన్‌లో పోలీసులు వేచి ఉండేలా చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ మాకు జూరిస్డిక్షన్ సమస్యలు ఉన్నాయి, ఫిర్యాదును బదలీ చేస్తామంటూ రకరకాల కారణాలు చెప్పారని.. జీరో ఎఫ్‌ఐఆర్ గురించి పదే పదే పట్టుబట్టిన తర్వాతే రశీదు జారీ చేశారని తెలిపారు. తమ మైనర్ కుమార్తెకు జరిగిన ఇంతటి ఆవేదన ఇంకొక ఏ బిడ్డకు కలగకూడదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే కొందరు దీనిని వ్యక్తిగత సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మొదట పోలీసులకు బాధితురాలి ఆరోపణలు స్పష్టంగా చెప్పినప్పటికీ, బెయిల్ పొందదగిన నిబంధనలను మాత్రమే చేర్చారని పేర్కొన్నారు.

ప్రజల ఆందోళన, ఆ తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి తమ కూతురు నుంచి మరోసారి వివరమైన వాంగ్మూలం నమోదు చేసి తీవ్రమైన సెక్షన్లను నమోదు చేశారని చెప్పారు. తమ బిడ్డపై జరిగిన దాడిని నిష్పాక్షి కంగా, స్వతంత్రంగా, న్యాయబద్ధంగా విచారణ జరగాలని కోరారు. తమ మైనర్ బిడ్డ ఫొటోలను, ఆమె గుర్తింపును బయటకు వచ్చేలా సామాజిక మాధ్యమాల్లో కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మైనర్ల గుర్తింపును, గౌరవాన్ని కాపాడటం పోక్సో చట్టం బాధ్యత మాత్రమే కాదు, సమాజం నైతిక బాధ్యత అని వేడుకున్నారు.



ఆట

## సింధూ, లక్ష్యసేన్ ఓటమి; సింగిల్స్‌లో ముగిసిన భారత్ సవాల్

# డబుల్స్ సెమీస్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ


**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్‌లో భారత్ షట్లర్ల పోరు ముగిసింది. స్టార్ ప్లేయర్లు పీవీ సింధూ, లక్ష్యసేన్ ఇద్దరూ కూడా క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ సింధూ పోరాడి ఓడింది. మూడు సెట్లపాటు హోరాహోరీగా గంటకు పైగా కొనసాగిన పోరులో సింధూపై టాప్ సీడ్, జపాన్ క్రీడాకారిణి అకానె యమగుచి గెలుపొందింది. తొలి సెట్‌ను 21-19తో నెగ్గి జోరు చూపిన సింధూ.. అదే ధాటి తరువాతి సెట్లలో కొనసాగించడంలో చతికిలపడింది. పలు ఎర్రర్స్ సింధూ చేయడం యమగుచికి కలిసివచ్చింది. తరువాతి రెండు సెట్లను 21-18, 21-15తో నెగ్గి సెమీఫైనల్లో ప్రవేశించింది.

**అదే దారిలో లక్ష్యసేన్**

ఇక 2021 ప్రపంచ ఛాంపియన్ షిప్ బ్రాంజ్ మెడలిస్ట్, ఏడో సీడ్ లక్ష్యసేన్ కూడా సింధూ బాటలోనే పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు. రెండో సీడ్ కున్లావుత్ విటిదసర్న్ 21-19, 21-16తో 53 నిమిషాల్లో లక్ష్యసేన్ పై గెలుపొందాడు. తొలి సెట్‌ను గట్టి పోటీ ఇచ్చిన లక్ష్యసేన్... రెండో సెట్‌లో పుంజుకోలేక చతికిల పడ్డాడు. సింధూ, లక్ష్యసేన్ ఓటమితో సింగిల్స్‌లో భారత్ సవాల్ ముగిసింది.


**సెమీస్‌లో భారత్ జోడీ**

ఇక టాప్ సీడ్ సాత్విక్ సాయిరాజ్ -చిరాగ్‌షెట్టి జోడీ పురుషుల డబుల్స్‌లో భారత్ సవాల్‌ను కొనసాగిస్తున్నారు. క్వార్టర్స్‌లో ఈ జోడీ అలవోకగా 21-12, 21-13తో వరుస సెట్లలో జపాన్ జోడీ తకుమి నోమురా- యుయిచి షిమోగామిపై గెలుపొంది సెమీస్‌లోకి దూసుకెళ్లారు. 41 నిమిషాల్లోనే భారత్ జోడీ క్వార్టర్‌ఫైనల్ ముగించింది. మరో టైటిల్ దిశగా దూసుకెళుతోంది.



## చెలరేగిన ఓపెనర్లు మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లిస్

# చెన్నైపై లక్నో సూపర్ విన్




**లక్నో:** చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్ ఆశలకు లక్నో సూపర్ జెయింట్ ఝలక్ ఇచ్చింది. దాని వరుస విజయాలకు చెక్ పెట్టింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లిస్ చెలరేగి ఆడడంతో సీఎస్‌కేను తమ సొంతగడ్డపై 7 వికెట్ల తేడాతో ఓడించింది. ఇప్పటికే ప్లే ఆఫ్‌కు దూరమైన లక్నోకు ఇది ఊరటనిచ్చే విజయం. కాగా చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్ అవకాశాలు క్లిష్టమయ్యాయి. చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవడంతో పాటు మిగతా జట్ల సమీకరణలపై ఆధారపడాల్సిన పరిస్థితి.

188 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు ఓపెనర్లు మిచెల్ మార్ష్(38 బంతుల్లో 90; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు)... జోష్ ఇంగ్లిస్(32 బంతుల్లో 36) జతగా ఫ్లయింట్ స్టార్ట్ ఇచ్చాడు. చెన్నై బౌలర్లపై ఫోర్లు, సిక్స్‌లతో విరుచుకుపడుతూ తొలి వికెట్‌కు 12 ఓవర్లలోనే 135 రన్స్ అందించాడు. ఈ క్రమంలో 21 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేసిన మార్ష్.. ఈ సీజన్‌లో రెండో సెంచరీ సాధించే ఊపులో కనిపించాడు. అయితే అతన్ని ముకుల్ చౌదరీ రనౌట్ చేశాడు. ఆ తర్వాత ఒకటి రెండు వికెట్లు వేగంగా కోల్పోయినా, నికోలస్ పూరన్(17బంతుల్లో 32నాటౌట్), ముకుల్ చౌదరీ(13 నాటౌట్) ధాటిగా ఆడారు. దీంతో 16.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్నో విజయాన్ని అందుకుంది.

అంతకుముందు చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 187 పరుగులు చేసింది. సంజూ శాంమ్సన్(20) మరోసారి నిరాశపరచగా, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(13), ఉర్విల్ పటేల్(6) కూడా తక్కువ పరురుగులకే పెవిలియన్ చేరారు. ఈ దశలో కార్తీక్ శర్మ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. లక్నో బౌలర్లపై విరుచుకుపడుతూ 42 బంతుల్లోనే 6 ఫోర్లు, ఒ సిక్స్‌లతో 71 పరుగులు సాధించాడు. మరోవైపు డీవాల్డ్ బ్రెవిస్(25), శివమ్ దూబే(16 బంతుల్లో 32) స్లాగ్ ఓవర్లలో ధాటిగా ఆడడంతో స్కోరు చెన్నై సూపర్ కింగ్స్ స్కోఉ 180 దాటింది. లక్నో బౌలర్లలో ఆకాష్ సింగ్ మూడు వికెట్లు.. షమీ, షాబాజ్ చెరో వికెట్ పడగొట్టారు.



# ఉప్పల్ మ్యాచ్ టికెట్ ధరలు డబుల్

**హైదరాబాద్, మే 15(వార్త క్రీడా ప్రతినిధి)**

ఐపీఎల్ 2026 సీజన్ చివరి అంకానికి చేరుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ముందు రెండు మ్యాచ్‌లే మిగిలాయి. 18న సీఎస్‌కేతో చెన్నైలో, 22న ఆర్సీబీతో ఉప్పల్ స్టేడియంలో తలపడనుంది. 22న జరిగే మ్యాచ్‌కు ఎక్కడా లేని హైప్ వచ్చింది. కారణం ఈ సీజన్ లో హైదరాబాద్ లో ఇదే లాస్ట్ మ్యాచ్ కావడం.. మరోవైపు కోహ్లీ ఆడనుండటం. అందునా కోహ్లీ సూపర్ ఫామ్‌లో ఉండటం. బిగ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న కోహ్లీ ఆటను ప్రత్యక్షంగా చేసేందుకు క్రికెట్ ప్రియులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ మ్యాచ్ టికెట్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఈ డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటూ మ్యాచ్ టికెట్ ధరలను సన్‌రైజర్స్ యాజమాన్యం భారీగా పెంచింది. టికెట్ రేట్లను ఒక్కసారిగా డబుల్ చేసింది. ఈ మ్యాచ్‌కు టికెట్ బుకింగ్స్ శుక్రవారం డిస్ట్రిక్ యాప్‌లో ప్రారంభమయ్యాయి. బుకింగ్స్ అలా ఓపెన్ అయిన నిమిషాల్లోనే టికెట్ల కోసం అభిమానులు పోటీ పడ్డారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో లక్షల మంది ఫ్యాన్స్ ఉన్నారు. టికెట్ ధరలు ఈ స్థాయిలో పెంచడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోహ్లీ అభిమానాన్ని క్యాష్ చేసుకోవడం ఏంటని మండిపడుతున్నారు. కాసేపట్లోనే సోల్డ్ ఔట్ అని పెట్టి.. టికెట్లను బ్లాక్ మార్కెట్ లోకి మళ్లిస్తున్నారని క్రికెట్ అభిమానులు ఆరోపిస్తున్నారు. బ్లాక్ టికెట్ దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. టికెట్ ధరలు భారీగా పెంచడమే కాకుండా అసలు టికెట్లు అందుబాటులో లేకుండా చేయడమేంటని ముఖ్యంగా కోహ్లీ ఫ్యాన్స్ మండిపడుతున్నారు.

**పెరిగిన ధరలు**

950 రూపాయల టికెట్ 2000కు, 1500 ఉన్న టికెట్ 3వేలకు, 1910 ఉన్న టికెట్ 3వేల 500కు, 2వేల 500 ఉన్న టికెట్ 4వేల 500కు, 4వేల 500 ఉన్న టికెట్ 6వేలకు, 7 వేలు ఉన్న టికెట్ ధర 10 వేల రూపాయలకు 23 వేలు ఉన్న బాక్స్ టికెట్ ధర 30 వేల రూపాయలకు, 30వేలు ఉన్న కార్పోరేట్ బాక్స్ టికెట్ ధర 45వేలకు పెంచి ఆన్‌లైన్‌లో సన్‌రైజర్స్ యాజమాన్యం టికెట్లను అమ్ముతోంది.

## ఇటాలియన్ ఓపెన్ సెమీస్‌లో సినర్

# జోకోవిచ్ రికార్డు బ్రేక్


**రోమ్:** ఇటలీయన్ ఓపెన్ సెమీఫైనల్ చేరడం ద్వారా ప్రపంచ నెంబర్ వన్ యానిక్ సినర్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నోవాక్ జోకోవిచ్‌ను వెనకినక నెట్టి మాస్టర్స్ సిరీస్ టోర్నీలో అత్యధిక వరుస విజయాలు సాధించిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. ఈ ఏడాదిలో ఇటలీ స్టార్ సినర్‌కు ఇది వరుసగా 32వ విజయం. సెర్బియా దిగ్గజం నోవాక్ జోకోవిచ్ 2011లో వరుసగా 31 విజయాల రికార్డు దీంతో బ్రేక్ అయింది. అలాగే వరుసగా అయిదు మాస్టర్స్ ఓపెన్‌లలో సెమీఫైనల్ చేరిన నాదల్ రికార్డును సినర్ సమం చేశాడు.

ఈ ఏడాది అద్భుత ఫామ్ చాటుతున్న యానిక్ సినర్... సొంతగడ్డ ఇటలీయన్ ఓపెన్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో 6-2, 6-4తో వరుస సెట్లలో 12వ సీడ్ ఆండ్రీ రుబ్లోవ్‌ను ఓడించాడు. తొలి సెట్‌ను అలవోకగా 6-2తో నెగ్గిన సినర్‌కు రెండో సెట్‌లో రుబ్లోవ్ నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైంది. అయినా సినర్ సెమీస్ చేరకుండా నిలవరించలేకపోయాడు. సెమీఫైనల్లో మెద్వదేవ్ (రష్యా)తో తలపడనున్నాడు. ఇప్పటివరకు వరుసగా అయిదు మాస్టర్స్ టైటిల్స్ సాధించిన సినర్.. ఆరో టైటిల్‌పై ఫోకస్ పెట్టాడు.

ఈ ఇటాలియన్ ఆటగాడు అన్ని పోటీలలో కలిపి గత 47 మ్యాచ్‌ల్లో కేవలం రెండుసార్లు మాత్రమే పరాజయం పొందాడు. షాంఘైలో మూడవ రౌండ్‌లో ఓడిన తర్వాత సినర్... వరుసగా పారిస్, ఇండియన్ వెల్స్, మయామి, మాంటెకార్లో, మాడ్రిడ్‌లలో మాస్టర్స్ 1000 టైటిళ్లను కైవసం చేసుకున్నాడు.

**ఫైనల్లో కొకొ గాఫ్, ఎలీనా స్విటోలినా**


మహిళల సింగిల్స్ ఫైనల్లో అమెరికాకు చెందిన మూడో సీడ్ కొకొ గాఫ్..ఏడోసీడ్ ఎలీనా స్విటోలినా(ఉక్రెయిన్)తో తలపడనుంది. సెమీఫైనల్లో కొకొ గాఫ్ 6-4, 6-3తో వరుస సెట్లలో రొమేనియా క్రీడాకారిణి క్రిస్టియాపై గెలుపొందగా... స్విటోలినా మూడు సెట్ల హోరాహోరీ పోరులో 6-4, 2-6, 6-2తో నాలుగో సీడ్‌ఇగా స్విటెక్(పోలాండ్)ను కంగుతినిపించింది.



# 28.4 బిలియన్ డాలర్లకు పెరిగిన వాణిజ్యలోటు

**న్యూఢిల్లీ, మే 15:** భారత్‌నుంచి ప్రపంచ దేశాలకు జరిగే ఎగుమతులు ఏప్రిల్‌లో 13.6 శాతం పెరిగి 80.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు చెలరేగినప్పటికీ ఎగుమతుల్లో ఎక్కడా ప్రతికూలత ఎదురుకాలేదన్నారు. వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ ఎగుమతులు ప్రాంతీయ సవాళ్ల ఎదురైనా పెరుగుతూనే ఉన్నాయని కొత్త విదేశీ మార్కెట్లకు కొత్త ఉత్పత్తుల మార్కెట్లను అన్వేషించడంతో ఎగుమతులు పెరిగినట్లు తెలిపారు. ఉత్పత్తుల ఎగుమతులు ఏప్రిల్‌లో 38.28 బిలియన్ డాలర్లనుంచి 43.56 బిలియన్ డాలర్ల వరకూ ఉన్నాయి. సేవల రంగ ఎగుమతులు 32.8 బిలియన్ డాలర్లనుంచి 37.2 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక భారత్ మొత్తం దిగుమతులు కూడా ఏప్రిల్‌లో 82.3 బిలియన్ డాలర్ల నుంచి 88.6 బిలియన్ డాలర్లకు పెరిగాయి. దీనితో వాణిజ్యలోటు 27.1 బిలియన్ డాలర్ల నుంచి 28.4 బిలియన్ డాలర్లకు పెరిగింది. చైనానుంచి భారత్ ఎక్కువ దిగుమతులు చేసుకుంటుంటే అమెరికాకు భారత్ ఎక్కువ ఎగుమతులు చేస్తోంది. కొత్తగా 1821 కొత్త ఉత్పత్తి మార్కెటింగ్ దేశాలను కూడా గుర్తించింది. విభిన్న దేశాలకు ఎక్కువ ఎగుమతులుచేసే లక్ష్యంతో ఉంది. అలాగే అత్యధిక విలువలున్న ఉత్పత్తి కేటగిరీలకు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో స్థానం ఎక్కువ ఉంది. ఎగుమతుల్లో నౌకలు, పడవలు, జలవనరుల వస్తువులు 19 కొత్త మార్కెట్లలో 57 మిలియన్ డాలర్ల రాబడులు తెచ్చాయి. ఇక న్యూక్లియర్ రియాక్టర్, బాయిలర్ విడిభాగాలు 13 కొత్త మార్కెట్లకు ఎగుమతులతో 14.3 మిలియన్ డాలర్ల సమకూరినట్లు రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ఇక ఏప్రిల్‌నెల దిగుమతుల్లో బంగారం దిగుమతులు 5.63 బిలియన్ డాలర్లకు పెరిగాయి. విలువలు భారీగా పెరగడమే కారణం.పరిమాణం తగ్గినప్పటికీ విలువలు పెరిగాయి. దిగుమతుల కట్టడికే ప్రభుత్వం 6 శాతం ఉన్న సుంకాలను 15శాతానికి పెంచింది.

# పసిడి ధరల జోరుకు బ్రేక్



**ముంబయి, మే 15:** దేశీయ మార్కెట్లలో కొద్దినెలలుగా పరుగులు పెడుతున్న బంగారం ధరల జోరుకు బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, కేంద్రం దిగుమతి సుంకాలను పెంచడం వంటి కారణాలతో శుక్రవారం దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండిధరలు భారీగా పతనమయ్యాయి. కొనుగోలుదారులకు ఇది కాస్త ఊరటనిచ్చే విషయమనే చెప్పాలి. శుక్రవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.2,240 తగ్గి రూ.1,60,090 వద్దకు చేరింది. ఇక, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా2,050 తగ్గి రూ.1,46,750 వద్ద ట్రేడ్ అవుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా పయనించింది. కిలో వెండి ధరపై ఏకంగా రూ.10,000 కోత పడటంతో ప్రస్తుతం రూ.3.05 లక్షల వద్ద కొనసాగుతోంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,60,090గా ఉండగా, ఢిల్లీలో రూ.1,60,240గా ఉంది. చెన్నైలో మాత్రం కాస్త ఎక్కువగా రూ.1,63,390 వద్ద ట్రేడవుతోంది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రధాన నగరాల్లోనూ కిలో వెండిధర రూ.3.05 లక్షల వద్దనే కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే దేశవ్యాప్తంగా పసిడి, వెండి ధరల్లో భారీ తగ్గుదల నమోదైంది.

# స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, మే 15:** దేశీయ ఈక్విటీ సూచీలు వారాంతంలో స్వల్పనష్టాలతో ముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 160.73 పాయింట్ల క్షీణించి 75,237.99 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 46.10 పాయింట్లు క్షీణించి 23,643.50 పాయింట్లవద్ద నిలిచింది. గడచిన రెండు సెషన్లలో ఎన్సెక్స్ 1.13శాతం, నిఫ్టీ 50 సూచీ 1.33వాతం పెరిగాయి. శుక్రవారం మార్కెట్లలో హిందాల్కో 3.47శాతంపెరిగితే రిలయన్స్ 1.67 శాతం, ఎస్‌బిఐ 0.10శాతం క్షీణించాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.48 శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.37శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్లలో ఎన్ఎస్ఇలో 1215 షేర్లుపెరిగితే 2027 షేర్లు క్షీణించాయి. 124 షేర్లు స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు ట్రేడింగ్ ముగిసే నాటికి 95.86గా జరిగిందని తెలుస్తోంది. ముందురోజు 95.64 కంటే గణనీయంగా క్షీణించింది. పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 7.076శాతంగా కూపన్‌రేటు కొనసాగుతోంది. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్ సెటిల్‌మెంట్లు రూ.1,59,154గా ఉన్నాయి. పదేళ్ల అమెరికా బాండ్లు 1.88శాతం పెరిగి 4.541గా కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలోబ్రెంట్ ముడిచమురు జులై సెటిల్‌మెంట్లు 2.92 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 108.64డాలర్లుగా కొనసాగింది. దేశీయంగా నజారా టెక్నాలజీస్ 12.69శాతం, యునైటెడ్ స్పిరిట్స్ 3.34శాతం, పెర్ల్ గ్లోబల్ ఇండస్ట్రీస్ 9.89శాతం, షీలా ఫోమ్ 11.90 శాతం చొప్పున పెరిగాయి. హిందూస్థాన్ జింక్ 4.97శాతం, అపోలో టైర్స్ 1.75శాతం, దిలీప్ బిల్డ్‌కాన్ 6.44శాతం క్షీణించాయి. కల్పతరు ప్రాజెకట్స్ ఇంటర్నేషనల్ 2.55శాతం, సలారా యాక్టివ్‌ఫార్మా సైన్సెస్ 13.66శాతం పెరిగితే ఇండియన్ హ్యూమ్‌పైప్ కంపెనీ 4.83శాతం, ఆల్‌కార్గో లాజిస్టిక్స్ 2.54శాతం చొప్పున క్షీణించాయి. కార్పొరేట్ ఆర్థిక ఫలితాల్లో ఒత్తిడివల్లనే ఈకంపెనీలు క్షీణించినట్లు తెలుస్తోంది.

# 150 ఎన్‌బిఎఫ్‌సిల రిజిస్ట్రేషన్ రద్దుచేసిన ఆర్బీఐ




**ముంబై, మే 15:** రిజర్వుబ్యాంకు నిర్దేశించిన నిబంధనలు పాటించడం లేదన్న అభియోగాలపై ఆర్బీఐ ఏకంగా 150 నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు కేంద్ర బ్యాంక్ తెలిపింది. లైసెన్సులు రద్దయిన ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల్లో అత్యధికంగా పశ్చిమ బెంగాల్, ఢిల్లీలోనే ఉన్నట్లు తెలిపింది. ముఖ్యంగా కోల్‌కత్తా ప్రాంతంలో అత్యధికంగా ఉన్నాయని పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్ 1934లోని సెక్షన్ 45 ఐఎ (6) కింద దఖలు పడిన అధికారాలను ఉపయోగించి కేంద్ర బ్యాంకులు పలు కంపెనీల సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసిందని ఆర్‌బీఐ స్పష్టంచేసింది. లైసెన్సులు రద్దయిన కంపెనీల్లో కొన్ని స్మాల్ అండ్ మీడియం సైజ్ ఫైనాన్స్, ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలున్నాయి. ఈ సంస్థలు రుణాలు ఇవ్వడం, లీజింగ్, పెట్టుబడుల వంటి ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని ఆర్‌బీఐ తెలిపింది. ఈ జాబితాలో తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్, హరియాణా రాష్ట్రాల్లోని కంపెనీలు సైతం ఉన్నాయని వెల్లడించింది. లైసెన్స్ రద్దయిన కంపెనీలు ఆర్‌బీఐ చట్టం 1934లోని సెక్షన్ 45లోని క్లాజ్ (ఎ)లో నిర్వచించిన విధంగా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ వ్యాపారాన్ని నిర్వహించకూడదని స్పష్టం చేసింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు అంటే ఇవి ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు. ఇవి రుణాలు ఇవ్వడం, పెట్టుబడులు పెట్టడం సహా బ్యాంకుల మాదిరిగా ఇతర ఫైనాన్షియల్ సర్వీసులను అందిస్తుంటాయి. వాటికి బ్యాంకింగ్ లైసెన్స్ ఉండదు.


అయినప్పటికీ ఆర్‌బీఐ చట్టం ద్వారా రిజర్వ్ బ్యాంక్ నియంత్రణలో ఉంటాయి. సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ రద్దు అంటే ఆయా కంపెనీలు ఇకపై ఎన్‌బీఎఫ్‌సీలుగా కార్యకలాపాలు నిర్వహించడం కుదరదు. సెంట్రల్ బ్యాంక్ నియంత్రణలో ఉండే ఎలాంటి ఫైనాన్షియల్ బిజినెస్ పనులు చేయకూడదు. రుణాలజారీ, పెట్టుబడుల సమీకరణ వంటివి చేయడానికి వీలులేదు. ఎన్‌బీఎఫ్‌సీలు నిర్వహించే ఏ ఆర్థిక పరమైన వ్యాపార కార్యకలాపాలను నిర్వహించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

# 95.86కు పడిపోయిన దేశీయ కరెన్సీ



**ముంబయి,మే 15:** డాలరుతో రూపాయి చెలామణి రికార్డు స్థాయికి పడిపోయింది. వారాంతంలో అంటే శుక్రవారం సాయంత్రానికి 96 రూపాయలకు చేరింది. ముడిచమురుధరలు పెరగడం, ద్రవ్యోల్బణ ఆందోళనలు వంటివి రూపాయిని మరింత క్షీణింపచేసాయి. 95.86వద్ద ట్రేడింగ్ ముగిసింది. ఈ ఏడాది ఇప్పటివరకూ ఆరుశాతం నష్టపోయింది. గడచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సుమారు రెండుశాతంగా క్షీణించింది. పశ్చిమాసియా యుద్ధం ఉద్రిక్తతలు మరింతగా క్షీణింపచేసాయి. డాలర్ సూచీ పైపైకి ఎగబాగడం, అమెరికా రిటైల్ సేల్స్‌పటిష్టం కావడం, కార్మిక మార్కెట్ గణాంకాలు స్థిరంగా కొనసాగడం, ఫెడ్ రిజర్వు రేట్‌కట్స్ కూడా తగ్గిస్తుందన్న అంచనాలతో డాలర్ సూచీ పైపైకి ఎగబాకింది. ఫోరెక్స్ ట్రేడర్ల కథనం ప్రకారం భౌగోళిక అనిశ్చితి పరిస్థితులు, ఎఐ ఆధారిత పెట్టుబడుల అవకాశాలు వంటివి మూలధన నిధుల రాకపై భారం పెంచాయి. దీనికితోడు ఎఫ్‌డిఐలు దేశీయ మార్కెట్లలోకి రావడం కూడా తగ్గింది.అదే సమయంలో ముడిచమురుదరలు భారీగాపెరిగాయి. దీనివల్ల డాలర్ చెల్లింపులు పెరగడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది.

ఇంటర్‌బ్యాంక్ ఫోరెక్స్ కౌంటర్‌లో రూపాయి 95.86వద్ద ప్రారంభం అయి రికారు్డ కనిష్టం అంటే 96.14కి సైతం చేరింది. అంతకుముందు రోజుకంటే 50 పైసలు క్షీణించి చివరకు 95.86 పైసలవద్ద ముగిసింది. ముందురోజుకంటే 22 పైసలు క్షీణించింది. ఆర్బీఐ జోక్యంచేసుకుని డాలర్ల విక్రయాల కౌంటర్లు ప్రారంభించడంతో కొంతమేర కట్టడి అయింది. బ్రెంట్‌ముడిచమురు 3.14శాతంపెరిగి బ్యారెల్‌కు 109.04 డాలర్లుగా కొనసాగింది.విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో 187.46 కోట్లు పెట్టుబడులుపెట్టారు.




# అందుబాటులోకి ఐటి రిటర్న్ ఫారాలు

**న్యూఢిల్లీ, మే 15:** పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి (2025-26 ఆర్థిక సంవత్సరం) సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్లు (ఐటీఆర్) దాఖలు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు ఐటీఆర్1 (సహజ్), ఐటీఆర్4 (సుగం) ఫారాలకు సంబంధించిన ఎక్సెల్ యుటిలిటీలను ఈఫైలింగ్ పోర్టల్‌లో అందుబాటులోకి తెచ్చింది. పన్ను చెల్లింపుదారులు ఇప్పుడు ఈ రెండు ఫారాలను ఆన్‌లైన్‌లో నేరుగా ఫైల్ చేయవచ్చని లేదా ఎక్సెల్ యుటిలిటీని డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్‌లో కూడా నింపవచ్చని స్పష్టం చేసింది. ఆఫ్‌లైన్‌లో ఫారమ్ నింపిన వారు, ఆ తర్వాత ఫైల్‌ను ఈ ఫైలింగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆడిట్ పరిధిలోకి రాని పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నులను దాఖలు చేయడానికి సాధారణంగా జులై 31 చివరి తేదీగా ఉంటుంది. ఐటీఆర్1 సహజ్ ఫారాన్ని రూ.50 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న నివాస భారతీయులు ఉపయోగించవచ్చు. ఐటీఆర్4 సుగం ఫారాన్ని రూ.50 లక్షల వరకు ఆదాయం ఉన్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు, ఎల్‌ఎల్‌పీలు మినహా ఇతర సంస్థలు దాఖలు చేయవచ్చు. ఈ అసెస్‌మెంట్ సంవత్సరానికిగాను కేంద్ర ప్రత్యక్ష పన్నులబోర్డు సిబిడిటి ఇప్పటికే కొత్త నిబంధనలతో కూడిన ఐటీఆర్ ఫారాలను నోటిఫై చేసింది. దీని ప్రకారం లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్, షేర్ల బైబ్యాక్ లావాదేవీల వల్ల కలిగిన నష్టాలు వంటి అదనపు వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5.12 వృద్ధితో రూ.23.40 లక్షల కోట్లకు చేరినట్లు సీబీడీటీ డేటా చెపుతోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.